

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 291

గురువారం 11-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఆఖర్లో కొనుగోళ్లు

నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు.. ఆదుకున్న రిలయన్స్, ఐసీఐసీఐ షేర్లు - 13లో



ప్రపంచకప్‌కు ముందు ఒకసారి


ద్వైపాక్షిక టి20 సిరీస్ బరిలో భారత్. నేడు అఫ్గానిస్తాన్‌తో తొలి మ్యాచ్. - 12లో



విశ్వ మిత్ర భారత్

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులున్న నేటి తరుణంలో భారత్ ఒక నూతన ఆశారేఖగా ఆవిర్భవించిందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



వినూత్నమైన కోవిడ్ వ్యాక్సిన్

బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సైంటిస్టులు వినూత్నమైన కోవిడ్-19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు.

- వివరాలు 6లో



షిండే వర్గమే అసలైన శివసేన

మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన రాజకీయ పార్టీ అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ తేల్చేశారు.

- వివరాలు 6లో



'అయోధ్య'కు సోనియా దూరం

అయోధ్యలో జనవరి 22న జరిగే ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి దూరంగా ఉండాలని మల్లికార్జున ఖర్గే, సోనియా నిర్ణయించుకున్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

చంద్రబాబు పనికిరాని వ్యక్తి.. పచ్చి మోసగాడు



''చంద్రబాబు పచ్చి మోసగాడు.. ఈ రాష్ట్రానికి పనికిరాని వ్యక్తి అని తెలిసి కూడా విజయవాడపై ప్రేమ, నియోజకవర్గం కోసమే టీడీపీలో ఇంతకాలం ఉన్నా..'' అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు.

- వివరాలు 10లో

పట్టాలు తప్పిన 'చార్మినార్ ఎక్స్‌ప్రెస్'



చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు నాంపల్లి స్టేషన్‌లో పట్టాలు తప్పింది. ఈ ఘటనలో మూడు బోగీలు దెబ్బతినగా, ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. తాంబరం (చెన్నై) రైల్వేస్టేషన్ నుంచి వచ్చే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతిరోజూ ఉదయం 6.15 గంటలకు నాంపల్లిలోని 5వ నంబరు ప్లాట్‌ఫారంపైకి చేరుకుంటుంది.

- వివరాలు 16లో

కారుణ్య నియామకాలకు ఆర్టీసీ ఓకే..



ఎట్టకేలకు కారుణ్య నియామక ప్రక్రియకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులకోసం కారుణ్య నియామకాల కింద కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించింది. బ్రెడ్ విన్నర్ స్కీం కింద ఈ నియామక ప్రక్రియ కొనసాగనుంది. ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు 1,600 కుటుంబాలు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నాయి.

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



..దొంగ ఓటు అడ్రస్ వెతుక్కుంటూ వస్తే ఇక్కడకొచ్చాం సార్!

సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో భట్టి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి



గత పీపీఏలపై నివేదిక ఇవ్వండి

విద్యుత్ శాఖపై సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- నిబంధనలు, ఈఆర్సీ అనుమతులు, విద్యుత్ కొనుగోలు ధరలు పొందుపరచండి
- అధిక ధరతో విద్యుత్ ఒప్పందాలు ఎందుకు చేసుకున్నారో వివరించండి
- ఇకపై తక్కువ ధరకు లభించే విద్యుత్ మాత్రమే కొనుగోలు చేయాలి
- కొత్తగా రాష్ట్ర సమగ్ర విద్యుత్తు విధానానికి రూపకల్పన..

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ)పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014 నుంచి ఇప్పటివరకు విద్యుదుత్పత్తి కంపెనీలతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కుదుర్చుకున్న అన్నిరకాల పీపీఏలపై సమగ్ర అధ్యయనం జరిపి నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర అంశాలతో పాటు పీపీఏలకు సంబంధించిన నిబంధనలు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నుంచి పొందిన అనుమతులు, విద్యుత్ కొనుగోలు ధరలు నివేదికలో ఉండాలని అన్నారు. అధిక ధరతో విద్యుత్ కొనుగోలు చేసేందుకు జరిగిన ఒప్పందాలకు కారణాలను కూడా వివరించాలని కోరారు. ఇకపై బహిరంగ మార్కెట్లో ఎవరు తక్కువ ధరకు విద్యుత్ విక్రయిస్తున్నారో వారి వద్ద నుంచే విద్యుత్ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, డి.శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, భవిష్యత్తులో పెరిగే రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి వీలుగా కొత్త విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల, ఎన్నికల హామీ మేరకు గృహజ్యోతి పథకం కింద గృహ వినియోగదారులకు ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. జెన్‌కో ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యుదుత్పత్తి, ఇతర విద్యుదుత్పత్తి

మిగతా 2వ పేజీలో ▶

సమగ్ర విధానం లేక సమస్యలు

రాష్ట్రానికి సమగ్ర విద్యుత్ విధానం లేక ఎన్నో రకాల సమస్యలు ఉత్పన్నమయ్యాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వివిధ రాష్ట్రాల విద్యుత్ విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి, శాసనసభలో అన్ని రాజకీయ పక్షాలతో విస్తృతంగా చర్చించిన తర్వాత కొత్తగా సమగ్ర విద్యుత్ విధానాన్ని రూపొందిస్తామని ప్రకటించారు. ఇందుకోసం విద్యుత్ రంగ నిపుణులతో సైతం విస్తృతంగా సంప్రదింపులు నిర్వహిస్తామన్నారు. ఇతర అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన విద్యుత్ విధానానికి రూపకల్పన చేస్తామన్నారు.

కొత్త టీఎస్‌పీఎస్సీకి లైన్‌క్లియర్..!

చైర్మన్, ముగ్గురు సభ్యుల రాజీనామాలకు గవర్నర్ ఆమోదం

వీరి స్థానంలో కొత్తవారితో పాటు మరో ఐదుగురు సభ్యుల నియామకంపై ప్రభుత్వం దృష్టి!

- ఒకట్రెండు రోజుల్లో నియామకాల ప్రక్రియ ప్రారంభించే అవకాశం
- కమిషన్ ప్రక్షాళనకు ఇప్పటికే సర్కారు కసరత్తు
- యూపీఎస్సీని సందర్శించిన రేవంత్, ఉత్తమ్, సీఎస్
- రాజీనామాల ఆమోదంలో ఎలాంటి జాప్యం జరగలేదన్న రాజ్‌భవన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్తగా చైర్మన్, సభ్యుల నియామకానికి మార్గం సుగమమైంది. సర్కారీ కొలువుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ఉపశమనం లభించనుంది. దాదాపు నెలరోజులుగా పెండింగ్‌లో ఉన్న చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యుల రాజీనామాలకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ బుధవారం ఆమోదం తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో చైర్మన్‌తో పాటు 10 సభ్యులుంటారు. కానీ గత ప్రభుత్వం చైర్మన్, ఆరుగురు సభ్యులను మాత్రమే నియమించింది. వీరిలో ఒక సభ్యుడు పదవీ విరమణ పొందగా..ఐదుగురు కొనసాగుతూ వచ్చారు. అయితే ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో చైర్మన్ బి.జనార్దన్ రెడ్డి, సభ్యులు ఆర్.సత్యనారాయణ, ప్రొఫెసర్ బండి లింగారెడ్డి, కె.రవీందర్ రెడ్డి రాజీనామాలు సమర్పించారు. మిగతా ఇద్దరు సభ్యులు కోట్ల అరుణకుమారి, సుమిత్రా ఆనంద్ తనోబా రాజీనామా చేయలేదు. కొత్తగా కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటే అప్పటివరకు ఉన్న కమిషన్ పదవీ కాలం పూర్తి కావడమో లేక రాజీనామాలు చేస్తే వాటిని ఆమోదించడమో జరగాలి. కానీ చైర్మన్, ముగ్గురు సభ్యులు సమర్పించిన రాజీనామా లేఖలపై గవర్నర్ వెంటనే నిర్ణయం తీసుకోకుండా కొంతకాలం పెండింగ్‌లో పెట్టారు. తాజాగా ఆమోదం లభించడంతో కొత్త కమిషన్ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. రాజీనామాలు చేసిన చైర్మన్, ముగ్గురు సభ్యుల స్థానంలో కొత్తవారిని నియమించడంతో పాటు ఎప్పట్నుంచో ఖాళీగా ఉన్న 4 స్థానాలు, అలాగే పదవీ విరమణ చేసిన సభ్యుడి స్థానాన్ని ప్రభుత్వం భర్తీ చేసే

మిగతా 2వ పేజీలో ▶

పక్కాగా ధరణి అధ్యయనం!



- కొత్తగా ఏర్పాటైన కమిటీ యోచన
- రైతులు తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా ఫోకస్
- పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై కూడా దృష్టి
- నేడు కమిటీ తొలి సమావేశం
- 'భూమాత' కార్యాచరణపై నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూముల రికార్డుల నుంచి క్రయ విక్రయ లావాదేవీల వరకు అన్ని రకాల అంశాలతో ముడిపడి ఉన్న ధరణి పోర్టల్‌ను పక్కాగా అధ్యయనం చేసిన తర్వాతే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని దీనిపై కొత్తగా ఏర్పాటైన కమిటీ భావిస్తోంది. రైతులు తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా ఫోకస్ చేసి పనిచేయాలని, పూర్తి సమాచారాన్ని సేకరించి, రెవెన్యూ వ్యవహారాలతో సంబంధమున్న భాగస్వామ్య పక్షాలన్నింటితో చర్చించి ఫార్మర్స్ ఫ్రెండ్లీ (రైతులకు సులభంగా ఉండే)వెబ్‌సైట్ తయారు చేసే లక్ష్యంతో ముందుకెళ్లే ఆలోచనలో ఉంది. పోర్టల్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడం కూడా సవాలేనని, ఇందుకోసం సాంకేతిక నిపుణులతో కూడా సంప్రదింపులు జరపాలని ప్రాథమికంగా భావిస్తోంది. ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా చెప్పిన విధంగా భూమాత పోర్టల్‌ను రూపొందించే దిశలో భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ తొలిసారిగా గురువారం సమావేశం కానుంది.

నిషేధిత భూములు పెద్ద సవాల్!

కొత్తగా ఏర్పాటైన ధరణి కమిటీ ముందున్న ప్రధాన సమస్యల్లో నిషేధిత జాబితా భూములే ప్రధానాంశంగా మారనున్నాయి. ధరణి రికార్డుల ప్రకారం నిషేధిత (22ఏ) జాబితాలో చేరిన రైతుల పట్టా భూములను తిరిగి వారి పేరిట రికార్డు చేయడమే పెద్ద సవాల్‌గా మారనుంది. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చి ఆరేళ్లు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే నిషేధిత భూముల జాబితా రూపొందించారు. రెవెన్యూ వర్గాలిచ్చిన ఆ జాబితా ప్రకారం అప్పటి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్‌లో ఆయా భూముల సర్వే నంబర్లను అప్‌లోడ్ చేశారు. ఈ సర్వే నంబర్ల పరిధిలోనే రైతుల పట్టా భూములు కూడా ఉండేవి. అయితే రైతుల పట్టా భూములకు, నిషేధిత జాబితాలో పేర్కొన్న ప్రభుత్వ భూములకు వేర్వేరు బై నంబర్లు ఇవ్వడంతో

మిగతా 2వ పేజీలో ▶



'భయో' ఫెర్టిలైజర్..

రైతులకు భారంగా గోల్డ్ కంపోస్ట్

- బయో ఫెర్టిలైజర్ పేరిట బలవంతంగా 'గోల్డ్ కంపోస్ట్'తమకు అంటగడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇష్టం లేకపోయినా తప్పనిసరి కొనాల్సిందేనని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) ఒత్తిడి తెస్తున్నాయని చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో బహుళజాతి కంపెనీలు తక్కువ ధరకు ఇస్తున్నా, గోల్డ్ కంపోస్ట్‌ను అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

- వివరాలు 14లో



సీఈసీ రాజీవ్ కుమార్

ఓటర్ల జాబితాపై టీడీపీది బోగస్ ప్రచారమే!

- కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలతో సుస్పష్టం
- గతేడాది తొలగించిన ఓట్లను పునఃసమీక్షించాం: సీఈసీ
- 21 లక్షల ఓట్లలో 0.61% ఓట్ల విషయంలోనే తప్పులు
- తెలంగాణలో ఓటుండి ఏపీలో కూడా నమోదు చేస్తున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- 2 చోట్ల ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

- వివరాలు 16లో



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కేసీఆర్ రక్తాన్ని చెమటను ధారపోశారు

- విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు మళ్లించారు
- హామీలు అమలు చేయకుండా నిందలు వేస్తే సహించం
- తప్పుడు కేసులకు భయపడేది లేదు..
- కాంగ్రెస్‌కు అసలు సినిమా ముందుంది
- పాలనపైనే దృష్టి పెట్టి పార్టీకి తక్కువ సమయాన్ని కేటాయించాం
- బీఆర్ఎస్ శ్రేణులతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు తన రక్తాన్ని, చెమటను ధారపోశారు. విధ్వంసమైన తెలంగాణను పదేళ్ల పాటు శ్రమించి వికాసం వైపు మళ్లించారు. గ్రామీణ ఆర్థిక పరిపుష్టికి కేసీఆర్ కష్టపడ్డంతగా దేశంలో ఎవరూ కష్టపడలేదు. తెలంగాణను సత్వరంగా అభివృద్ధి చేయాలన్న తపనతో 99 శాతం సమయాన్ని పాలనకే కేటాయించారు' అని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పార్టీ శ్రేణులను

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

రాహుల్ యాత్రకు సీఎం రేవంత్ మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మరో మారు చేపట్టనున్న భారత్ జోడో యాత్రకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈనెల 14 నుంచి రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' చేపట్టనున్న విషయం తెలిసిందే. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత వాహనానికి భారత్ జోడో న్యాయ్ యాత్ర స్టిక్కర్‌ను అతికించి మద్దతు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి: తుమ్మల

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ పంటలకు బదులుగా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం తుమ్మల సచివాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలొస్తాయని, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది సంఘటితమై రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. అత్యంత నాణ్యతతో విజయ ఉత్పత్తులను వినియోగదారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఎండీ ఎం.సురేందర్, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించాలి

ఎండు మిర్చి కొనుగోలు ధరలు తగ్గిన నేపథ్యంలో క్రయవిక్రయదారులతో సంప్రదించి రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. ఎండు మిర్చి రైతుల సమస్యలపై బుధవారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

పరువు నష్టం కేసులో మంచు లక్ష్మికి ఊరట



సాక్షి, హైదరాబాద్: పరువునష్టం కేసులో నిందితురాలైన సినీనటి మంచులక్ష్మికి హైకోర్టులో ఊరట లభించింది. ఆమెపై దాఖలైన కేసులో విచారణను నాలుగు వారాలపాటు నిలిపివేస్తూ బుధవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. టీవీ5 చర్చా వేదిక కార్యక్రమానికి సంబంధించి జర్నలిస్టు సాంబశివరావు ఇచ్చిన ప్రైవేట్ ఫిర్యాదు మేరకు 2018లో పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సినీనటులు అలీ, మంచు లక్ష్మి, హేమ, ఝాన్సీ, ప్రగతి, నందినీరెడ్డి, రకుల్‌ప్రీత్‌సింగ్, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌పై కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు ట్రయల్‌కోర్టులో విచారణ దశలో ఉంది. అయితే తనపై ఎలాంటి ఆధారాలు లేకుండా, ఆరోపణలతోనే కేసు నమోదు చేశారని, దాన్ని కొట్టివేసేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మంచులక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కేసు నమోదు చేసేందుకు ప్రాథమికంగా ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు.

సీఎం రేవంత్‌కు 'కైట్, స్వీట్స్ ఫెస్టివల్' ఆహ్వానం


సాక్షి, హైదరాబాద్: ఈనెల 13 నుంచి 15 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ కైట్, స్వీట్స్ ఫెస్టివల్‌కు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు కలిశారు. కార్యక్రమంలో యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ డైరెక్టర్ కె.నిఖిల, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. మామిడి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నియామక ప్రక్రియ చేపట్టాలి

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాను గవర్నర్ ఆమోదించిన నేపథ్యంలో.. ప్రభుత్వం తక్షణమే నియామక ప్రక్రియ ప్రారంభించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి రియాజ్ కోరారు. లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

జగిత్యాలలో రీజినల్ పాస్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కేంద్ర విదేశాంగ శాఖమంత్రికి అర్వింద్ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: జగిత్యాల జిల్లాలో రీజినల్ పాస్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విదేశాంగ శాఖమంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. జగిత్యాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు గల్ఫ్ తదితర దేశాలకు వెళ్తుంటారని తెలిపారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా వాసులు పాస్‌పోర్ట్ పనుల కోసం నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్న సమీప రీజినల్ పాస్‌పోర్ట్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాలలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు అవసరమని అర్వింద్ మంత్రికి లేఖలో వివరించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామికంగా తెలంగాణ అభివృద్ధికి ముందుకు రండి

13 దేశాల దౌత్యవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

- కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద దౌత్యవేత్తలకు విందు



వివిధ దేశాల ప్రతినిధులతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని 13 దేశాల దౌత్యవేత్తలు, ఇతర ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అందుకు తగిన సూచనలు చేయాలని కోరారు. అన్ని దేశాలతో సత్సంబంధాలకి తమ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని కుతుబ్ షాహీ టూంబ్స్ వద్ద 13 దేశాల దౌత్యవేత్తలు, ఇతర ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆతిథ్యం ఇచ్చారు. అమెరికా, ఇరాన్, తుర్కియే, యూఏఈ, యూకే, జపాన్, థాయిలాండ్, జర్మనీ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఫిన్లాండ్ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి రేవంత్‌రెడ్డి స్వాగతం పలుకుతూ ప్రభుత్వం ప్రాధాన్యతలను వివరించారు. అభయహస్తం కింద అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ తదితర నేతల ఆశయాలను, మాజీ ప్రధాని ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, పారదర్శకతతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు వివరించారు.

సంక్షేమ రాష్ట్రంగా ఆవిర్భావం

తాము ప్రకటించి అమలు చేస్తోన్న ఆరు హామీలతో సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవిస్తుందని సీఎం రేవంత్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని సీఎం చెప్పారు. యువత భవిష్యత్తుకు, పారిశ్రామిక అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎంతో అమెజాన్ బృందం భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ అమెజాన్ ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమావేశమైంది. రాష్ట్రంలో అమెజాన్ సంస్థ పెట్టిన పెట్టుబడులు, భవిష్యత్తు వ్యాపార విస్తరణ ప్రణాళికల వంటి అంశాలను ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

పక్కాగా ధరణి అధ్యయనం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ భూముల లావాదేవీలు మాత్రమే నిలిచిపోయి, ప్రైవేటు భూముల లావాదేవీలు నిరాటంకంగా జరిగిపోయేవి. కానీ ధరణి పోర్టల్ ఏర్పాటైన తర్వాత స్టాంపుల శాఖ వద్ద ఉన్న సాఫ్ట్‌వేర్‌ను ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబర్ ఎక్కించినా ఎలాంటి బై నంబర్లు ఇవ్వకపోవడంతో సదరు సర్వే నంబర్‌లోని భూమి పూర్తిగా నిషేధిత జాబితాలోకి వెళ్లింది. దీంతో రైతులు తమ పట్టా భూముల్లోనూ ఎలాంటి లావాదేవీలు జరిపే అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. ఇలా నిషేధిత జాబితాలో పడిన పట్టా భూములు 10 లక్షల ఎకరాల వరకు ఉంటాయని భూసమస్యలపై పనిచేస్తున్న వారు చెపుతున్నారు.

గత ఏడాదిలోనే 30 వేల దరఖాస్తులు

తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ టీఎం15 కింద ఒక్క 2023లోనే 30 వేల దరఖాస్తులు ధరణిలో వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన కమిటీ ప్రధానంగా ఈ అంశంపైనే దృష్టి సారించనుందని, ధరణి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలు పరిష్కారమయ్యేలోపు నిషేధిత జాబితాను కొత్తగా తయారు చేయాల్సిందిగా రెవెన్యూ వర్గాలకు సిఫారసు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఆ జాబితాను మళ్లీ ధరణి లేదా భూమాత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తేనే రైతుల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని, లేదంటే మళ్లీ రెవెన్యూ వర్గాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిందేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిషేధిత జాబితాలో పట్టా భూములు

> రైతుల పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారు. వీటిని తొలగించుకోవడం కోసం రైతులు 2,3 ఏళ్లు తిరిగినా పరిష్కారం కావడం లేదు. అసలు 22ఏ జాబితాలోనే చాలా తప్పులున్నాయి. 2007 నుంచి 2023 వరకు తప్పులతో కూడిన డేటా ఎక్కించారు. రెవెన్యూ శాఖ కొత్త జాబితా తయారు చేసి దాన్ని అటు స్టాంపుల శాఖ, ఇటు ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ నిషేధిత జాబితా సమస్య పరిష్కారం కాకుండా ధరణి సమస్యలు తేలవు.
>
> – మన్నె నర్సింహారెడ్డి, ధరణి భూ సమస్యల వేదిక కన్వీనర్

పాలకులం కాదు.. సేవకులం

అందుకే ప్రజల వద్దకే పాలన తీసుకొస్తున్నాం

- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మరో మంత్రి తుమ్మల తదితరులు

కూసుమంచి: ప్రజలకు తాము పాలకులం కాదని, సేవకులమని.. ఇందిరమ్మ రాజ్యంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలనే వారి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచిలోని పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించిన అనంతరం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సభలో పొంగులేటి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వాన మంత్రులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తారని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి కాగానే అర్హులందరికీ ఆరు గ్యారంటీలు వర్తింపచేస్తామన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ నియంతృత్వ పాలనలో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన చేస్తామని తెలిపారు. కాగా, ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వంలో భూకబ్జాలు, ఆక్రమణలు జరిగాయని.. అవన్నీ బయటకు తీసి ప్రజల ఆస్తులు వారికే చెందేలా చూస్తామని పొంగులేటి ప్రకటించారు. అనంతరం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాకు గోదావరి జలాలు తీసుకువచ్చి సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వచ్చే వానాకాలం నాటికి వైరా, లంకాసాగర్ ప్రాజెక్టులకు గోదావరి జలాలు చేరుస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 30 లక్షల మందికి రైతుబంధు అందిందని, మిగిలిన వారికి ఈ నెలాఖరులోగా అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీఎస్‌పీఎస్సీకి లైన్‌క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందని తెలుస్తోంది. తద్వారా టీఎస్‌పీఎస్సీ కార్యకలాపాలు పునఃప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే రాజీనామాలు సమర్పించని ఇద్దరు సభ్యుల విషయంలో ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది.

పరీక్షలు, ఫలితాలు పెండింగ్‌లోనే..

వాస్తవానికి రాజీనామాలను గవర్నర్ ఆమోదించిన మరుక్షణమే టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమిస్తామని డిసెంబర్ 27న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు చేపడ్తామని, నిరుద్యోగులెవరూ ఆందోళనకు గురికావద్దని అన్నారు. దీంతో ఒకట్రెండు రోజుల్లోనే నియామక ప్రక్రియ చేపట్టే అవకాశాలున్నాయని అంటున్నారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ పరిధిలో దాదాపుగా అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. కొత్తగా ఉద్యోగ ప్రకటనల జారీ, ఇప్పటికే నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాల ప్రకటన, ఇదివరకు జారీ చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షల నిర్వహణ తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా గ్రూప్–1 మెయిన్స్, గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలతో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ తదితర ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఉద్యోగాలకు ప్రకటనలు జారీ అయ్యి ఏడాది గడుస్తోంది. పలుమార్లు పరీక్ష తేదీలు వెల్లడించి చివరి నిమిషంలో వాయిదా వేయడంతో అభ్యర్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. మరోవైపు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఫలితాలను వెల్లడించలేదు. వివిధ కేటగిరీల్లో దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీల భర్తీకి పరీక్షలు నిర్వహించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. అలాగే కొత్తగా ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వేయడంలేదు. ఇవన్నీ ముందుకు సాగాలంటే చైర్మన్, ఇతర సభ్యుల నియామకం అత్యంత అవసరం. కాగా టీఎస్‌పీఎస్సీ నియామకాలకు సంబంధించి సీఎస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేసినట్లు సమాచారం.

ముమ్మర కసరత్తు

టీఎస్‌పీఎస్సీ సమూల ప్రక్షాళనలో భాగంగా యూపీఎస్సీ, ఇతర రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరును అధ్యయనం చేయాలని రేవంత్‌రెడ్డి గత నెలలో అధికారులను ఆదేశించారు. ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన.. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎస్ శాంతికుమారితో కలిసి స్వయంగా యూపీఎస్సీ కార్యాలయాన్ని సందర్శించారు. సీఎం ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకాల కోసం మార్గదర్శకాలను ఇప్పటికే అధికారులు సిద్ధం చేసినట్టు తెలిసింది.

సిట్ దర్యాప్తుపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా నిర్ణయం: రాజ్‌భవన్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను ఆమోదించడంలో గవర్నర్ తాత్సారం చేస్తున్నారని వచ్చిన విమర్శలను రాజ్‌భవన్ తోసిపుచ్చింది. రాజీనామాల ఆమోదంలో ఎలాంటి జాప్యం జరగలేదని పేర్కొంది. చట్టపరమైన విధానాలకు లోబడి అత్యంత శ్రద్ధతో ఒక్కరోజులోనే రాజీనామాల ఆమోద ప్రక్రియను గవర్నర్ పూర్తి చేశారని తెలిపింది. గవర్నర్ బుధవారం రాజీనామాలను ఆమోదించిన వెంటనే ఈ మేరకు వివరణ ఇచ్చింది. నిబంధనల ప్రకారం రాజీనామాలను గవర్నర్ క్షుణ్ణంగా పరిశీలించారని, ఆ తర్వాత తన రిమార్కులు, అడ్వొకేట్ జనరల్ న్యాయ సలహాను జత చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఫైల్ పంపించారని తెలిపింది. ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణంపై సిట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దర్యాప్తు.. గవర్నర్ ఓ నిర్ణయం తీసుకునే ప్రక్రియలో కీలకపాత్ర పోషించిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం రాజీనామాలను సమీక్షించడంతో పాటు అడ్వొకేట్ జనరల్ నుంచి న్యాయసలహా తీసుకుని తిరిగి ఫైల్‌ను ఈ నెల 9న సీఎం ద్వారా గవర్నర్‌కు పంపించిందని వెల్లడించింది. సిట్ దర్యాప్తుపై ఎలాంటి ప్రభావానికి తావు లేకుండా చైర్మన్ సభ్యుల రాజీనామాలను గవర్నర్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. నిరుద్యోగ యువత ప్రయోజనాలను పరిరక్షించడంలో భాగంగా.. ఈ ప్రక్రియలో రాజ్‌భవన్ అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుందని స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధమైన విధులు, న్యాయ సూత్రాలు, పారదర్శకత, జవాబుదారీతనం పరిరక్షణకు గవర్నర్ కట్టుబడి ఉన్నారని తెలిపింది.

కారుణ్య నియామకాలకు ఆర్టీసీ ఓకే

813 మంది కండక్టర్లను నియమించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు కారుణ్య నియామక ప్రక్రియకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులకోసం కారుణ్య నియామకాల కింద కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్టీసీలో దాదాపు 1,600 కుటుంబాలు ఈ పథకంకోసం ఎదురు చూస్తున్నాయి. వాటిల్లో 813 దరఖాస్తులను మాత్రమే డిపో అధికారులు బస్ భవన్‌కు ఫార్వర్డ్ చేశారు. ఇప్పట్లో ఈ నియామకాలు వద్దని గతంలో ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశించటంతో మిగతా దరఖాస్తులు అలాగే ఉండిపోయాయి. ఇప్పుడు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో భాగంగా 813 కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. కాగా, కారుణ్య నియామకాలపై ఎన్ఎంయూ నేత నరేందర్, టీజేఎంయూ నేత హన్మంతు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ధన్యవాదాలు తెలిపారు. అయితే నియామకాలు తాత్కాలిక పద్ధతిలో కాకుండా రెగ్యులర్ బేసిస్‌లో చేపట్టాలని ఓ ప్రకటనలో కోరారు.

ఆ కుటుంబాలకు న్యాయం: మంత్రి పొన్నం

'ఆర్టీసీలో నియామకాలు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కండక్టర్ నియామకాలు చేపట్టాం. దానిలో భాగంగా 813 మంది కండక్టర్లను నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. సంవత్సరాలుగా కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు దీంతో న్యాయం జరుగుతుంది'.

అమెరికా నుంచి నకిలీ సర్టిఫికెట్

- స్నేహితుణ్ని యూఎస్‌కు రప్పించే యత్నం
- రూ.లక్షన్నరకు డిగ్రీ సర్టిఫికెట్ కొన్న విద్యార్థి
- బీటెక్ స్టూడెంట్‌ను అరెస్టు చేసిన ఎల్బీనగర్ ఎస్ఓటీ
- పరారీలో నకిలీ విద్యార్హత పత్రాల తయారీదారు



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో ఉంటున్న ఓ స్నేహితుడు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో తన మిత్రుడిని అమెరికాకు రప్పించేందుకు యత్నించగా విఫలమై.. కటకటాలపాలయ్యాడు. స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌కు చెందిన పులిపాటి మణికంఠ బీటెక్ ఫెయిలయ్యాడు. ఉద్యోగ వెతుకులాటలో ఉన్నాడు. ఈ క్రమంలో అమెరికాలో ఉంటున్న తన స్నేహితుడు జనార్దన్ సూచన మేరకు మేఘాలయ – షిల్లాంగ్‌లోని విల్లియం కార్వే యూనివర్సిటీ నుంచి నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ పొందాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో జనార్దన్ సూచన మేరకు నకిలీ విద్యార్హత పత్రాల తయారీదారు నరేష్‌ను కలిశాడు. అతడిని సంప్రదించి రూ.1.6 లక్షలు చెల్లించి విల్లీయం కార్వే యూనివర్సిటీకి చెందిన నకిలీ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ డిగ్రీ సర్టిఫికెట్ పొందాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం మణికంఠను అరెస్టు చేశారు. నరేష్, జనార్దన్‌లు పరారీలో ఉన్నారు.

రోడ్డున పడిన అర్జీలపై విచారణ

సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అధికారులు అందజేసిన విషయంపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ విచారణకు ఆదేశించారు. దీనిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో యూబీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.పద్మనాభకు బాధ్యతలు అప్పగించి విచారణ త్వరగా పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో మొత్తం 1,48,151 దరఖాస్తులు రాగా భగత్ సింగ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొన్ని, సర్కిల్ కార్యాలయంలో మరికొన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు ఇంటి వద్ద అప్‌లోడ్ చేయాలని ఒక్కొక్కరికి 200 చొప్పున దరఖాస్తులు ఇచ్చారు. వీటిని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న క్రమంలో రోడ్డుపై పడ్డాయి. ఈ విషయంపై రోనాల్డ్ రాస్ విచారణకు ఆదేశించారు.

నేడు రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

- నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ
- 19న పరిశీలన, 22న ఉపసంహరణ, 29న ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి గురువారం కేంద్ర ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుంది. 2021 నవంబర్ 9న ఎమ్మెల్యే కోటాలో కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్ నుంచి, పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో కడియం, కౌశిక్ రెడ్డి తమ ఎమ్మెల్సీ పదవులకు 2023 డిసెంబర్ 3న రాజీనామా చేశారు. ఫలితంగా ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండుస్థానాల భర్తీకి ఈ నెల 4న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న పరిశీలన, 22న ఉపసంహరణకు గడువు ఇచ్చారు. 29న ఎన్నిక నిర్వహించి అదేరోజు ఫలితాలను వెల్లడించనున్నారు. కాగా రెండు స్థానాలకు వేర్వేరు నోటిఫికేషన్లు ఇచ్చి వేర్వేరు రంగు బ్యాలెట్లతో ఎన్నిక నిర్వహించాల్సిందిగా ఈసీ ఆదేశించింది. ఈ నేపథ్యంలో సంఖ్యాపరంగా అసెంబ్లీలో సీపీఐతో కలిపి 65 మంది సభ్యుల సంఖ్య కలిగిన కాంగ్రెస్ రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ ఏకగ్రీవంగా గెలుచుకునే అవకాశం ఉంది.

'ఓటుకు కోట్లు' కేసు విచారణ వాయిదా

ఏప్రిల్‌కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఓటుకు కోట్లు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేరు చేర్చాలని, ఈ కేసును సీబీఐకు అప్పగించాలని ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ బుధవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవిందకుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. తెలంగాణ తరఫు న్యాయవాది విచారణ వాయిదా వేయాలని లెటర్ సర్క్యులేట్ చేసిన కారణంగా విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

గత పీపీఏలపై నివేదిక ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీల నుంచి చేస్తున్న విద్యుత్ కొనుగోళ్లు, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, సరఫరా పరిస్థితులు, డిస్కంల ఆర్థిక పరిస్థితి, పనితీరుపై ముఖ్యమంత్రికి అధికారులు నివేదించారు.

24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిందే

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చి తీరాలని సీఎం స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ కొత్త విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, నిర్మాణంలో ఉన్న విద్యుత్ కేంద్రాలను సత్వరం పూర్తి చేయాలని చెప్పారు. విద్యుత్ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నాణ్యతను పెంచాలని సూచించారు. విద్యుత్ నిరంతర సరఫరాలో అవాంతరాలు రాకుండా ముందస్తుగా పటిష్ట చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి/ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ సయ్యద్ ముర్తుజా అలీ రిజ్వీ, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషార్రఫ్ ఫారూఖీ, సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి కూడా సమీక్షలో పాల్గొన్నారు.

వికారాబాద్‌లో నేవీ రాడార్ స్టేషన్: సీఎం



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్తిక్ శంకర్. చిత్రంలో ఎమ్మెల్యే రాంమోహన్

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని అటవీ ప్రాంతంలో ఇండియన్ నేవీ ప్రాజెక్టులో భాగంగా ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ పనులు వచ్చే ఫిబ్రవరి నెలలో ప్రారంభం కానున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దామగుండం దేవాలయానికి, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా ఈ ప్రాజెక్టు పనులు నిర్వహిస్తారని చెప్పారు. అదే స్థలంలో ఆలయాభివృద్ధి పనులు కూడా చేపడతారన్నారు. ఇండియన్ నేవీ కమాండర్ కార్తిక్ శంకర్ నేతృత్వంలోని బృందం బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసింది. రాడార్ స్టేషన్ నిర్మాణం విశేషాలను వివరించింది. నేవీకి సంబంధించిన భారీ పరికరాలను ఇక్కడ ఏర్పాటు చేస్తారని, దీంతో పరిగి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపింది. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. కాగా పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డిని సమన్వయం చేసుకుని త్వరలో పనులు ప్రారంభించాలని నేవీ అధికారులకు సీఎం సూచించారు. కల్నల్ హిమవంత్ రెడ్డి, నేవీ సిబ్బంది సందీప్ దాస్, రాజ్‌బీర్ సింగ్, మణిశర్మ, మనోజ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

15న సాగర్ వివాదంపై జలశక్తి శాఖ సమావేశం

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ నిర్వహణ విషయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలెత్తిన వివాదంతో పాటు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించే అంశంపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి ఈనెల 15న ఉభయ రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. సాగర్ వద్ద ప్రస్తుత పరిస్థితులు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణకు అనుసరించాల్సిన విధివిధానాలు, శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన 15 ఔట్‌లెట్ల నిర్వహణను రెండు రాష్ట్రాలు కృష్ణా బోర్డుకు అప్పగించడంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

3 వారాల్లో నిర్ణయం తీసుకోండి

మనోహర్‌రావు సస్పెన్షన్ ఎత్తివేతపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ ఉల్లంఘన వ్యవహారంలో సస్పెన్షన్‌కు గురైన అప్పటి పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ బోయినపల్లి మనోహర్‌రావు విషయంలో శాఖాపరమైన విచారణ పూర్తిచేసి, 3 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ గత నవంబర్ 17న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ సమయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఎండీతో పాటు ఓఎస్డీ తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లడంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు రావడంతో, ఈసీ వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. దీన్ని సవాల్ చేస్తూ మనోహర్‌రావు హైకోర్టులో పిటిషన్ వేశారు. తాను అధికార సమావేశంలో భాగంగానే తిరుమల వెళ్లానని చెప్పారు. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఎన్నికల సస్పెన్షన్లు దీర్ఘకాలం కొనసాగించాల్సిన అవసరం లేదని.. సస్పెన్షన్ ఎత్తివేతపై నిర్ణయం తీసుకోవాలని డిసెంబర్‌లో ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని, మూడు వారాల్లో పూర్తవుతుందన్నారు. దీంతో ధర్మాసనం విచారణను 3 వారాల్లో పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం పిటిషన్‌లో వాదనలను ముగించింది.

త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ

మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన

- చైనా కంటే ఉత్తమంగా అభివృద్ధి
- రాహుల్ అదానీకి వ్యతిరేకమే కానీ పెట్టుబడులకు కాదు
- పారిశ్రామిక, వాణిజ్య సంఘాలతో మంత్రి భేటీ... ప్రజలు కోరుకున్న మార్పును తెచ్చి చూపిస్తామని వెల్లడి



వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రజలు కోరుకున్న మార్పును తీసుకురావడంలో భాగంగా అందరి సలహాలు, సూచనలతో త్వరలో కొత్త పారిశ్రామిక విధానం రూపొందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. అందరి అభిప్రాయాలు తీసుకుని చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) తోడ్పాటును అందిస్తామని భరోసానిచ్చారు. వివిధ వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు ఎఫ్టీసీసీఐ, ఫిక్కీ, సీఐఐ, ఎఫ్టీఎస్ఏసీ, డిక్కి సంస్థల ప్రతినిధులతో బుధవారం శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. పారిశ్రామిక కారిడార్ విషయంలోనూ సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు అన్ని జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామన్నారు. చైనా కంటే ఉత్తమంగా అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పారిశ్రామిక రంగానికి నూతన ఉత్తేజం కల్పించడంతోపాటు అర్బన్, రీజనల్, సెమీ అర్బన్ క్లస్టర్లుగా విభజించి పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తామని ఆయన చెప్పారు. డ్రైపోర్ట్ విషయంలోనూ త్వరలో కీలక నిర్ణయం తీసుకుంటామని, నల్లగొండ నుంచి పాత ముంబై హైవే ప్రాంతాలను అనుసంధానం చేయడాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు పారిశ్రామిక రంగం అభివృద్ధితో లక్షలాది మంది ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తామని శ్రీధర్ బాబు చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలను తయారు చేసే దిశగా 'ప్లాన్ 2050'అమలు చేస్తామన్నారు. ప్రపంచానికి కోవిడ్ వ్యాక్సిన్ అందించిన హైదరాబాద్‌ను అభివృద్ధి చెందిన దేశాలు కూడా గుర్తించేలా 'ఫార్మా ఇండస్ట్రీ హబ్'గా తీర్చిదిద్దుతామన్నారు. హైదరాబాద్‌లో తయారైన క్షిపణులు ఇజ్రాయెల్‌కు ఎగుమతి అవుతున్నప్పటికీ, రాష్ట్ర పారిశ్రామిక పురోగతికి అద్దం పడుతోందన్నారు. అదానీ కంపెనీ వ్యవహారంలో కొంతమంది కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల పారిశ్రామిక వేత్తలకు అవకాశం రావాలన్నది కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని, తమ నాయకుడు రాహుల్ గాంధీ అదానీని వ్యతిరేకించారు కానీ అభివృద్ధిని కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అదానీ పెట్టుబడులు ఉన్నాయని, రాష్ట్ర అభివృద్ధిపైనే తమ ఆలోచన ఉంటుందని శ్రీధర్‌బాబు అన్నారు.

పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ

- అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టాలి.. అటవీ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగం తగ్గించండి
- అధికారులకు మంత్రి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అటవీ రక్షణ, పచ్చదనం పెంపు నిరంతర ప్రక్రియ అని, పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హరితహారంపై ఇప్పటివరకు జరిగిన పురోగతి, రానున్న సీజన్ కోసం తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ఆమె సచివాలయంలో సమీక్షించారు. అటవీ, గ్రామీణ అభివృద్ధి, మున్సిపల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హార్టికల్చర్ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాటుతున్న మొక్కలు, వాటి ఎదుగుదల, అలాగే చనిపోయిన మొక్కలను మార్చే విధానంపై వివరాలన్నీ వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంచే కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడం, నర్సరీలు, అటవీ సంబంధిత కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఇంటి అవసరాలకు ఉపయోగకరమైన, అలాగే కనీస ఆదాయాన్నిచ్చే మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన పూలు, పండ్ల జాతుల మొక్కల పంపిణీతో పాటు, స్వచ్ఛందంగా పెంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తమ ఇంటి ఆవరణలో చెట్లు నాటుకున్న వాళ్లకు కనీస ఆదాయం వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. చింత, సీతాఫల్, ఉసిరి, జామ, నిమ్మ, సపోటా, మునగ, కరివేపాకు లాంటి మొక్కలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి కోరారు. హరితహారం కార్యక్రమం పారదర్శకంగా, పూర్తి జవాబుదారీతనంతో ఉండాలని సూచించారు. గతంలో జరిగిన తప్పులను సవరించుకోవాలని మంత్రి అన్నారు.

ఫారెస్టు అధికారులపై దాడులు చేస్తే కఠినచర్యలు

భద్రాద్రి జిల్లా ఇల్లెందు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాఫియాను అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్టు అధికారులపై దాడులు చేయడాన్ని మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. మంగళవారం జరిగిన దాడిపై విచారణకు ఆదేశించారు. అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మాఫియాను అడ్డుకున్న ఫారెస్టు అధికారులపై ట్రాక్టర్‌ను ఎక్కించి చంపడానికి దుండగులు చేసిన ప్రయత్నంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు.

ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ స్వర్గధామం

ద్రిష్టి స్టార్ లైనర్ యూఏవీ ఆవిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్/ శంషాబాద్: ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ స్వర్గధామమని, దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏరోస్పేస్ వాతావరణం హైదరాబాద్‌లో ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్‌లోని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సెంటర్‌లో భారతీయ నేవీ కోసం అదానీ సంస్థ దేశీయంగా తయారు చేసిన 'ద్రిష్టి 10 స్టార్ లైనర్'అనే మానవరహిత ఏరియల్ వాహనాన్ని (యూఏవీ) శ్రీధర్‌బాబు బుధవారం ఆవిష్కరించారు. ఏరోస్పేస్, విమానయాన, అంతరిక్ష పరిశ్రమల రంగానికి తెలంగాణ ముఖ్యమైన కేంద్రంగా ఉందని, ఎయిరోస్పేస్ తయారీ, సర్వీసింగ్, ఇంజనీరింగ్, శిక్షణ సంస్థలను నెలకొల్పడానికి రాష్ట్రంలో అనేక ఏరోస్పేస్, అనుబంధ పార్కులు ఉన్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ ఓఈఎం సంస్థలైన లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, రాఫేల్ అడ్వాన్స్ సిస్టమ్స్, ఎల్బిట్ సిస్టమ్స్ తదితర సంస్థల నుంచి రాష్ట్రం భారీ పెట్టుబడులను ఆకర్షించిందని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రక్షణ పరికరాల తయారీ కేంద్రం

రక్షణ పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకుందని, అదానీ సంస్థ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళిక రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్, భారతీయ ఆర్మీ ఏవియేషన్ డీజీ లెఫ్టినెంట్ జనరల్ అజయ్‌కుమార్ సూరి, అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సంస్థ ప్రెసిడెంట్, సీఈవో ఆశిష్ రాజ్‌వన్షి, అదానీ ఎయిర్ పోర్ట్స్ ప్రమోటర్, డైరెక్టర్ జీత్ అదానీ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబానికి భట్టి పరామర్శ



గద్దర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

అల్వాల్: వెంకటాపురంలోని ప్రజా గాయకుడు గద్దర్ కుటుంబసభ్యులను బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరామర్శించారు. అనంతరం మహాబోధి విద్యాలయంలో ఉన్న గద్దర్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ప్రజల త్యాగాలను కేంద్రానికి నివేదించి, రాష్ట్రం సాధించడంలో గద్దర్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, ఆయన కుటుంబసభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రయాణ వివరాలివ్వండి

కేంద్ర ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్/వేములవాడ: గతేడాదిగా వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ చేసిన అంతర్జాతీయ ప్రయాణాల పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చెన్నమనేనికి కూడా స్పష్టం చేసింది. ఈ సందర్భంగా చెన్నమనేనిని ఉద్దేశించి హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'నిజంగానే కోర్టును తప్పుదోవ పట్టించారా? ఒకవేళ కోర్టును తప్పుదోవ పట్టిస్తే అలాంటి వారికి ఎందుకు ఉపశమనం కల్పించాలి. 2018 ఎన్నికల్లో జర్మనీ పౌరసత్వంతోనే పోటీ చేశారు. ఇప్పటికీ ఆ పౌరసత్వంతోనే అంతర్జాతీయ ప్రయాణాలు చేస్తున్నారా..'అని ప్రశ్నించింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. చెన్నమనేని రమేశ్ 2009లో భారత పౌరసత్వం పొందారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రమేశ్ ద్వంద్వ పౌరసత్వం కలిగి ఉన్నారని, 2018లో వేములవాడలో ఆయనపై పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ (ప్రస్తుత ఎమ్మెల్యే) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అప్పటి నుంచి విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 2019లో చెన్నమనేని మరో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రతివాది ఆది శ్రీనివాస్ తరఫు న్యాయవాది రవికిరణ్‌రావు వాదనలు వినిపిస్తూ.. '2018 ఎన్నికల సందర్భంగా చెన్నమనేని జర్మనీ పాస్‌పోర్టుపైనే ప్రయాణం చేశారు. 2019లో ఓసీఐ కార్డుకు దరఖాస్తు చేసుకున్నారు. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆ కార్డు తీసుకునేటప్పుడు జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నా'రని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం..గతేడాదిగా చెన్నమనేని అంతర్జాతీయ ప్రయాణాల పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించింది.



చచ్చిపోయేదాకా ఉన్నదంతా జీవితమే.
– మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 11 జనవరి 2024

భూగోళం భగ్గుమంటోంది!

మరో శాస్త్రీయ నివేదిక బయటకొచ్చింది. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని మళ్ళీ గుర్తు చేసింది. గత 150 ఏళ్ళలో ఎన్నడూ లేనంత అధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరం 2023 అని తేలిపోయింది. ఆ మధ్య వెలువడ్డ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాత్కాలిక నివేదికతో పాటు తాజాగా మంగళవారం ఐరోపా యూనియన్‌కు చెందిన వాతావరణ పర్యవేక్షక సంస్థ 'కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్' (సీసీసీఎస్) సైతం ఆ సంగతి నిర్ధారణ చేసింది. ఒకప్పుడు 2016 'భగభగల నామ సంవత్సరం'గా రికార్డ్ సృష్టిస్తే, తాపంలో అంతకన్నా గణనీయమైన తేడాతో ఆ అపకీర్తి కిరీటాన్ని ఇప్పుడు 2023 దక్కించుకుంది. భూవిజ్ఞాన సాక్ష్యాధారాలు, ఉపగ్రహ సమాచారాలను క్రోడీకరించి చూస్తే, దాదాపు లక్ష సంవత్సరాల్లో అధిక వేడిమి గల ఏడాది ఇదేనట. ఇది పెనునిద్దుర వదిలించే మాట. యథేచ్ఛగా సాగుతున్న గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల వల్ల భూతాపం ఇంతగా పెరిగిందని శాస్త్రవేత్తలకు తెలుసు. ఈ ధోరణి ఇలాగే కొనసాగనుందా? రానున్న సంవత్సరాల్లో భూగోళం అంతకంతకూ వేడెక్కనుందా? పాత రికార్డ్‌లు తుడిచిపెట్టుకు పోనున్నాయా అన్నది ప్రశ్న. 2024 సైతం అత్యధిక భూతాప వత్సరం కావచ్చన్న అంచనాలు పారా హుషార్ అంటున్నాయి.

పారిశ్రామికీకరణ ముందు నాటితో పోలిస్తే 2 డిగ్రీల సెల్సియస్‌కు మించి ప్రపంచ ఉష్ణోగ్రత పెరగకుండా చూసుకోవాలన్నది లక్ష్యం. ఎనిమిదేళ్ళ క్రితం ప్యారిస్‌లో జరిగిన 'కాప్–21'లో ఈ మేరకు ప్రపంచ దేశాలు ప్రతిన బూనాయి. వీలుంటే 1.5 డిగ్రీల సెల్సియస్ లోపలే ఉండేలా శ్రమించాలనీ తీర్మానించాయి. ప్యారిస్ ఒప్పందం తర్వాత వరుసగా పెరుగుతున్న వాతావరణ విపరిణామ ఘటనలు ప్రపంచాన్ని అప్రమత్తం చేశాయి. ఫలితంగా పర్యావరణ మార్పుకు సంబంధించి ఈ 1.5 డిగ్రీల సెల్సియస్ అనే హద్దు అలిఖిత శాసనమైంది. అయితే, ఇప్పుడు ఆ హద్దును దాటిపోయే పరిస్థితి వచ్చింది. గడచిన 2023లో భూగోళం భగభగలాడింది. ఉష్ణోగ్రతలో పెంపు ప్రమాదకర స్థాయికి చేరింది. ప్రతి రోజూ 1850 – 1900 మధ్య కాలం కన్నా కనీసం ఒక డిగ్రీ అధిక తాపం ఉంది. గత జూన్‌లో మొదలై డిసెంబర్ దాకా ప్రతి నెలా గరిష్ఠ వేడిమి మాసంగా రికార్డవుతూ వచ్చాయి. ఏడాదిలో సగం రోజులు ఎప్పటికన్నా 1.5 డిగ్రీలు ఎక్కువ వేడి ఉన్నాయి. నవంబర్‌లో రెండు రోజులైతే ఏకంగా 2 డిగ్రీల చెలియలికట్టను దాటేశాయి. భూతాపం లెక్కలు రికార్డ్ చేయడం మొదలుపెట్టాక గత 150 ఏళ్ళలో ఎన్నడూ లేనంత వేడిమి గల వత్సరంగా 2023 రికార్డుకెక్కింది.

గతంలో అత్యధిక ఉష్ణోగ్రత రికార్డయిన ఏడాది 2016. సగటున 0.17 డిగ్రీల హెచ్చు ఉష్ణోగ్రతతో 2023 ఆ రికార్డును తిరగరాసింది. ఈ సంగతి ఆందోళన కలిగిస్తుంటే, ఇంత కన్నా భయపెడుతున్న విషయం ఉంది. వచ్చే 12 నెలల్లో భూగోళం 1.5 డిగ్రీల మార్కును సైతం దాటేసే ప్రమాదం ఉందట. సీసీసీఎస్ శాస్త్రవేత్తలే ఆ మాటన్నారు. అంటే ఈ 2024 మరింత వేడిమితో ఉడుకెత్తించనుందన్న మాట. ఒక పక్క రికార్డు స్థాయిలో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, మరోపక్క సహజ వాతావరణ పరిణామమైన ఎల్ నినో... ఈ రెండూ భూగోళంపై ఉష్ణోగ్రతలు ఇంతగా పెరగడానికి ప్రాథమిక కారణమని శాస్త్రవేత్తల మాట. ఈ అధిక ఉష్ణోగ్రతల దెబ్బతో వడగాడ్పులు, వరదలు, కార్చిచ్చులు చెలరేగుతున్నాయి. విశ్వవ్యాప్తంగా ప్రాణికోటి ఆయువు తీస్తున్నాయి. జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి. అమెరికా, ఐరోపాలలో ఆ మధ్య చెలరేగిన వేడిగాలుల లాంటి వాతావరణ విపరిణామాలు సైతం మానవ తప్పిదాలతో పెరిగిన భూతాపంతోనే సంభవించాయి.

డబ్ల్యూఎంఓ, సీసీసీఎస్‌లే కాదు... వందలాది శాస్త్రీయ అధ్యయనాలూ ప్రమాదాన్ని అద్దంలో చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన మరో వాతావరణ సంస్థ విడిగా చేసిన మరో విశ్లేషణ ఫలితాలూ ఇలానే ఉన్నాయి. డిగ్రీలో పదో వంతు మేర భూతాపం పెరిగినా... వడగాడ్పులు, తుపానులు తీవ్రమవుతాయి. సముద్రమట్టాలు పెరుగుతాయి. హిమానీనదాలు త్వరగా కరిగి నీరవుతాయి. ఇవన్నీ ప్రపంచవ్యాప్తంగా మనం నిరుడు చూసినవే. భూతాపంతో ఇరాన్, చైనా, గ్రీస్, స్పెయిన్, టెక్సాస్, అమెరికా దక్షిణ ప్రాంతాలు ఉడికిపోయాయి. కెనడాలో విధ్వంసకరమైన కార్చిచ్చు చెలరేగింది. సముద్ర ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేనంత పెరిగి, సముద్ర వడగాడ్పులు వీచాయి. వేసవిలోనూ, శీతకాలంలోనూ అంటార్కిటికా సముద్ర తీరాల వెంట హిమ ఘనీభవనం చాలా తక్కువైంది. రికార్డు స్థాయిలో పడిపోయింది. ఇవన్నీ ప్రకృతి మోగిస్తున్న ప్రమాద ఘంటికలని గ్రహించాలి.

పెరుగుతున్న భూతాపాన్ని నివారించడానికి ఇకనైనా చిత్తశుద్ధితో సంకల్పించాలి. విపరీత ఘటనల్ని నివారించాలంటే, అత్యవసరంగా ఆర్థిక వ్యవస్థను కర్బన రహిత దిశగా నడిపించాలి. పర్యావరణ సమాచారాన్నీ, జ్ఞానాన్నీ ఆసరాగా చేసుకొని భవిష్యత్తు వైపు అడుగులేయాలి. భూగోళంపై జీవకోటి ప్రాణాధార వ్యవస్థలు అమితంగా దెబ్బతిన్నాయనీ, ఇప్పటికే సురక్షిత వలయం బయట మానవాళి గడుపుతోందనీ శాస్త్రవేత్తలు ఇటీవల వెల్లడించారు. భూతాపం, వాతావరణ మార్పులు హద్దు మీరితే పరిస్థితి ఎలా ఉంటుందన్నది 2023 రుచి చూపింది. ఇకనైనా ప్రపంచ దేశాలు తమ నిర్లక్ష్యాన్ని వీడి, వాతావరణ మార్పులపై కార్యాచరణకు దిగాలి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడంలో మీనమేషాలు లెక్కించడం మానవాళికి శ్రేయస్కరం కాదు. అగ్ర రాజ్యాలు సహా అన్నీ ఆ పనికి దిగాలి. వీలైనంత త్వరగా నెట్ జీరో స్థాయి చేరి, జీవనయోగ్యమైన వాతావరణాన్ని పరిరక్షించుకోవాలి. మన జీవితంలో రాబోయే వత్సరాలన్నీ ఇంతకింత భూతాపంతో ఉంటాయనే భయాలూ లేకపోలేదు. అదే నిజమై, వాటితో పోలిస్తే గడచిన 2023వ సంవత్సరమే చల్లగా ఉందని భావించాల్సిన పరిస్థితి వస్తే, అది ఘోరం. చేతులారా చేస్తున్న పాపానికి ఫలితం!


గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** అమావాస్య సా.6.18 వరకు, తదుపరి పుష్య శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** పూర్వాషాఢ సా.6.53 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** తె.2.31 నుండి 3.59 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.16 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.33 వరకు, **అమృత ఘడియలు:** ప.2.11 నుండి 3.43 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

మణిపుర్ హింసకు పరిష్కార మార్గం

విశ్లేషణ



జయంత రాయ్ చౌధురీ

ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో నూతన సంవత్సర ప్రారంభంలోనే తిరిగి హింసాకాండ చెలరేగింది. రెండు వైపులా భారీగా సాయుధ మిలిటెంట్ల ఉనికి ఉండటంతో సమూహాల మధ్య విశ్వాసం పాదుకోవడం కష్టమవుతోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అక్కడి ప్రధాన తెగలైన మైతేయిలు, కుకీలు, నాగాల మధ్య సంబంధాలు సంఘర్షణ, ఉద్రిక్తతలు, అపార్థాలతో నిండి ఉన్నప్పటికీ... వారు కలిసి జీవించారు. పరస్పర వివాహాలు చేసుకున్నారు. నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో సయోధ్యకు చేపట్టిన చర్యలే... మణిపుర్ ప్రజల మధ్య శాంతిని నెలకొల్పడానికి పరిష్కార మార్గం. ముందుగా మణిపుర్ కొండలు, లోయలలో కాల్పుల శబ్దాలు ఆగవలసి ఉంటుంది. ఈ పని బహుశా కేంద్ర బలగాలు మాత్రమే చేయగలవు.

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే సుందరమైన ఈశాన్య రాష్ట్రమైన మణిపుర్‌లో తాజా దశ హింసాకాండ చెలరేగింది. మొదటి దశలో నమోదైన జాతిపరమైన ఉన్మాదం, ఇప్పుడు సాయుధ సమూహాల మధ్య క్రూరమైన పాశ్చాత్య తరహా తుపాకీ కాల్పుల స్థాయికి దిగజారింది. మొదటి కొన్ని నెలల హింస ఫలితంగా అక్కడ కనిపించని జాతిపరమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. మైతేయిలు ఎల్లప్పుడూ ఆధిపత్యం వహించే ఇంఫాల్ లోయ నుండి కుకీలు, జోలు, ఇతర గిరిజనులు నిష్క్రమించారు. గిరిజనుల ఆధ్వర్యంలో నడిచే కొండ జిల్లాలను మైతేయిలు ఖాళీ చేశారు. 1947లో పంజాబ్‌లో మతపరమైన ఉద్రిక్తతలతో జరిగిన నిర్మూలనా కాండను ఇది తలపిస్తోంది.

అస్సాం రైఫిల్స్, ఆర్మీ రెజిమెంట్లు మైతేయి ప్రాంతాలు, కుకీలు, హ్మార్ లు పైతీలు వంటి ఇతర గిరిజనులు నివసించే ప్రాంతాలకు మధ్య తటస్థ జోన్‌లను సృష్టించాయి. దీనివల్ల తమ ఆధిపత్య ప్రాంతాన్ని విస్తరించడానికి కొన్ని సమయాల్లో ఏదో ఒక వర్గం చేసే ప్రయత్నాల వల్ల అస్థిరమైన శాంతి కొనసాగుతోంది. కాంగ్లీపాక్ తిరుగుబాటు వర్గాలకు చెందిన విస్తృతమైన నెట్‌వర్క్ ఒకప్పుడు ఇంఫాల్ లోయను పీడించింది. గత రెండు దశాబ్దాల కాలంలో దాన్ని అణచిపెట్టారు. అది ఇప్పుడు పునరుజ్జీవితమైందనీ, రాష్ట్ర పోలీసు దళం నుండి 'దోచుకున్న' ఆయుధాలతో కొందరు సాయుధులయ్యారనీ తెలుస్తోంది. లొంగిపోయి, అస్సాం రైఫిల్స్ నిఘా కళ్ల నీడన, శిబిరాల్లో నివసిస్తున్న కొంతమంది కుకీ మిలిటెంట్లు కూడా ఇదే విధమైన కక్షతో తప్పించుకుని ఉండవచ్చు. కొండ జిల్లాల్లోని సాయుధ గ్రామ అప్రమత్త కమిటీలలో చేరి ఉండవచ్చు కూడా.

యుద్ధంలో యుద్ధం

సమూహాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో రాష్ట్రంలో 'యుద్ధంలో యుద్ధం' జరుగుతున్న పరిస్థితులు కనబడుతున్నాయి. అదే సమయంలో సాధారణ శాంతిభద్రతలను సద్వినియోగం చేసుకుంటూ దోపిడీ, తుపాకుల సేకరణ, మాదక ద్రవ్యాల వ్యాపారంలో కూడా మునిగిపోతున్నారు. చారిత్రకంగా ఇది వారికి అలవాటైన విద్యే. వీటి సాయంతోనే సాధారణ ప్రజలను లూటీ చేసేవారు. మణిపుర్‌లోని చిన్న మైతేయి ముస్లిం సమాజమైన పంగల్‌లను మైతేయి మిలిటెంట్ గ్రూప్ లక్ష్యం చేసుకోవడం పరిస్థితుల పతనానికి పరాకాష్ఠగా కనబడుతోంది.

అయితే, జాతుల మధ్య సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు శాంతి కమిటీల ద్వారా జరుగుతున్నాయి. అయినప్పటికీ, రెండు వైపులా భారీగా సాయుధ మిలిటెంట్ల ఉనికి ఉండటంతో విశ్వాసం పాదుకోవడం కష్టమవుతోంది. హింసను, సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగ అసమర్థత ఇప్పటికే కనీసం 180 మంది ప్రాణాలను బలిగొంది. దాదాపు 40,000 మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో కొందరు ఇతర రాష్ట్రాలలో ఆశ్రయం పొందారు. మయన్మార్ నుండి కుకీలు వెల్లువలా వచ్చి చేరడం, ఆ పొరుగు దేశంలో సంఘర్షణ ఫలితంగా ప్రవేశిస్తున్న శరణార్థులు కూడా మైతేయిల్లో అభద్రతా భావాన్ని పెంచాయి. కుకీ నేషనల్ ఆర్గనైజేషన్, కుకీ నేషనల్ ఆర్మీ (బర్మా) తమ ఏకైక పోరాటం మయన్మార్ రాజ్యానికి వ్యతిరేకంగానేననీ, మణిపుర్‌లో తాము ఎటువంటి కాల్పులకు పాల్పడలేదనీ పదేపదే ప్రకటనలు జారీ చేస్తూ వచ్చాయి. అయినా వారి సిబ్బందిలో కొందరు స్వతంత్ర పద్ధతిలో వ్యవహరించడాన్ని తోసిపుచ్చలేము.



కుకీ కొండ ప్రాంతాలలో దాదాపు పూర్తిగా మైతేయిలకు చెందిన రాష్ట్ర పోలీసు కమాండోలను ఉంచడాన్ని మణిపుర్ ప్రభుత్వం బలపరుస్తున్నందుకు చాలామంది అసంతృప్తిగా ఉన్నారు. భారతీయ శిక్షా స్మృతిలోని వివిధ సెక్షన్‌లను, అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించినందుకుగాను స్థానిక వార్తాపత్రికలకు చెందిన ఇద్దరు సంపాదకులను అరెస్టు చేయడం పరిస్థితిని మరింత దిగజార్చింది. ఈ దశలోనే హింసాకాండ జరిగింది. తరచుగా ఇంటర్నెట్ నిషేధాలు, ఇతర అవరోధాల కారణంగా రిపోర్టింగ్ తీవ్రంగా నిరోధించబడిన రాష్ట్రంలో, తాజా అరెస్టులు ఏమాత్రం మంచివి కావు.

సంఘర్షణ – స్నేహ చరిత్ర

మణిపుర్‌లో సంఘర్షణలతో పాటు వర్గాల మధ్య స్నేహానికి కూడా సుదీర్ఘ చరిత్రే ఉంది. రాజులు ఇంఫాల్ లోయను పాలించినప్పుడు, నాగాలు, కుకీలు, ఇతర గిరిజనులు నివసించే కొండలపై వారి పట్టు చాలా తక్కువగా ఉండేది. గిరిజనులు కొండలను 'సొంతం' చేసుకున్నారు, తమ సొంత ఆచారాల ప్రకారం వారి జీవితాలను గడిపారు. రాజులు కూడా దానిని అంగీకరించారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మణిపుర్‌లోని మూడు ప్రధాన కమ్యూనిటీలైన మైతేయిలు, కుకీలు, నాగాల మధ్య సంబంధాలు కూడా సంఘర్షణ, ఉద్రిక్తతలు, అపార్థాలతో నిండి ఉన్నప్పటికీ, వారు కలిసి జీవించారు. పరస్పర వివాహాలు కూడా చేసుకున్నారు. తద్వారా సయోధ్యకు, శాంతికి అవకాశం ఏర్పడింది. 1944లో మూడు వర్గాలకు చెందిన యువకులు సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. అది బర్మా నుండి భారతదేశంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది. ఆజాద్ హింద్ ఫౌజ్ వెనుకంజ వేయడంతో చాలామంది తిరిగి రంగూన్‌కు వెళ్లారు. స్వాతంత్ర్యం కోసం యుద్ధంలో స్వచ్ఛందంగా పాల్గొన్న వారిలో మణిపుర్ మొదటి ముఖ్యమంత్రి కూడా ఉన్నారు.

పరిష్కారమేంటి?

క్రైస్తవ మిషనరీలు కొండలపైకి తీసుకువచ్చిన విద్య మణిపుర్ గిరిజనుల సాధారణ శ్రేయస్సు స్థాయిని పెంచింది. షెడ్యూల్డ్ తెగలుగా వారికి రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. మరోవైపు, రాష్ట్రంలోనే అత్యుత్తమ సాగు భూమి ఇంఫాల్ లోయలో ఉంది. ఇది చారిత్రకంగా మైతేయిలు ఆధిపత్యం చలాయించిన ప్రాంతం. గిరిజనులు తొమ్మిది రెట్లు ఎక్కువ భూమిని కలిగి ఉన్న కొండ ప్రాంతాలలో ఉన్నారు. కానీ వీటిలో సాగు యోగ్యమైనవి తక్కువ.

జనాభాలో 53 శాతం ఉన్న మైతేయిలు వ్యవసాయం, పరిశ్రమల్లో ముందంజలో ఉన్నారు. 2022లో ఎన్నికైన బీజేపీ నేతృత్వంలోని మణిపుర్ ప్రభుత్వం, కుకీ–జో ప్రజలు సాంప్రదాయ గిరిజన భూములుగా పిలిచే వాటిని రిజర్వుడ్ ఫారెస్టులుగా చెబుతూ వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేసింది. అలా ఉద్రిక్తతకు అవకాశం ఏర్పడింది. ఇక, గతేడాది మే ప్రారంభంలో మెజారిటీగా ఉన్న మైతేయిలకు షెడ్యూల్డ్ తెగ హోదాను కల్పించే చర్యకు పూనుకున్నారు. దానికి వ్యతిరేకంగా గిరిజన సమూహాలు చేసిన ప్రదర్శనల ద్వారా హింసకు నాంది పడింది. అయితే, ఈ చర్యలను ప్రభుత్వం విరమించుకుంది.

కుకీ–జో ప్రజలు మయన్మార్ నుండి తమ బంధువులను తీసుకువస్తున్నారనీ, రాష్ట్రాన్ని ముంచెత్తడం ద్వారా రాష్ట్ర జనాభా నిష్పత్తుల రీతిని మార్చుతున్నారనీ మైతేయిల ఆందోళన. మాదక ద్రవ్యాలు, తుపాకీల సేకరణతో మాదక ద్రవ్యాల వ్యాపారానికి గేట్లు ఎత్తారనీ వీరి ఆరోపణ. (వాస్తవానికి ఇరు వర్గాలకు చెందిన సాయుధ మిలిటెంట్లు ఈ లాభదాయక 'వ్యాపారం'లో పాల్గొంటున్నారు.)

నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో సయోధ్యకు చేపట్టిన చర్యలే... మణిపుర్ ప్రజల మధ్య శాంతిని నెలకొల్పడానికి పరిష్కార మార్గం. కాకపోతే దానికి మణిపూర్ కొండలు, లోయలలో కాల్పులు నిశ్శబ్దం కావలసి ఉంటుంది. రాష్ట్ర పోలీసులు పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నారని చాలామంది ఆరోపిస్తున్నారు కాబట్టి, ఈ పని బహుశా కేంద్ర బలగాలు మాత్రమే చేయగలవు.

వ్యాసకర్త 'పీటీఐ' వార్తాసంస్థకు ఈశాన్య ప్రాంత మాజీ హెడ్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే రుద్దుడైతే...



థియేటర్లలో హిందీ సినిమాలను ప్రదర్శిస్తూ, వాటికి సబ్‌టైటిల్స్ వేయకపోతే కూడా దాన్ని హిందీ భాషను రుద్దడం అంటారా? తమిళనాడులో ఈ విషయంలో మరీ ఎక్కువ చేస్తున్నారు.
– సుమంత్ రామన్, యాంకర్

కొత్త ఉత్సాహం



కొత్తవాళ్లను తీసుకోవడం, శిక్షణలతో ఇండియా ఇమ్మిగ్రేషన్ సేవలు ఉల్లాసంగా మారాయా? యూనిఫామ్‌లో ఉన్న చురుకైన యువ అధికారులతో ఢిల్లీ విమానాశ్రయంలో మంచి అనుభవం ఎదురైంది. కీబోర్డు కూడా వాడటం తెలియని పాత చచ్చు సరుకు కంటే వీళ్లు చాలా మెరుగు.
– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

ఇదో నిర్భరత!



మీకు బాగా డబ్బులుండి, మిమ్మల్ని తెలిసినవాళ్లుంటే మీకు రక్షణ శాఖ కాంట్రాక్టులు వస్తాయి. అప్పుడు విదేశాల్లో నుంచి తెచ్చిన విడిభాగాలను ఇండియాలో క్రోడీకరించినా సరే... వాటిని 'ఆత్మనిర్భర్ భారత్' కింద ఆవిష్కరించడానికి సైన్యంలో పెద్దస్థాయి మనిషి వస్తాడు.
– యూసుఫ్ ఉంర్ఘూవాలా, జర్నలిస్ట్

మాల్ అంటే ఇవేనా?



గురుగ్రామ్‌లోని ఈ కొత్త మాల్ బయట నాకు ఏమనిపించిందంటే – మనం చెత్త తినకపోతే, మనకు సెల్ఫ్ హెల్ప్ బుక్స్ అక్కర్లేకపోతే, అడ్వర్‌టైజ్‌మెంట్లలో కనబడే బట్టలు మనం ధరించకపోతే, మనకు ఇప్పటికే ఇంటి కర్టెన్లు ఉంటే... ఇంత పెద్ద మాల్‌లో కూడా మనకు ఏమీ లేవని!
– మనూ జోసెఫ్, రచయిత

గాంధర్వుడికి శుభాకాంక్షలు



మన ప్రియతమ గాంధర్వ గాయకుడు డాక్టర్ కె.జె. యేసుదాస్ 'దాసేట్టన్'కు జన్మదిన (జనవరి 10) శుభాకాంక్షలు. గాయకులందరికీ మీరు నిజమైన ప్రేరణ, మార్గదర్శకులు. భగవంతుడు మిమ్మల్ని సదా ఆరోగ్యంగా ఉంచుతూ, మీ సంగీత ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉండుగాక!
– కె.ఎస్. చిత్ర, గాయని

ఎలాంటి తల్లి?



మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉన్న ఏ తల్లీ తన సొంత చిన్నారిని చంపదు. అందుకే విడాకుల కేసుల్లో పిల్లల కస్టడీని అప్పగించే ముందు కోర్టులు జాగ్రత్తగా వ్యవహరించాలి. పిల్లల్ని పెంచగలరో, లేదో పరిశీలించేందుకు సైకియాట్రిస్ట్‌ను సంప్రదించాలి. మనకు కనబడేది కేవలం ఉపరితలం మాత్రమే అనడానికి సుచనా సేథ్ ఒక మంచి ఉదాహరణ. (తన నాలుగేళ్ల కుమారుడిని చంపినట్టు బెంగళూరుకు చెందిన ఒక స్టార్టప్ సీఈఓ సుచనా సేథ్ మీద కేసు నమోదైన నేపథ్యంలో)
– మీరా చోప్రా, నటి

ఇదే తెలియకపోతే...



రక్షణ మంత్రికి ప్రోస్టేట్ క్యాన్సర్ ఉందనీ, దానికి డిసెంబర్‌లో సర్జరీ జరిగిందనీ నిన్నటిదాకా బైడెన్‌కు తెలియదంటే– 81 ఏళ్ల ఈ (అమెరికా) అధ్యక్షుడి ఆరోగ్యమే ప్రశ్నార్థకంగా ఉందనీ, తన పరిపాలనా వ్యవహారాల మీద పూర్తి నియంత్రణ లేదనీ సంకేతం.
– బ్రహ్మ చెల్లానీ
వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ఇన్ బాక్స్

యుద్ధ గాయాలు



చినుకు పడితే చాలు
చిగురించే ఈ నేల పైన
ఊపిరి తీసుకుంటున్న
నా దేహానికీ ఆత్మకూ
ఎలాంటి గాయం తగలకుండా
కాలం గడిస్తే బాగుండు

కానీ
ప్రపంచ దేశాల మధ్య జాతుల మధ్య
ఆధిపత్యం కోసం పెల్లుబికిన
'యుద్ధం'

ఏం చేస్తుంది
హింస అరుపులు ఆర్తనాదాలు
......
'యుద్ధం'
ఏం మిగులుస్తుంది
శవాల దిబ్బలు బూడిద కుప్పలు

శవాలు ఎప్పటికీ మేల్కొనవు
బూడిదలో ఏ విత్తనమూ మొలకెత్తదు

రక్తమోడిన దేహ గాయాలకు
నా దగ్గరేదో మందుంది

కానీ
ఆత్మకు తగిలిన గాయాలకు
మలామ్ ఎవడు పూస్తాడు
అవి
మానేదెప్పుడు.. మాన్పేదెవడు?

– వారాల ఆనంద్
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత ı 94405 01281

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అసలు... ఆ రాత్రి ఏం జరిగింది?

సందర్భం



జిల్లా గోవర్ధన్

భారత ద్వితీయ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయి. అది హత్యా? సహజ మరణమా? లేక ఇన్‌సైడర్ (లోపలి వ్యక్తి) పనా? అయిదు దశాబ్దాలు గడిచినా, ఏ ఇన్వెస్టిగేషన్, ఏ ఎంక్వైరీ కమిషన్‌కు నోచుకోకుండానే ఆయన మరణం దేశ చరిత్ర పుటల్లో మిస్టరీగానే మిగిలిపోయింది!

1965 భారత్–పాక్ యుద్ధానంతరం, 1966 జనవరి 4న రష్యాలోని తాష్కెంట్‌లో ప్రారంభమైన ఇరు దేశాల చర్చలు జనవరి 10 రాత్రి 'నోవార్ ప్యాక్ట్' అగ్రిమెంటుతో ముగిశాయి. ఆ తర్వాత తనకు ఏర్పాటు చేసిన 'డాచా' (గెస్ట్ హౌజ్ విల్లా)లోని విశాలమైన బెడ్ రూంలో కెళ్ళిపోయారు శాస్త్రి. భోజనానంతరం, కుక్ రామ్‌నాథ్ తెచ్చిన గ్లాసులోని పాలు త్రాగి నిద్రకు ఉపక్రమించారు.

రాత్రి 1.20 గంటలకు ప్రధాని పర్సనల్ సెక్రెటరీ జగన్నాథ్ సహాయ్ బెడ్ రూం తలుపును ఎవరో తడుతున్న చప్పుడు. తలుపులు తెరచిన ఆయనకు ఎదురుగా కుడి చేత్తో ఛాతీ వత్తుకుంటూ, 'డాక్టర్ సాబ్ కహా హై' వగరుస్తూ ప్రధాని ఆర్తింపు. సంగతి తెలిసిపోయింది పీఏ సహాయ్‌కి. అసిస్టెంట్లు ఇద్దరు కలిసి శాస్త్రిజీని ఆయన రూంలోకి తీసుకెళ్ళి గ్లాసులో ఆయనకు నీళ్లు ఇచ్చారు. బెడ్‌పై ఆయనను పడుకోబెట్టి, పక్కరూంలో ఉన్న ప్రధాని పర్సనల్ వైద్యుడు డాక్టర్ ఆర్ఎన్ చుఘ్‌కు కబురు చేశాడు పీఏ క్షణాల్లో మెడికల్ కిట్‌తో శాస్త్రీజీ రూంలో కొచ్చి ఆయన పల్స్ చెక్ చేశాడు. శ్వాస పీల్చుకోలేక, 'మేరే రామ్' అంటూ అవస్థ పడుతున్నారాయన. ప్రధాని గుండెపోటుకు గురయ్యారని నిర్ధారణకు వచ్చి వెంటనే ఒక ఇంజెక్షన్ చేసి ఛాతీ వత్తడం ప్రారంభించాడు డాక్టర్ అయినా శాస్త్రీజీ క్రమంగా స్పృహ కోల్పోయారు. ఆఖరు ప్రయత్నంగా మరో ఇంజెక్షన్‌ను నేరుగా శాస్త్రిజీ గుండె దగ్గరే ఇచ్చాడు చుఘ్. అయినా లాభం లేకపోయింది. ఆశ వదలుకుని, గద్గద స్వరంతో 'బాబూజీ, ఆప్నే ముజె మౌకా నహీ దియా (నాకు మీరు తగిన సమయం ఇవ్వలేదు)' అంటూ అశ్రునయనాలతో శాస్త్రీజీ పల్స్‌ను వదిలేశాడు డాక్టర్ చుఘ్. తాష్కెంట్‌లో అప్పుడు సమయం రాత్రి 1.32 గంటలు.

'యువర్ ప్రైమ్ మినిస్టర్ ఈజ్ డైయింగ్' అన్న ఒక



రష్యన్ లేడీ విలేకరి మాటతో, నిద్రలో నుండి హుటాహుటిన లేచి చెప్పులు లేకుండానే తన గది నుండి ఆదుర్దాగా శాస్త్రిజీ బెడ్ రూమ్ వైపు పరుగు తీశాడు ఆయన ప్రెస్ సెక్రెటరీ కులదీప్ నయ్యర్. అప్పటికే అంతా అయిపోయింది. ఆయన బెడ్ దగ్గర రష్యన్ ప్రధాని కోసిగిన్, పాక్ నేత ఆయూబ్ ఖాన్, ప్రధాని సహచరులు, మంత్రులూ అయిన స్వర్ణ సింగ్, యశ్వంత్‌రావు చవాన్ దీన వదనాలతో శిల్పాల్లా నిలుచున్నారు. ఆ నిశాంత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, పాక్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్, కుల్దీప్ వైపు చూస్తూ 'హియర్ ఈస్ ఏ మేన్ ఆఫ్ పీస్, హూ గేవ్ హిస్ లైఫ్ ఫర్ ఎమిటీ బిట్వీన్ ఇండియా అండ్ పాకిస్తాన్' అంటూ వాపోయాడు.

ఆ రోజు మధ్యాహ్నం 2.30 గం.కు జాతీయ జెండాలో చుట్టిన ప్రధాని పార్థివ దేహంతో సోవియట్ ఎయిరోఫ్లోట్ విమానం తాష్కెంట్ నుండి ఢిల్లీ పాలమ్ ఎయిర్ పోర్ట్ చేరుకుంది. అక్కడి నుంచి గన్ క్యారేజీలో శాస్త్రీజీ డెడ్ బాడీని ఆ సాయంత్రం 4.10 గంటలకు 10, జనపథ్‌కు చేర్చారు. రోడ్డంతా శోకసంద్రంలో మునిగిన ఢిల్లీ వాసులతో నిండింది. ఏమీ తోచని ప్రధాని కుటుంబీకులు వారిస్తున్నా ఆగమేఘాల మీద ఏ పోస్టుమార్టం లేకుండానే అదే రోజు శాంతివన్‌లో శాస్త్రీజీ అంత్యక్రియలు జరిపారు.

ఊహించని రీతిలో నిష్క్రమించిన ప్రధాని లాల్ బహదూర్ స్థానంలో నూతన నాయకుణ్ణి ఎన్నుకోవటానికి, కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు సభ్యులు పలుమార్లు సమావేశమయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నేత మొరార్జీ దేశాయ్ ఈ పదవికి గట్టి పోటీ ఇచ్చారు. కరడు గట్టిన గాంధేయవాది అయినప్పటికీ దేశాయ్‌ది నిరంకుశ తత్వం. పార్టీ అధ్యక్షుడు కామరాజ్ నాడార్‌కు ఇది మింగుడు పడలేదు. చాణక్య రీతితో దేశాయ్‌ని పోటీ నుండి తప్పించి, నెహ్రూ తనయ, ఇందిరా గాంధీ పేరును పార్లమెంటరీ బోర్డు నాయకురాలిగా తెరపైకి తేగలిగారు కింగ్ మేకర్ కామరాజ్. రేపో మాపో లండన్ బ్రిటిష్ హైకమిషనర్‌గా వెళ్లవలసిన అప్పటి ఇన్ఫర్మేషన్ బ్రాడ్‌కాస్టింగ్ మినిస్టర్ ఇందిర చేతిలోకి 1966 జనవరి 24న నాటకీయంగా దేశ ప్రధాని పగ్గాలు వెళ్లిపోయాయి.

వ్యాసకర్త విశ్రాంత ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్
మొబైల్: 98190 96949
(అనూజ్ ధర్ పుస్తకం 'యువర్ ప్రైమ్ మినిస్టర్ ఈజ్ డెడ్' ఆధారంగా. నేడు లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి)

బోధించే విధానం

మనుషులందరూ ఒకలా ఉండరు. భిన్న భిన్న ప్రవృత్తులు, ఆశయాలు, అలవాట్లు, అభిరుచులతో ఉంటారు. కొందరికి ఒకసారి చెబితే సరిపోతుంది. మరి కొందరికి పదిసార్లు చెప్పాలి. బడిలో ఒకటో తరగతి విద్యార్థులకు బోధించే విధానం వేరుగా, పదో తరగతి వారికి బోధించే పద్ధతి ఇంకో విధంగా ఉంటుంది.

జ్యోతిర్మయం

పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో ఉన్న మార్కు సువార్త నాలుగో అధ్యాయంలో ఏసుక్రీస్తు తన సందేశాన్ని ఏ విధంగా తెలియజేసేవాడో చెప్పబడింది. తనను చేరవచ్చిన ప్రజల మానసిక స్థాయికి తగ్గట్టుగా ఆయన ప్రవచనాలు ఉండేవి. తన సందేశం ప్రజల మనసుల్లో సూటిగా నాటుకొనేందుకు ఆయన చిన్న చిన్న పిట్ట కథలు, నీతి కథలు చెప్పేవాడు. ఉపమానాలు కోకొల్లలుగా వాడేవాడు. దేవుని రాజ్యం ఏ విధంగా ఉంటుంది? అని ప్రశ్నించుకొని అది ఆవగింజలా ఉంటుంది అంటాడు. మనం భూమిలో నాటే విత్తనాలన్నింటికన్నా అది చాలా చిన్నది. కానీ దాన్ని నాటాక ఇతర మొక్కలకన్నా అది ఏపుగా పెరుగుతుంది. పక్షులు దాని నీడలో గూళ్ళు కట్టుకొనేటంత పెద్దవిగా దాని కొమ్మలు ఉంటాయి అంటాడు. ఏసు ఇలాంటి ఉపమానాల్ని ఎన్నో ఉపయోగించేవాడు. ఒకసారి రైతును ఉపమానంగా తీసుకొనేవాడు. ఇంకోసారి దీపస్తంభం అందుకు పనికివచ్చేది. ఈ విధంగా ఏసు ప్రజలకు అర్థమయ్యే రీతిలో తన సందేశం వినిపించేవాడు. ఉపమానాలు ఉపయోగించకుండా వాళ్ళకు ఆయన ఏదీ బోధించేవాడు కాదు. కానీ, ఆయన తన శిష్యులకు మటుకు ఏకాంతంలో తన సందేశంలోని అంతరార్థాన్ని విడమరచి చెప్పేవాడు.

– దీవి సుబ్బారావు

క్లుప్తంగా...

గోదాదేవికి నీరాటోత్సవాలు



గజవాహన సేవ, అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవికి నీరాటోత్సవాలను బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి నిత్యకల్యాణ సేవతో పాటు గోదాదేవిని అలంకరించి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారి పాశురాలను పఠించారు. మధ్యాహ్నం ఉత్సవ మండపంలో అమ్మవారికి కట్టె పొంగలిని ఆరగింపుగా పెట్టారు. నీరాటోత్సవాలు ఐదు రోజుల పాటు జరగనున్నాయి.

మానసిక వికలాంగురాలిపై లైంగిక దాడి..

- నేరస్తుడికి 20 ఏళ్ల జైలు
- వరంగల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు

వరంగల్ లీగల్: మానసిక వికలాంగురాలైన బాలిక(14)పై లైంగికదాడికి పాల్పడిన తేజావత్ రమేశ్‌కు 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.5.50 లక్షల జరిమానా విధిస్తూ వరంగల్ పోక్సో కోర్టు జడ్జి వై.సత్యేంద్ర బుధవారం సంచలన తీర్పు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ గ్రేటర్ పరిధిలోని ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం శివారు మంగళకుంటకు చెందిన దళిత కూలీ దంపతులు రోజువారీ పనికి వెళ్లేవారు. 2019, నవంబర్ 7వ తేదీన పనులకు వెళ్లొచ్చిన తల్లిదండ్రులకు ఇంట్లో మానసిక వికలాంగురాలైన కూతురు ఏడుస్తూ కనిపించింది. కడుపులో నొప్పిగా ఉందని, ఒంటరిగా ఉన్న సమయంలో తేజావత్ రమేశ్ ఇంట్లోకి చొరబడి లైంగిక దాడి చేశాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడని, గతంలో కూడా తనపై రెండుమార్లు లైంగికదాడి చేశాడని తల్లికి చెప్పింది. వెంటనే తల్లిదండ్రులు మామునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో కోర్టు నేరం రుజువు కావడంతో తేజావత్ రమేశ్‌కు జైలుశిక్ష విధించింది.

డైరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం–2024 డైరీని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ బుధవారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం వర్కింగ్ అధ్యక్షుడు ఎం.ఏ.రెహ్మాన్ సూఫీ, జనరల్ సెక్రటరీ బీవీ కోటయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, కార్యదర్శులు మునగాల మనోహర్, భూపాల్ రెడ్డి, పూస నర్సింహా బెస్త తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్లాన్‌తోనే...

- పశువు కళేబరంపై గడ్డి మందు చల్లారు
- అది తినే మగపులి మృత్యువాత



పశువుల కాపరి నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పశువులను చంపుతున్నాయన్న ప్రతీకారంతోనే కొందరు పులులను మట్టుబెట్టుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో రెండు పులుల్లో ఒకటి స్పష్టంగా ఇదే కారణంగా చనిపోయినట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. తమ పశువులను చంపి తింటున్న పులులను లేకుండా చేయాలని భావించి వాంకిడి మండలం సర్కెపల్లికి చెందిన పశువు యజమాని, ముగ్గురు పశువుల కాపరులు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. ఇందుకోసం ఉచ్చులు, విష ప్రయోగం కూడా చేసినట్టు తెలుస్తోంది.

కళేబరంపై గడ్డి మందు చల్లి..

ఇటీవలే ఓ రైతుకు చెందిన పశువును పులి చంపి తినేసింది. సాధారణంగా ఒకసారి వేటాడితే, పులి ఆ మాంసాన్ని వారం దాకా భుజిస్తుంది. మళ్లీ వస్తుందని తెలుసుకొని ఎద్దు కళేబరంపై గడ్డి మందు చల్లి మట్టుబెట్టారు. మొదట ఉచ్చులు కూడా వేసినట్టు సమాచారం. గడ్డి మందు చల్లిన పశువు కళేబరాన్ని తిని ఎస్9 మగపులి చనిపోగా, ఆ పరిసరాల్లోనే ఉన్న ఎస్6కు చెందిన రెండు పిల్లల జాడ ఇంకా తెలియదు. వాటిని ట్రేస్ చేస్తేనే అసలు విషయం తెలుస్తుంది.

సీన్ రీ కన్‌స్ట్రక్షన్

పులిపై ఎలా విష ప్రయోగం చేశారో నలుగురు నిందితులు బుధవారం అడవిలో అధికారుల ముందు యథాతథంగా చేసి చూపించారు. కేసు దర్యాప్తులో భాగంగా చనిపోయిన పశువుల రైతుల వివరాలు అటవీ అధికారులు సేకరిస్తుండగా, నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో కాగజ్‌నగర్ పోలీసుల సాయంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారు నిజం ఒప్పుకున్నట్టు తెలిసింది.

పరిహారంలో జాప్యం

కాగజ్‌నగర్ రేంజ్ దరిగాం, సర్కెపల్లి పరిధిలోనే ఆరు పులులు ఉన్నాయి. తరచూ పశువులపై దాడులు చేస్తూ ఆకలి తీర్చుకుంటున్నాయి. అయితే నిబంధనల ప్రకారం పశువుల విలువ మేరకు వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. కానీ నెలల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో పశువులను చంపుతున్నాయనే కోపంతోనే కొందరు విష ప్రయోగం చేసి పులుల మరణానికి కారణమవుతున్నారనే వాదనలు ఉన్నాయి.పులుల సంరక్షణ పకడ్బందీగా చేస్తున్నామని చెప్పే అధికారులు కిందిస్థాయి వాస్తవ పరిస్థితులను తెలుసుకోలేకపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మరో పశువుపై దాడి

రెండు రోజుల క్రితం కాగజ్‌నగర్ రేంజ్ ఉట్‌పల్లి శివారులో ఓ పశువును పులి చంపేసింది. అప్రమత్తమైన అధికారులు కెమెరాలు బిగించారు. అక్కడకు మళ్లీ భుజించేందుకు పులి వస్తే ట్రేస్ అవుతాయి. ఇక్కడ సంచరించే ఆరింటిలో రెండు చనిపోగా, మరో నాలుగింటి జాడపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే అటవీ అధికారులు ఈ కేసు దర్యాప్తు వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. గురువారం అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

సర్పంచుల డిమాండ్లు పరిష్కరించాలి

- ప్రొఫెసర్ కోదండరాం
- రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం
- పాల్గొన్న కాంగ్రెస్ నేత మల్లు రవి, ప్రొఫెసర్ హరగోపాల్



పంజగుట్ట (హైదరాబాద్): ప్రస్తుతం ప్రజలు కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, పోరాడాల్సిన అవసరం లేకుండా చర్చలద్వారా సర్పంచుల న్యాయపరమైన డిమాండ్లు సాధించుకుందామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వారి సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సాదాని భూమన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ప్రొఫెసర్ హరగోపాల్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామ సర్పంచులను వెట్టిచాకిరీ కార్మికుల మాదిరిగా వాడుకుందని మండిపడ్డారు. సర్పంచులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 78, 79 ప్రకారం నిధులు, విధులు, అధికారం ఇవ్వాలని కోరుతున్నారన్నారు. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే కొద్ది సమయం పడుతుందని అన్నారు. అలా అని సర్పంచుల సమస్యలను పక్కన పెట్టవద్దని పేర్కొన్నారు. మల్లు రవి మాట్లాడుతూ .. సర్పంచ్‌ల సంఘం అడుగుతున్న మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా స్థానిక సంస్థల నుంచే రాజకీయ జీవితం ప్రారంభించారని, ఆయనకు ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌ల సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందని.. తప్పక సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం నలుగురు మాత్రమే రాష్ట్రాన్ని పాలించారని.. కాంగ్రెస్ వచ్చిన నెల రోజుల్లోనే ప్రజల పాలన ఎలాఉంటుందో చూపించామని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు లక్షల కోట్లు అప్పుచేసిందని విమర్శించారు. సర్పంచుల డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూమన్న యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం తమకు ఈ ప్రభుత్వంలో ఊరట కలుగుతుందన్న ఆశ ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జూలూరి ధనలక్ష్మి, ఇతర నేతలు మల్లేశ్, రాజేందర్, బీర్ల శంకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

కులగణన, సామాజిక న్యాయం

- పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు అంశాలదే ప్రధాన పాత్ర: ప్రొఫెసర్ హరగోపాల్
- హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద ఏఐఓబీసీఎస్‌ఏ ఆధ్వర్యంలో సత్యాగ్రహం



సత్యాగ్రహ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరగోపాల్

హఫీజ్‌పేట్: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో కులగణన, సామాజిక న్యాయం అంశాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్ పేర్కొన్నారు. అఖిల భారత ఓబీసీ విద్యార్థి సంఘం (ఏఐఓబీసీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద కులగణన ప్రచారంలో భాగంగా సత్యాగ్రహం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలంతా ఏకమైతే ఈ రెండు అంశాలను వ్యతిరేకించే వాళ్లంతా ఓడిపోక తప్పదని, ప్రతికులానికి తమ సంఖ్య ఎంతుందో అర్థమవుతుందన్నారు. అన్ని రాష్ట్రాలలో కులగణన చేపట్టి ఓబీసీల సంఖ్యను తేల్చాలని అన్నారు. కొన్ని రాష్ట్రాలలో ఓబీసీలకు రిజర్వేషన్లు లేవు, కొన్ని రాష్ట్రాలలో ఎస్టీలో ఉన్న వారిని ఇంకొన్ని రాష్ట్రాలలో అలా గుర్తించడం లేదని, వీటన్నింటికి కులగణన న్యాయం చేస్తుందని చెప్పారు. ప్రొఫెసర్ ఈ వెంకటేష్ మాట్లాడుతూ, పారదర్శకంగా సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న బిహార్‌లోని జేడీయూ, ఆర్‌జేడీలను ఆయన ప్రశంసించారు. జనగణనలో భాగంగా సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న అట్టడుగు వర్గాలను ఏకం చేస్తూ మిస్డ్ కాల్ ప్రచారాన్ని స్వరాజ్య రైతు వేదిక నుంచి కిరణ్‌విస్సా ప్రారంభించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, అధికారపక్షం చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.

నేటి నుంచి కందుల కొనుగోళ్లు

- వ్యాపారులతో పోటీ పడి అధిక ధరకు కొనాలని నిర్ణయం
- క్వింటాల్‌కు రూ.10 వేలకు పైగా చెల్లించేందుకు సిద్ధమైన మార్క్‌ఫెడ్



సాక్షి, హైదరాబాద్: కందుల కొనుగోళ్లకు అధిక ధర చెల్లించేందుకు వ్యవసాయశాఖ రెడీ అయ్యింది. కందులకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7000 కాగా, బహిరంగ మార్కెట్‌లో రూ.9,500 నుంచి రూ.10,500 మధ్య ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో వ్యాపారులతో పోటీపడి కందులు కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. ధరల స్థిరీకరణ ద్వారా గడిచిన నాలుగున్నరేళ్లలో తెలంగాణ మార్క్‌ఫెడ్ పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చేస్తోంది. గురువారం నుంచి కొనుగోళ్లు చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవడంతోపాటు పప్పుధాన్యాలు పండించే రైతుకు అదనపు లాభం సమకూర్చడమే లక్ష్యంగా ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో దేశవ్యాప్తంగా 10 లక్షల టన్నుల కందులు సేకరించాలని నాఫెడ్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా 50 వేల టన్నులు వ్యవసాయ మార్కెట్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్, ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సంఘాలు)ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. తొలిసారి మద్దతు ధరకు మించి రోజువారీ మార్కెట్ రేటుకు అనుగుణంగా వ్యాపారులతో పోటీపడి రైతులకు అత్యధిక ధర చెల్లించి కందుల సేకరణకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో 4,74,299 ఎకరాల్లో కందులు సాగు చేయగా 2.37 లక్షల టన్నుల దిగుబడులు వస్తుందని అంచనా వేశారు. రాష్ట్రంలో కంది పంట సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

పశువుల వలస బాట

పెద్దవూర: గ్రాసం కోసం పశువులు వలస బాట పట్టాయి. నల్లగొండ జిల్లా చందంపేట మండలానికి చెందిన గిరిజనులు ఏటా జనవరి నెల ప్రారంభంలో ఆంధ్ర ప్రాంతానికి పశువులతో వలస వెళ్తారు. తిరిగి ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురిసే సమయానికి జూన్ నెలాఖరుకు స్వగ్రామాలకు వస్తారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అడవులు, గుట్టలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతంలో ఖరీఫ్ వరి కోతలు ముగుస్తుండటంతో పశుగ్రాసానికి ఇబ్బందులు ఉండవని పశువులతో సహా వెళ్తున్నారు. బుధవారం కోదాడ–జడ్చర్ల రహదారిపై నుంచి పెద్దవూర మీదుగా పశువుల మంద వెళ్తుండటం కనిపించింది.



గుంపులుగా జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై వెళ్తున్న పశువులు

కాపీయింగ్ చేస్తూ పట్టుబడి

- ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

దుండిగల్: కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి.. అనంతరం భయంతో కళాశాలలోని నాలుగో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గాజులరామారం ప్రాంతానికి చెందిన దైవాదీనం కుమారుడు జాయ్ దరేల్(20) దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా బుధవారం పరీక్ష రాసే క్రమంలో కాపీయింగ్ చేస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. దీంతో భయంతో అదే కళాశాల భవనం నాలుగో అంతస్తు పైకి ఎక్కి కిందకు దూకేశాడు. వెంటనే కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అతన్ని సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బడే



ఏటూరునాగారం: మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ప్రాంతానికి చెందిన మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను ఆ పార్టీ నియమించినట్లు తెలిసింది. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం. పార్టీ తెలంగాణ కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కోవిడ్ బారినపడి 2021లో జూన్ 21న మరణించిన విషయం తెలిసిందే. ఆ పోస్టు కోసం మావోయిస్టు నేత ఆజాద్ సైతం తన వంతు ప్రయత్నాలు చేయగా, చివరికి పార్టీ బడే చొక్కారావును నియమించింది. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, ఏఓబీ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సాయన్న, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ మడివి హిడ్మా అలియాస్ హిడ్మాతో సహా కొందరు కీలక నేతలతో జరిగిన సమావేశంలో బడే చొక్కారావుని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభం



ఖైరతాబాద్: ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ, భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ సహకారంతో నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో బుధవారం ప్రారంభమైంది. ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్‌చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత ప్రారంభించారు. కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రకాల చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపై ప్రదర్శించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 కంటే ఎక్కువ రాష్ట్రాల నుంచి వచ్చిన 120 చేనేత నేత సహకార సంఘాలు మార్కెటింగ్ ఎక్స్‌పోలో పాల్గొనగా, 55 సహకార సంఘాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, 20 తెలంగాణకు చెందినవని తెలిపారు. లేపాక్షి హస్తకళల స్టాల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. వీటితో పాటు ఖాదీ, బందర్ చీరలు, వెంకటగిరి చీరలు, ఉప్పాడ, బెంగాలీ కాటన్, చందేరి, బగల్‌పూర్, బెడ్‌షీట్లు, హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–గాంధీ బంకర్ మేళాలో ఆకట్టుకుంటున్నాయి. ఎక్స్‌పో ఈ నెల 23 వరకు అందుబాటులో ఉంటుంది.

వెన్నెముక శస్త్ర చికిత్సల్లో ‘ఏషియన్ స్పైన్’ రికార్డు

దేశంలోనే మొదటిసారిగా 200 స్పైనల్ ఫ్యూజన్ సర్జరీలు



మాట్లాడుతున్న డాక్టర్ సుకుమార్ సూర తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో మొదటిసారిగా ‘కీహోల్ ఎండోస్కోపిక్ స్పైన్ టెక్నాలజీ’ సహకారంతో విజయవంతంగా 200 స్పైనల్ ఫ్యూజన్ సర్జరీ (ఎండో ఫ్యూజన్)లను నిర్వహించామని, ఈ ఘనత నగరానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని ఏషియన్ స్పైన్ హాస్పిటల్ చైర్మెన్–ఎండీ డా.సుకుమార్ సూరా తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన సర్జరీలను నిర్వహించడమే కాకుండా వెన్నెముకకు చేసే చికిత్స విషయంలో అపోహలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. మధ్యతరగతి కుటుంబాలకు కూడా ఈ సేవలు అందించాలనే ఆలోచనతో ఓపెన్ సర్జరీలకయ్యే ఖర్చుతోనే కీహోల్ ఎండోస్కోపిక్ స్పైనల్ ఫ్యూజన్ సర్జరీలను నిర్వహిస్తున్నామన్నారు. చికిత్స జరిగిన మరుసటి రోజే పేషెంట్‌లు హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి, నడవగలిగే సౌలభ్యాలను ఈ సాంకేతికత అందిస్తుందని కన్సల్‌టెంట్ స్పైన్ సర్జన్ డా.ఎం.అభినందన్ రెడ్డి వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మ్యాక్స్ విజన్ ఫౌండర్ డా.కాసు ప్రసాద్‌రెడ్డి ఏషియన్ స్పైన్ బృందాన్ని అభినందించారు. సాధారణంగా వెన్నెముకకు చేసే ఓపెన్ సర్జరీతో అధిక రక్తస్రావం, ఎముకలు–నరాలు దెబ్బతినడం జరుగుతుందని, ఈ స్పైనల్ ఫ్యూజన్ సర్జరీలో ఎలాంటి శరీర భాగాల కోత లేకుండా సులభతరంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తారని అన్నారు. కేవలం రెండేళ్లలో 200 సర్జరీలు చేయడం వైద్యుల కృషికి, వైద్య బృందం ఎండో ఫ్యూజన్‌పై పెంచుతున్న అవగాహనకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ నరేష్ కుమార్ పగిడి మర్రి, డా.పద్మ తదితరులు పాల్గొన్నారు.

జగ్గారెడ్డి ఢిల్లీకి ఎందుకు వెళ్లినట్టు!

- రేవంత్‌రెడ్డిని కలిసిన మర్నాడే ఢిల్లీ వెళ్లడంతో రాజకీయ ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి బుధవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో కలిసిన మరుసటి రోజే ఆయన హస్తినకు పయనం కావడం చర్చనీయాంశమవుతోంది. రేవంత్‌రెడ్డిని కలిసిన సందర్భంగా ఆయన ఏయే అంశాలపై చర్చించారన్న విషయం ఎక్కడా బయటకు రాలేదు. దీనిపై మాట్లాడేందుకు జగ్గారెడ్డి ఆసక్తి కనపర్చకుండానే తెల్లారేసరికి ఢిల్లీ వెళ్లడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం జగ్గారెడ్డి పార్టీ పెద్దలను కలిసే పనిమీ దనే ఢిల్లీ వెళ్లారని తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి, సంస్థాగత వ్యవహారాల ఇంచార్జి కె.సి.వేణుగోపాల్‌ను ఆయన కలిసే అవకాశముందని, వీలును బట్టి రాహుల్‌ను కూడా కలుస్తారని సమాచారం. వేణుగోపాల్‌ను కలిసి ఇటీవల ఎన్నికల్లో తన ఓటమికి కారణాలను వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చిస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

అవి గంజాయి చాక్లెట్లే

- విద్యార్థులకు వ్యసనంగా మార్చి.. పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో విక్రయాలు
- పోలీసుల దాడులు. ముగ్గురి అరెస్టు
- 8 కేజీల బరువున్న చాక్లెట్లు స్వాధీనం
- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వెల్లడి



గంజాయి చాక్లెట్లను పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: ఊహించిందే నిజమైంది. అవి గంజాయి కలిపిన చాక్లెట్లేనని నిర్ధారణ అయింది. కొత్తూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్కూలు సమీపంలోని పాన్ డబ్బాల్లో చాక్లెట్లు కొనుగోలు చేసి తిన్న తర్వాత మత్తులోకి జోగడం, వింతవింతగా ప్రవర్తిస్తుండటం తెలిసిందే. దీంతో ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారమిచ్చిన నేపథ్యంలో గంజాయి చాక్లెట్ల బాగోతం బయటపడింది. విద్యార్థుల వింత ప్రవర్తనతో పాటు మత్తులోకి జారుకునేలా చేస్తున్న చాక్లెట్లు గంజాయి కలిపినవేనని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పోలీసుల దాడులు

మంగళవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న పాన్ డబ్బాతో పాటు మరో మూడు కిరాణ దుకాణాల్లో శంషాబాద్ ఎస్‌ఓటీ, కొత్తూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 కేజీల బరువు కలిగిన ‘చార్మినార్ గోల్డ్ మునకా’అనే పేరుతో ఉన్న 42 చాక్లెట్ల డబ్బాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 1.30 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. చాక్లెట్లను తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యూపీ వయా ఒడిశా?

ఒడిశా రాష్ట్రం జస్పూర్ జిల్లాకు చెందిన ధీరేంద్ర బహేరా(33) కొత్తూరులోని పరిశ్రమల్లో కార్మికుడిగా పనిచేసేందుకు కొంత కాలం కిందట వచ్చాడు. అధికంగా డబ్బులు సంపాదించాలనే దురాశతో అదే రాష్ట్రానికి చెందిన సోమ్‌నాథ్ బెహ్రే (33) సూర్యమని సాహు (35)తో పాటు పరారీలో ఉన్న మరో వ్యక్తితో కలిసి ఒడిశా నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి స్థానికంగా విక్రయించడం మొదలు పెట్టారు. ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఓ పాన్ డబ్బాను ఏర్పాటు చేసి విద్యార్థులకు దానిని నెమ్మదిగా అలవాటుగా మార్చారు. అంతే కాకుండా సమీపంలోని మరికొన్ని కిరాణా దుకాణాల్లో కూడా వాటిని కార్మికులు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నారు. ఒక్కో చాక్లెట్‌ను రూ. 20 లేదా 30కి విక్రయిస్తున్నారు. చాక్లెట్లను ఉత్పత్తి చేస్తున్న ప్రదేశం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా మగర్ వారా నెహ్రూబాగ్‌లోని ఏఎం ఫార్మా పేరిట ఉంది. చాక్లెట్ల పై భాగంలో మాత్రం పూర్తి గా హిందీ అక్షరాలతో చార్మినార్ గోల్డ్ మునకా అని ఉంది. అక్కడ నుంచి ఎలా తీసుకొస్తున్నారు అనే దానిపై లోతైన దర్యాప్తు జరుగుతోందని శంషాబాద్ డీసీపీ వెల్లడించారు.

చాక్లెట్ ఫ్లేవర్‌తో గంజాయి కలిపి

కొంత చక్కెర, బెల్లం వంటి పదార్థాల్లో చాక్లెట్ ఫ్లేవర్ కలిపి అందులో గంజాయిని కలిపినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఎవరైనా ఇలాంటి చాక్లెట్లు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ నారాయణ రెడ్డి కోరారు. ఎస్‌ఓటీ డీసీపీ రషీద్, శంషాబాద్ అదనపు డీసీపీ రామ్‌కుమార్, శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, కొత్తూరు సీఐ వి.నర్సింహారావు శంషాబాద్ ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ కేసును ఛేదించారంటూ డీసీపీ అభినందించారు.

క్లుప్తంగా...

కొందరినే అనుమతిస్తాం

రాహుల్ జోడో యాత్రపై మణిపూర్

ఇంఫాల్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తలపెట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభానికి మణిపూర్‌లోని బీజేపీ సంకీర్ణ సర్కారు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. జనవరి 14న మణిపూర్‌ను యాత్రకు శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ నిర్ణయించడం తెలిసిందే. ఇంఫాల్‌లోని హప్తా మైదానం నుంచి యాత్ర ప్రారంభానికి పార్టీ అనుమతి కోరింది. అందులో పాల్గొనే వారి సంఖ్య పరిమితంగా ఉండాలని ఇంఫాల్ ఈస్ట్ కలెక్టర్ కార్యాలయం బుధవారం జారీ చేసిన అనుమతి ఉత్తర్వుల్లో పేర్కొంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ఈ మేరకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. యాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనే వారి సంఖ్య, పేర్లను ముందుగానే తెలపాలని షరతు విధించింది. ఈ నేపథ్యంలో ఇంఫాల్ నుంచి యాత్ర ప్రారంభంపై కాంగ్రెస్ పునరాలోచనలో పడింది. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు.

'370'పై రివ్యూ పిటిషన్లు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన 370 ఆర్టికల్ రద్దు సబబేనన్న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై సమీక్ష కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. జమ్మూ కశ్మీర్ హైకోర్టు బార్ అసోసియేషన్, అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్ సహా పలువురు ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు చేశారు. ధర్మాసనం తీర్పు లోపభూయిష్టమని, 370 ఆర్టికల్ తాత్కాలిక ఏర్పాటనడం సబబు కాదని పేర్కొన్నారు.

భాగవత్‌కు 'అయోధ్య' ఆహ్వానం

న్యూఢిల్లీ: అయోధ్యలో జనవరి 22న రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు ఆహ్వానం అందింది. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా, వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ బుధవారం ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అధికారికంగా ఇప్పటిదాకా దాదాపు 6,000 మందికి ప్రాణ ప్రతిష్ఠకు ఆహ్వానాలు అందాయి.

బ్యాట్ గుర్తు ఇమ్రాన్ పార్టీదే

పెషావర్: పాకిస్తాన్‌లో కీలకమైన జాతీయ ఎన్నికల ముందు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ)కి భారీ ఊరట దొరికింది. పార్టీ ఎన్నికల చిహ్నమైన క్రికెట్ బ్యాట్‌ను దానికే తిరిగి కేటాయిస్తూ పెషావర్ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. పీటీఐకి బ్యాట్ చిహ్నాన్ని రద్దు చేస్తూ దేశ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేసింది. అది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

హ్యాట్రిక్‌పై బీజేపీ గురి...!

లోక్‌సభ ఎన్నికల్లో 50 శాతం ఓట్లే లక్ష్యం



ముమ్మరంగా కసరత్తు

- ఈసారి ఎక్కువ స్థానాల్లో బరిలోకి
- 70 ఏళ్లు దాటిన వారికి నో టికెట్!
- మూడుసార్లకు మించి నెగ్గినా అంతే
- బలహీన స్థానాల బాధ్యతలు మంత్రులకు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ నెగ్గి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్న బీజేపీ ఆ దిశగా సన్నాహాలను వేగవంతం చేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తాలూకు ఊపును కొనసాగించేలా పార్టీ నేతలను, శ్రేణులను సమాయత్తం చేస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 50 శాతానికి పైగా ఓట్ల సాధనను బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది! ఈ మేరకు రాష్ట్రాలవారీగా ముఖ్య నేతలకు అధినాయకత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. ఇటీవలి బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు నేతలందరికీ ఈ మేరకు స్పష్టం చేయడంతో పాటు ఆ దిశగా బాధ్యతలు కూడా అప్పగించినట్టు సమాచారం. 50 శాతం ఓట్ల లక్ష్యసాధన కోసం 2019తో పోలిస్తే ఈసారి వీలైనన్ని ఎక్కువ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఇందుకు ఎన్డీఏ మిత్రపక్షాలను ఒప్పించే ప్రయత్నాలకు పార్టీ ఇప్పటికే శ్రీకారం చుట్టింది. 2019తో పోలిస్తే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సంఖ్య తగ్గడం కూడా తాను ఎక్కువ చోట్ల పోటీ చేసేందుకు వీలు కల్పిస్తుందని బీజేపీ భావిస్తోంది. పంజాబ్‌లో అకాలీదళ్, బిహార్లో జేడీ(యూ)తో బీజేపీకి ఇప్పటికే తెగదెంపులవడం తెలిసిందే. తమిళనాడులో అన్నాడీఎంకే, రాజస్తాన్‌లో ఆరెల్పీలతోనూ అటూ ఇటుగా అదే పరిస్థితి. ఇక మహారాష్ట్రలో శివసేన చీలికలో ఏక్‌నాథ్ షిండే వర్గానికి బీజేపీ మద్దతుగా నిలిచి ప్రభుత్వ ఏర్పాటుకు దోహదపడింది. కనుక షిండే సేనకు వీలైనన్ని తక్కువ లోక్‌సభ సీట్లిచ్చి అత్యధిక స్థానాల్లో తానే పోటీ చేసేలా కన్పిస్తోంది.

నెలాఖరు నుంచి జాబితాలు...!

జనవరి నెలాఖరు, లేదా ఫిబ్రవరి తొలి వారం నుంచి బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితాలు విడుదలయ్యే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ''తొలి జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వంటి దిగ్గజాల పేర్లుంటాయి. తద్వారా ఎన్నికల వాతావరణానికి దేశవ్యాప్తంగా ఊపు తేవాలన్నది లక్ష్యం'' అని వివరించాయి. 2019 లోక్‌సభ ఎన్నికలప్పుడు కూడా మోదీ, షా, రాజ్‌నాథ్ పేర్లు తొలి జాబితాలోనే చోటుచేసుకోవడం తెలిసిందే. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ స్థానాలు నెగ్గేందుకు బీజేపీ పలు చర్యలు చేపడుతోంది...

1. తొలి జాబితాలో వీలైనన్ని ఎక్కువ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనుంది. ముఖ్యంగా 2019లో పార్టీ ఇబ్బందులను ఎదుర్కొన్న, తక్కువ మెజారిటీతో నెగ్గిన స్థానాలపై ఈ జాబితాలో బీజేపీ ప్రధానంగా దృష్టి పెట్టనుంది. నిజానికి వీటిని 'సవాలు స్థానాలు'గా ఎప్పుడో గుర్తించింది. గత ఎన్నికల ఫలితాలు రాగానే వాటిపై గట్టిగా దృష్టి పెట్టింది. ఆయా స్థానాల్లో పరిస్థితిని మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నిస్తూ వస్తోంది.

2. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను 2019 ఎన్నికల్లో బీజేపీ 436 చోట్ల పోటీ చేసింది. 303 స్థానాలు నెగ్గి 133 చోట్ల ఓటమి చవిచూసింది. వాటితో పాటు బాగా బలహీనంగా మరో 31 స్థానాలపై బీజేపీ ఈసారి బాగా ఫోకస్ చేస్తోంది. వీటిని తొలి జాబితాలో చేర్చనుంది.

3. ఈ 164 'టార్గెటెడ్ స్థానాల్లో' గెలుపు బాధ్యతలను అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, సీనియర్ నేతలకు అప్పగించనుంది. వీటినిప్పటికే రెండు గ్రూపులుగా బీజేపీ విభజించింది. 45 మంది కేంద్ర మంత్రులు ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు స్థానాల చొప్పున బాధ్యతలను భుజాలకెత్తుకుంటారు.

4. ఢిల్లీ పీఠానికి రాచబాటగా పరిగణించే కీలకమైన ఉత్తరప్రదేశ్‌పై ఈసారి బీజేపీ మరింతగా ఫోకస్ చేస్తోంది. రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లకు గాను 2019 ఎన్నికల్లో 16 చోట్ల బీజేపీ ఓటమి చవిచూసింది. అనంతరం రాయ్‌బరేలీ, మెయిన్‌పురి స్థానాలను ఉప ఎన్నికల్లో చేజిక్కించుకుంది. మిగతా 14 లోక్‌సభ స్థానాల్లో పార్టీ బాగా బలహీనంగా ఉందన్న అంచనాతో వాటిపై బాగా దృష్టి పెడుతోంది. రాయ్‌బరేలీ, మెయిన్‌పురితో పాటు ఈ 14 స్థానాలకూ అభ్యర్థులను తొలి జాబితాలోనే ప్రకటించే యోచనలో ఉంది. వీటిలో సమాజ్‌వాదీ పార్టీ కంచుకోటలుగా చెప్పే పలు స్థానాలున్నాయి.

5. ఇలాగే బిహార్లో కూడా క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉన్నట్టు భావిస్తున్న నవడా, సుపౌల్, కిషన్‌గంజ్, కటిహార్, ముంగేర్, గయ వంటి స్థానాలు కూడా బీజేపీ తొలి జాబితాలోనే ఉంటాయని భావిస్తున్నారు.

6. మధ్యప్రదేశ్‌లో పీసీసీ మాజీ చీఫ్, కాంగ్రెస్ కురువృద్ధుడు కమల్‌నాథ్ కంచుకోటైన ఛింద్వారాతో పాటు ఆ పార్టీకి పట్టున్న పలు స్థానాలపై బీజేపీ గట్టిగా దృష్టి పెట్టింది. ఛింద్వారా బాధ్యతలను కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు అప్పగించారు.

7. కేరళలో కూడా త్రిసూర్, తిరువనంతపురం, పథినంతిట్ట వంటి స్థానాల్లో విజయవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు బీజేపీ అంచనా వేస్తోంది. త్రిసూర్ నుంచి సినీ హీరో సురేశ్ గోపిని బరిలో దించుతుందన్న అంచనాలున్నాయి.

8. మహారాష్ట్రలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ కంచుకోటైన బారామతితో పాటు బుల్దానా, ఔరంగాబాద్ వంటి లోక్‌సభ స్థానాల్లో ఈసారి ఎలాగైనా పాగా వేసి తీరాలని బీజేపీ పట్టుదలగా ఉంది. ఇక పంజాబ్‌లో అమృత్‌సర్, ఆనంద్‌పూర్ సాహిబ్, భటిండా, గురుదాస్‌పూర్ తదితర లోక్‌సభ సీట్లపై కూడా పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

9. పంజాబ్, మహారాష్ట్ర, బిహార్లలో స్థానిక పార్టీలతో బీజేపీ పొత్తు చర్చలు ఇప్పటికే ముమ్మరంగా సాగుతున్నాయి. పరిస్థితులు, అవసరాలను బట్టి ఈ రాష్ట్రాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వెళ్లాలన్న యోచనలో అధినాయకత్వం ఉంది.

10. 70 ఏళ్లు పైబడ్డ నేతలకు ఈసారి టికెట్లు ఇవ్వొద్దన్న యోచన కూడా బీజేపీ అధినాయకత్వం పరిశీలనలో ఉందని విశ్వసనీయ సమాచారం! మూడుసార్లకు మించి నెగ్గిన వారిని కూడా పక్కన పెట్టనుందని చెబుతున్నారు. వారికి బదులు కొత్త ముఖాలకు చాన్సివ్వాలని మోదీ–షా ద్వయం సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చారని బీజేపీ వర్గాల్లో గట్టిగానే వినిపిస్తోంది. ఇది నిజమే అయితే అందరికీ వర్తింపజేస్తారా, మినహాయింపులుంటాయా అన్నది చూడాలి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రజల్లోకి వెళ్లండి

- కాంగ్రెస్ శ్రేణులకు ఖర్గే ఉద్బోధ
- అనవసర వ్యాఖ్యలొద్దని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: కొన్ని నెలలుగా అత్యంత ప్రతికూల వాతావరణంలోనూ కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ చాలా కష్టపడి పని చేశారని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అందుకు తగ్గ ప్రతిఫలం దక్కుతుందన్న నమ్మకముందని ధీమా వ్యక్తం చేశారు. ''కేవలం భారీ సభలకే పరిమితమైతే చాలదు. ప్రజల్లోకి వెళ్లాలి. వారితో మమేకమై పని చేయాలి. అప్పుడే వారి విశ్వాసాన్ని పొందగలం'' అంటూ నేతలకు, శ్రేణులకు ఉద్బోధించారు. బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏఐసీసీలోని పలు విభాగాల చీఫ్‌లు, ముఖ్య నేతలతో ఆయన సమీక్ష జరిపారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు. పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రపై దిశానిర్దేశం చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు భేటీలో పాల్గొన్నారు.

ఓట్లను సీట్లుగా మార్చాలి

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 4.92 కోట్ల ఓట్లొచ్చినా సీట్లు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదని ఖర్గే గుర్తు చేశారు. అందుకే దేశం కోరుతున్న మార్పు సాకారం కావాలంటే కాంగ్రెస్ శ్రేణులన్నీ అట్టడుగు స్థాయిలో రాత్రింబవళ్లు కష్టపడాలని సూచించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర విజయానికి కృషి చేయాలన్నారు. బీజేపీ పదేళ్ల వైఫల్యాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. విపక్ష ఇండియా కూటమి బలోపేతం అవుతుండటంతో పాలక ఎన్డీఏలో కలవరపాటు మొదలైందన్నారు. ప్రత్యర్థుల అబద్ధపు ప్రచారాన్ని ఎదుర్కోవాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అనుకూల వాతావరణాన్ని చెడగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు.

జమిలి ఎన్నికలు... కోవింద్ కమిటీకి 5,000 సూచనలు

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో ఏర్పాటైన 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' కమిటీకి ప్రజల నుంచి ఇప్పటిదాకా 5,000 పై చిలుకు సలహాలు, సూచనలు అందినట్టు సమాచారం. కమిటీ దీనిపై గత వారం సలహాలను ఆహ్వానించడం తెలిసిందే. జనవరి 15 దాకా అందే సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. గత సెప్టెంబర్లో ఏర్పాటైన కోవింద్ కమిటీ ఇప్పటిదాకా రెండుసార్లు సమావేశమైంది. జమిలి ఎన్నికలపై సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ ఆరు జాతీయ, 33 గుర్తింపు పొందిన పార్టీలకు లేఖలు రాసింది. లా కమిషన్‌తో సమావేశమై అభిప్రాయాలను తెలుసుకుంది. జమిలి ప్రతిపాదనను, కోవింద్ కమిటీ ఏర్పాటును కాంగ్రెస్, పలు ఇతర విపక్షాలు ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకించడం తెలిసిందే.



విశ్వమిత్ర భారత్

వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

- గ్లోబల్ ఎకానమీలో గ్రోత్ ఇంజన్‌గా ఇండియా
- ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదగడం ఖాయం
- ఇండియా అంకితభావం, పట్టుదల, నిరంతర శ్రమతో ప్రపంచం సురక్షితం
- రాబోయే 25 సంవత్సరాలు భారతీయులకు అమృత కాలం

గాంధీనగర్: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్ నూతన ఆశారేఖగా ఆవిర్భవించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచ దేశాలు భారత్‌ను స్థిరత్వానికి ఒక ముఖ్యమైన మూలస్తంభంగా, నమ్మకమైన మిత్రదేశంగా, భాగస్వామిగా, గ్లోబల్ ఎకానమీలో గ్రోత్ ఇంజన్‌గా, గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా, టెక్నాలజీ హబ్‌గా, ప్రజాస్వామ్యసాధంగా పరిగణిస్తున్నాయన్నారు. మారుతున్న ప్రపంచ క్రమంలో విశ్వమిత్రగా భారత్ అవతరిస్తోందన్నారు. గాంధీనగర్‌లో బుధవారం పదో 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సు' ప్రారంభోత్సవంలో మోదీ ప్రసంగించారు. త్వరలో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని రేటింగ్ ఏజెన్సీలన్నీ చెబుతున్నాయని గుర్తుచేశారు. ఉమ్మడి లక్ష్యాలను నిర్దేశించడంతోపాటు వాటిని సాధించగలమన్న విశ్వాసాన్ని ప్రపంచానికి భారత్ ఇస్తోందన్నారు.

పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు

ప్రపంచ అభివృద్ధికి, శ్రేయస్సుకు 140 కోట్ల మంది భారతీయులు ప్రాధాన్యతలు, ఆకాంక్షలు ఒక ఆధారంగా నిలుస్తున్నాయని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. ఇండియా ప్రాధాన్యతలు చాలా స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. స్థిరమైన పారిశ్రామికాభివృద్ధి, ఆధునిక మౌలిక వసతులు, నూతన తయారీ రంగం, కొత్తతరం నైపుణ్యాలు, భవిష్యత్తు టెక్నాలజీ, కృత్రిమ మేధ, నవీన ఆవిష్కరణలు, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన వనరులు, సెమీ కండక్టర్ల తయారీకి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ ప్రగతికి అద్భుత అవకాశాలు ఉన్నాయని వివరించారు. గత పదేళ్లలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టామని, మన ఆర్థిక వ్యవస్థకు ఈ సంస్కరణలే చోదకశక్తిగా మారుతున్నాయని వెల్లడించారు. కొన్ని నెలల క్రితమే 75వ స్వాతంత్య్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నామని, 25 ఏళ్ల తర్వాత 100వ స్వాతంత్య్ర దినోత్సవాలు జరుపుకోబోతున్నాయని చెప్పారు. రాబోయే 25 సంవత్సరాలు మనకు అమృత కాలమని ఉద్ఘాటించారు. 'అభివృద్ధి చెందిన భారత్' అనే లక్ష్యాన్ని ఈ అమృత కాలంలో సాధించుకోవాలని ప్రజలను పిలుపునిచ్చారు.

విదేశీ పెట్టుబడులకు వెల్‌కం


మనందరి ఉమ్మడి కృషి వల్ల 21వ శతాబ్దంలో ఇండియాకు ఉజ్వలమైన భవిష్యత్తు లభించబోతోందని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గత ఏడాది జీ20 కూటమికి భారత్ సారథ్యం వహించిందని, ప్రపంచ భవిష్యత్తు కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను అందించిందని తెలియజేశారు. ఐ2యూ2(ఇండియా, ఇజ్రాయెల్, యూఏఈ, యూఎస్‌ఏ) గ్రూప్‌తోపాటు ఇతర బహుముఖీన సంస్థలతో సంబంధాలను నిరంతరం బలోపేతం చేసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీని సమర్థవంతంగా వాడుకుంటూ దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశామని, 40 వేలకుపైగా కాలం చెల్లిన నిబంధనలను సులభతర వాణిజ్య విధానం, జీఎస్టీ కింద రద్దు చేశామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి, గ్లోబల్ బిజినెస్‌కు ఇండియాను గమ్యస్థానంగా మార్చడానికి మూడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై(ఎఫ్‌టీఏ) సంతకాలు చేశామని ప్రధాని మోదీ చెప్పారు. పలు కీలక రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెట్టామని వివరించారు. గత పదేళ్లలో పెట్టుబడి వ్యయాన్ని 10 రెట్లు పెంచామన్నారు.

టెక్నాలజీతో జీవితాల్లో మార్పు

గ్రీన్ ఎనర్జీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారత్ శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్ ఎనర్జీలో మూడు రెట్లు, సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 20 రెట్లు ప్రగతి నమోదైందని తెలిపారు. గత పదేళ్లలో చౌక ధరకే ఫోన్లు, డేటా వంటివి దేశంలో సరికొత్త డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చాయని అన్నారు. ప్రతి గ్రామానికీ ఆప్టికల్ ఫైబర్, 5జీ టెక్నాలజీ రాకతో సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు వచ్చిందని చెప్పారు. 2028కల్లా భారత్ 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి సంపన్న దేశంగా మారుతుందన్నారు.

2,100 కిలోల గంట.. 108 అడుగుల అగరుబత్తి

అయోధ్య రాముడికి దేశ విదేశాల నుంచి ఎన్నెన్నో కానుకలు



న్యూఢిల్లీ: అయోధ్యలో నిర్మించిన భవ్యమందిరంలో కొలువుదీరబోతున్న బాల రాముడికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అరుదైన కానుకలు వెల్లువెత్తుతున్నాయి. 108 అడుగుల పొడవైన అగరుబత్తి, 2,100 కిలోల బరువైన గంట, 1,100 కిలోల బరువైన భారీ ప్రమిద, బంగారు పాదుకలు, 10 అడుగుల ఎత్తయిన తాళం, తాళంచెవి, ఒకేసారి ఎనిమిది దేశాల సమయాన్ని సూచించే గడియారం తదితర ప్రత్యేక కానుకలను అయోధ్య రాముడికి సమర్పించేందుకు భక్తులు ఇప్పటికే సిద్ధమయ్యారు. ఈ నెల 22వ తేదీన రామ మందిరంలో రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దేశ విదేశాల నుంచి బహుమతులు అందుతున్నాయి. సీతమ్మ పుట్టిన ఊరు జనక్‌పూర్ ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. నేపాల్ నుంచి అయోధ్యకు వెండి చెప్పులు, బంగారు ఆభరణాల వంటి 3,000కుపైగా బహుమతులు వచ్చాయి. ఇక శ్రీలంకలోని అశోక్ వాటిక నుంచి తీసుకొచ్చిన ఒక అరుదైన రాయిని అక్కడి ప్రతినిధులు అయోధ్యలో అందజేశారు.

7,000 కిలోల 'రామ్ హల్వా'

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కోసం గుజరాత్ భక్తులు 44 అడుగుల పొడవైన ఇత్తడి జెండా స్తంభాన్ని పంపిస్తున్నారు. మహారాష్ట్రకు విష్ణు మనోహర్ అనే వంట మాస్టర్ 7,000 కిలోల 'రామ్ హల్వా' తయారు చేసి అయోధ్యలో భక్తులకు పంపిణీ చేస్తారు. శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థాన్ 200 కిలోల భారీ లడ్డూ తయారీలో నిమగ్నమైంది. అయోధ్యకు లక్ష లడ్డూలు పంపిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ప్రకటించడం తెలిసిందే. సీతమ్మ కోసం సూరత్‌లో ప్రత్యేకంగా చీర తయారు చేస్తున్నారు. సూరత్‌కు చెందిన ఓ వజ్రాల వ్యాపారి 2 కిలోల వెండి, 5,000 అమెరికన్ వజ్రాలతో కూడిన నెక్లెస్ రాముడికి బహూకరించబోతున్నారు.

రామాలయ ప్రారంభోత్సవానికి... ఖర్గే, సోనియా దూరం

- రాజకీయ ప్రాజెక్టుగా రామ మందిరం
- అసంపూర్తి ఆలయాన్నే ప్రారంభిస్తున్నారు
- ఎన్నికల లబ్ధికి బీజేపీ యత్నమంటూ ధ్వజం
- రామునిపై సోనియాకు విశ్వాసం లేదు: బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యలో జనవరి 22న జరిగే రామాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి దూరంగా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి నిర్ణయించుకున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఈ మేరకు వెల్లడించారు. కేవలం లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ, ఆరెస్సెస్ కలిసి రామ మందిరాన్ని రాజకీయ ప్రాజెక్టుగా మార్చాయని విమర్శించారు. అందుకే అసంపూర్తి ఆలయాన్ని హడావుడిగా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. ఖర్గే, సోనియా, అధీర్‌లను రామ మంది ట్రస్టు, వీహెచ్‌పీ నేతలు డిసెంబర్‌లో కలిసి రామ మందిర ప్రారంభోత్సవానికి రావాలంటూ వ్యక్తిగతంగా ఆహ్వాన లేఖలు అందించారు. కానీ అది పక్కా ఆరెస్సెస్, బీజేపీ రాజకీయ సంరంభమని జైరాం విమర్శించారు. ''కోట్లాది మంది భారతీయులు రాముడిని పూజిస్తారు. మతం మనిషి వ్యక్తిగత విషయం. అందుకే రామున్ని పూజించే కోట్లాది మంది సెంటిమెంట్లను గౌరవిస్తూనే ఆహ్వానాన్ని నేతలు సున్నితంగా తిరస్కరించారు'' అన్నారు.

వారిని ప్రజలు బాయ్‌కాట్ చేస్తారు

కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ దుయ్యబట్టింది. రాముని అస్తిత్వాన్నే నిరాకరిస్తున్నామంటూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ నుంచి ఇంకేం ఆశించగలమని ఎద్దేవా చేసింది. హిందూ మతాన్ని, హిందువులను అవమానించడం కాంగ్రెస్‌కు, విపక్ష ఇండియా కూటమి పక్షాలకు కొత్తేమీ కాదంటూ మండిపడింది. రామునిపై నమ్మకం లేదని సోనియా మరోసారి నిరూపించుకున్నారని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విమర్శించారు. వారిని దేశ ప్రజలు బాయ్‌కాట్ చేస్తారని మరో మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.

షిండే వర్గమే అసలైన శివసేన

- ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పిటిషన్లను తిరస్కరిస్తున్నాం
- మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ స్పష్టీకరణ



స్పీకర్ నర్వేకర్ (పైన), శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే, సీఎం ఏక్‌నాథ్ షిండే


ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన రాజకీయ పార్టీ అని రాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ బుధవారం తేల్చేశారు. ఏడాదిన్నరగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరదించారు. శివసేన పార్టీ 2022 జూన్‌లో రెండుగా విడిపోయిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు రెండు పక్షాలుగా చీలిపోయారు. ఒక వర్గానికి నేతృత్వం వహిస్తున్న ఏక్‌నాథ్ షిండే బీజేపీ, ఎన్సీపీ మద్దతుతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. మరో వర్గానికి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వం వహిస్తున్నారు. తమ వర్గమే అసలైన శివసేన అంటూ ఇరువురు నేతలు వాదిస్తున్నారు. అవతలి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ షిండే, ఉద్ధవ్ ఠాక్రే అసెంబ్లీ స్పీకర్‌కు విజ్ఞాపనలు సమర్పించారు. వీటిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ తన నిర్ణయం ప్రకటించారు. షిండే వర్గమే అసలైన శివసేన అని స్పష్టం చేశారు. ఉద్ధవ్ వర్గానికి చెందిన సునీల్ ప్రభును విప్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ తొలగింపు 2022 జూన్ 21 నుంచి వర్తిస్తుందన్నారు. షిండే వర్గానికి చెందిన భరత్ గోగావాలేను అధికారికంగా విప్‌గా గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ వెల్లడించారు. ఏ ఒక్క ఎమ్మెల్యేపై కూడా అనర్హత వేటు వేయడం లేదన్నారు. పార్టీ నుంచి నేతలను బహిష్కరించే అధికారం శివసేన చీఫ్‌కు లేదని పేర్కొన్నారు. 2018 నాటి శివసేన రాజ్యాంగాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఉద్ధవ్ వర్గం కోరగా, స్పీకర్ అంగీకరించలేదు. 1999 నాటి రాజ్యాంగాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. శివసేన ఎన్నికల సంఘం సైతం ఈ రాజ్యాంగాన్నే గుర్తించిందని పేర్కొన్నారు. మొత్తం 54 మంది ఎమ్మెల్యేలకు గాను 37 మంది ఎమ్మెల్యేలు షిండే వర్గంలోనే ఉన్నాయని గుర్తుచేశారు. స్పీకర్ నిర్ణయంపై షిండే వర్గం సంబరాలు చేసుకుంది. సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా దీనిపై హర్షం వ్యక్తం చేశారు.

సుప్రీంను ఆశ్రయిస్తాం: ఉద్ధవ్ వర్గం

స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని శివసేన(ఉద్ధవ్) ప్రకటించింది. స్పీకర్ నిర్ణయాన్ని అంగీకరించబోమని ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. ఇదంతా బీజేపీ కుట్ర అని పార్టీ నేతలు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్ మండిపడ్డారు. బాల్ ఠాక్రే స్థాపించిన శివసేనను ఎవరూ అంతం చేయలేరన్నారు. ఇది మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారమని ఆరోపించారు. షిండే వర్గమే అసలైన శివసేన అయితే తమ వర్గం ఎమ్మెల్యేలపై ఎందుకు అనర్హత వేటు వేయలేదని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయాన్ని ప్రజాస్వామ్య హత్యగా ఉద్ధవ్ ఠాక్రే అభివర్ణించారు.

వినూత్నమైన కోవిడ్ వ్యాక్సిన్

అభివృద్ధి చేసిన బెంగళూరు ఐఐఎస్సీ సైంటిస్టులు



బెంగళూరు: కర్ణాటకలోని బెంగళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) సైంటిస్టులు వినూత్నమైన కోవిడ్–19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. సార్స్–కోవ్–2కు చెందిన అన్ని రకాల సబ్ వేరియంట్లను ఇది సమర్థంగా ఎదుర్కొంటోందని చెబుతున్నారు. భవిష్యత్తులో పుట్టుకొచ్చే వేరియంట్లపైనా పోరాడగలదని అంటున్నారు. ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ నేతృత్వంలో ఐఐఎస్సీ మాలిక్యులర్ బయోఫిజిక్స్ యూనిట్ బృందం తయారు చేసిన ఈ టీకాకు ఆర్‌ఎస్2 అని పేరుపెట్టారు. కోవిడ్–19పై జరుగుతున్న పోరాటంలో ఈ వ్యాక్సిన్ ఒక విప్లవాత్మకమైన ముందడుగు అని సైంటిస్టులు అభివర్ణించారు. ఇది వేడిని తట్టుకోగలదని, చల్లని ప్రదేశంలో నిల్వ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. కరోనా వైరస్‌కు చెందిన స్పైక్ ప్రొటీన్లలోని రెండు కాంపోనెంట్ల సమ్మేళనంతో ఆర్‌ఎస్2 టీకాను అభివృద్ధి చేశారు. ఇదొక సింథటిక్ యాంటీజెన్. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కరోనా టీకాలతో పోలిస్తే ఆర్‌ఎస్ఈ టీకా మరింత ఎక్కువ రక్షణ ఇస్తుందని ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇందులోని ఎస్2 అని సబ్ యూనిట్ వైరస్ మ్యుటేషన్లను సమర్థంగా తట్టుకుంటుందని పేర్కొన్నారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 11 । జనవరి । 2024

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): గురువారం కొత్త లేబర్ అడ్డా, జ్యోతినగర్, భాగ్యనగర్, విద్యానగర్, సంతోష్‌నగర్, ఆదిత్యనగర్, కొత్తయాస్వాడ, ఆర్టీసీ వర్క్‌షాపు వెనక భాగం, విజయదుర్గకాలనీ, భగత్‌నగర్, ముకరంపుర, తెలంగాణ చౌక్ నుంచి మున్సిపల్ ఆఫీస్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, కలెక్టరేట్ ముందు, ఐబీ చౌరస్తా, తెలంగాణ చౌక్, యాక్సిస్ బ్యాంక్ ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు.



క్వింటాల్ పత్తి రూ. 6,800

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పత్తి మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ పత్తి రూ. 6,800 పలికింది. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

గరిష్టం/కనిష్టం
29.5/16.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటరు కార్డులొస్తే.. కార్పొరేటర్ల ఇళ్లకే

- మెప్పు కోసం పోస్ట్‌మ్యాన్‌ల నిర్వాకం
- నగరంలోని పలు డివిజన్లలో పరిస్థితి

'నగరంలోని హౌస్సేనిపురకు చెందిన మహమ్మద్ అబ్దుల్ జమీల్ కుటుంబంలో 12 మందికి ఓటుహక్కు ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వీరిలో ఏ ఒక్కరికీ ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు రాలేదు. కాలనీలోని మిగతా ఓటర్లకు కార్డులు వస్తున్నా తమకు రాకపోవడంపై జమీల్ ఆరా తీశారు. తమ పేరిట వచ్చినప్పటికీ పోస్ట్‌మ్యాన్ సంబంధిత కార్పొరేటర్‌కు వాటిని అందజేసినట్లు తెలిసింది. ఆన్‌లైన్ సెంటర్‌లో ఓటరు గుర్తింపు కార్డులు డౌన్‌లోడ్ చేసుకొని, పోస్ట్‌మ్యాన్ నిర్వాకంపై ఫిర్యాదు చేశారు.'

కరీంనగర్ కార్పొరేషన్: ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకం, కార్యక్రమం, ఆదేశమైనా తమ ద్వారానే ప్రజలకు అందాలని కొంతమంది కార్పొరేటర్లు తాపత్రయపడుతున్నారు. దీంతో కరీంనగర్ బల్దియాలోని 60 డివిజన్లలో చాలా మంది తమ వ్యక్తిగత కార్యాలయం ఏర్పాటు చేసుకుంటున్నారు. నగరపాలక సంస్థ, తహసీల్దార్ తదితర కార్యాలయాలకు డివిజన్ ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ కార్యాలయాన్ని సంప్రదిస్తే చాలు వారికి సేవలందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కొందరు మాత్రం తమ ప్రత్యర్థులు, వ్యతిరేకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేసింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి తపాలా శాఖ ద్వారా సంబంధిత ఓటరు ఇంటికి చేరాలి. కానీ, కొంతమంది పోస్ట్‌మ్యాన్‌లు మెప్పు కోసం ఆ కార్డులను సంబంధిత కార్పొరేటర్ల ఇంటికి తీసుకెళ్తున్నారు. వారు ప్రత్యర్థి పార్టీల సానుభూతిపరులకు ఓటరు కార్డులు ఇవ్వకపోవడం సమస్యగా మారింది. ఆన్‌లైన్ సెంటర్లలో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అందించిన కార్డులను కార్పొరేటర్లు ఆపుతుండటం పట్ల బాధితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు చేస్తున్నారు.

జిల్లా కోర్టుల్లో ఈ–ఫైలింగ్

- పైలట్ ప్రాజెక్టుగా కరీంనగర్ ఎంపిక
- ఫిబ్రవరి 8 నుంచి ప్రారంభం

కరీంనగర్ క్రైం: జిల్లా కోర్టుల్లో ఈ–ఫైలింగ్ విధానంలో కేసుల దాఖలుకు హైకోర్టు కరీంనగర్ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించి జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం సర్క్యులర్ విడుదల చేశారు. ప్రస్తుతం కోర్టుల్లో కేసుల దాఖలు భౌతికంగా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా చేసేందుకు ఈ–ఫైలింగ్ విధానాన్ని జిల్లా కోర్టులతోపాటు అదనపు జిల్లా కోర్టుల్లో ఫిబ్రవరి 8 నుంచి ప్రవేశపెడుతున్నారు. ఈ–ఫైలింగ్ చేసే న్యాయవాదులు జిల్లా కోర్టు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫాం తీసుకోవాలి. ఇందులో తమ తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ నంబర్, ఫోన్ నంబర్, ఇ–మెయిల్ ఐడీ రాసి, ఈ నెల 25లోగా జిల్లా కోర్టులో అందించాల్సి ఉంటుంది. అనంతరం పై వివరాలతో ఆన్‌లైన్‌లో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాలి. కేసులను ఈ–ఫైలింగ్ చేసేటప్పుడు హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేయాల్సి ఉంటుందని జడ్జి తెలిపారు. పూర్తి వివరాలకు https://filing.ecourts.gov.in/pdedev/ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎంవీఐల బదిలీ

తిమ్మాపూర్(మానకొండూర్): రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో ఓడీలు, అదనపు బాధ్యతలు, ఇన్‌చార్జీలను రద్దు చేసింది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా రవాణాశాఖలో ఓడీగా పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు గౌస్‌పాషాను ఖమ్మం జిల్లాకు, మజూద్ అలీ, సిరాజ్ రెహ్మాన్‌లను పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఖమ్మంలో బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీనివాస్, హుస్నాబాద్‌లో పని చేస్తున్న ఠాకూర్ ఈశ్వర్ సింగ్‌లు హుజూరాబాద్‌కు బదిలీ అయ్యారు. వీటిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ధ్రువీకరించారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- డీఎంహెచ్‌వో లలితాదేవి

సైదాపూర్(హుస్నాబాద్): ఏదైనా సమస్య వచ్చినప్పుడు విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని డీఎంహెచ్‌వో, హుజూరాబాద్ క్లస్టర్ నోడల్ అధికారి లలితాదేవి అన్నారు. బుధవారం సోమారం ఆదర్శ పాఠశాలలో స్నేహిత ఫేజ్–1 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. బాలబాలికలు మానసిక, ఆరోగ్యపరమైన సమస్య వచ్చినప్పుడు మనసులో పెట్టుకొని, కుమిలి పోయి, ప్రాణ నష్టం వాటిల్లే అఘాయిత్యాలకు పాల్పడకుండా తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ, పోలీసులకు గానీ చెప్పుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్హానా, ఏఈవో నిఖిల్, సైదాపూర్ మెడికల్ ఆఫీసర్ సౌమ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట ప'రేషన్'

- ఈ నెల చాలాచోట్ల దుకాణాలకు చేరని బియ్యం
- 4 నుంచే ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- సంక్రాంతి వేళ పిండి వంటలకు ఇబ్బంది
- లబ్ధిదారుల ఎదురుచూపు
- జిల్లాలో పరిస్థితి



బియ్యం లేక మూసివేసిన రేషన్ దుకాణం

ఇది నగరంలోని వావిలాలపల్లి రేషన్ దుకాణం. ఇంకా బియ్యం రాకపోవడంతో మూసివేశారు. ఈ నెలలో ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. రేషన్ దుకాణం వద్దకు వెళ్లడం.. బియ్యం రాలేదనడంతో తిరిగిరావడం నిత్యకృత్యమవుతోంది.

కరీంనగర్ అర్బన్: ఈ నెల రేషన్ బియ్యం ఇంకా చౌక ధరల దుకాణాలకు చేరలేదు. సంక్రాంతి వేళ పిండి వంటలు తయారు చేసేందుకు బియ్యం కోసం గృహిణులు ఎదురుచూస్తున్నారు. అసలు పంపిణీ చేస్తారా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. రేషన్ పంపిణీ కొన్ని నెలలుగా ప్రహసనంగా మారింది. నిర్దిష్ట గడువులోగా ఇవ్వాల్సి ఉండగా కార్డుదారులకు పడిగాపులు.. నిరీక్షణే ఎదురవుతోంది. ఈ నెలకు సంబంధించి 19వ తేదీ వరకు మా త్రమే పంపిణీ గడువు కాగా, ఇప్పటికే 10 రోజులు గడిచిపోయాయి. 4వ తేదీ నుంచి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా ఇప్పటివరకు 20 శాతం షాపులకే బియ్యం అందగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చేరలేదని సమాచారం.

నాలుగు నిల్వ కేంద్రాల ద్వారా..

జిల్లాలో కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మండల స్థాయి నిల్వ కేంద్రాల ద్వారా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తారు. అత్యధికంగా కరీంనగర్ పరిధిలో 218 షాపులుండగా మిగతావి హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పరిధిలో ఉన్నాయి. అయితే 250కి పైగా దుకాణాలకు పూర్తిస్థాయిలో బియ్యం రాలేదు. కరీంనగర్, హుజూరాబాద్, కొత్తపల్లి, చిగురుమామిడి, గన్నేరువరం, చొప్పదండి, రామడుగు, గంగాధర, సైదాపూర్ ప్రాంతాల్లోని అత్యధిక దుకాణాలకు బియ్యం రాలేదు.

జిల్లా సమాచారం
గ్రామాలు: 313
మున్సిపాలిటీలు: 5
మొత్తం జనాభా: 10,09,234
రేషన్ కార్డులు: 2,74,620
యూనిట్లు: 8,17,156

రేషన్ డీలర్లకు తంటా..

రేషన్ దుకాణాలకు బియ్యం ఆలస్యంగా వస్తుండటంతో డీలర్ల బాధ వర్ణనాతీతం. పండుగ లేదు.. శుభకార్యాలు లేవు.. దుకాణంలోనే కాలం గడుపుతున్నారు. బియ్యం ఒకేసారి పంపించకపోవడంతో పూర్తిస్థాయిలో పంపిణీ జరగడం లేదు. దీంతో కమిషన్ గిట్టుబాటు కాక నిరాశ చెందుతున్నారు.

చివరి దశలో మూవ్‌మెంట్..

చాలాచోట్ల బియ్యం రాలేదని డీలర్లు చెబుతున్నారు. ఉన్నచోట పాత స్టాక్‌నే ఇస్తుండగా.. అదీ అరకొరే. గత శుక్రవారం సాయంత్రం ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్(ఇ–పాస్) సైట్ తెరుచుకోగా కరీంనగర్ కేంద్రంలో కొన్నిచోట్ల మాత్రమే పంపిణీ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆ ఊసే లేక పోగా కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇ–పాస్ సైట్ తెరుచుకోకపోవడం వల్ల పంపిణీ ఆలస్యమైందని, మూవ్‌మెంట్ కూడా చివరి దశలో ఉందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దుకాణం పరిధిలో కనిష్ఠంగా 500 మంది కార్డుదారులున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా పంపిణీ జరిగేలా పర్యవేక్షణ చేయడం అత్యవసరం. గడువు పెంచుతారో లేదో చూడాలి.

సమస్య పరిష్కరించాలి



సరైన ప్రణాళిక లేకపోవడంతో డీలర్లందరం ఇబ్బంది పడుతున్నారు. 4వ తేదీలోపే బియ్యం మూవ్‌మెంట్ కావాల్సి ఉండగా ఇప్పటికీ సాగుతోంది. వచ్చిన బియ్యాన్ని వచ్చినట్లే పంపిణీ చేస్తున్నా బియ్యం లేక రోజుల తరబడి ఖాళీ ఉంటున్నం. ఉన్నతాధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలి.

– రొడ్డ శ్రీనివాస్, తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

భూ ఆక్రమణదారులను వదిలిపెట్టం



మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

- ఆక్రమణల సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలి
- వినోద్, సంజయ్ జిల్లాకు చేసిందేమీ లేదు
- బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కరీంనగర్ కార్పొరేషన్: భూ ఆక్రమణలు సహించే ప్రసక్తే లేదని, ఆక్రమణదారులను వదిలిపెట్టబోమని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో ఆయన మార్నింగ్ వాక్ చేశారు. విద్యార్థినులతో ముచ్చటించారు. భూ ఆక్రమణలు జరిగితే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. విచారణ జరిపించి ఎవరి స్థలమైతే వారికి అప్పగిస్తామని పేర్కొన్నారు. భూ ఆక్రమణదారులంతా కాంగ్రెస్ పాలనలో భయపడాల్సిందేనని.. రాష్ట్రం విడిచి పెట్టి పోవాల్సిందేనని అన్నారు. కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి దగ్గరగా ఉన్నానని చెప్పుకునే వినోద్, హిందువుల చాంపియన్ అనే ఎంపీ బండి సంజయ్ కనీసం తిరుపతికి ప్రతీరోజు రైలు నడిపించలేకపోయారని, వారు జిల్లాకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలది ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీలా ఉందన్నారు. నెలరోజులు కూడా పూర్తి కాకుండా గ్యారంటీలపై కాలయాపన అనడం హాస్యాస్పదమని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచుతా

మానకొండూర్: జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచుతానని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మానకొండూర్ మండలంలోని నిజాయితీగూడెంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని, గంగిపల్లిలో బస్టాండ్, ఓపెన్ జిమ్, కొండపల్కలలో ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలనకు 1.05 కోట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. 4,500 మందితో డాటా ఎంట్రీ చేస్తున్నామని, ఈ నెల 27వ తేదీ వరకు పూర్తవుతుందని తెలిపారు. ప్రతీ స్కీంను అర్హులందరికీ అందిస్తామని పేర్కొన్నారు. తిమ్మాపూర్‌లోని చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌కు జువ్వాడి చొక్కారావు పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. చొక్కారావు జయంతి రోజే కరీంనగర్ వన్‌టౌన్ ముందు ఆయన విగ్రహావిష్కరణ చేస్తామని తెలిపారు. ఆర్డీవో మహేశ్వర్, ఎంపీపీ సులోచన, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు మురళీధర్, శాలిని, ఎంపీటీసీ సభ్యులు భాస్కరాచారి, సంపత్, రేణుక, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పదవీకాలం చట్టమే నిర్ణయిస్తుంది

ఈ నెలాఖరుతో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుందని, వారు ఆ పదవిలో ఉంటారో లేక ప్రత్యేకాధికారులే ఉంటారో చట్టం నిర్ణయిస్తుందని మంత్రి పొన్నం అన్నారు. గత ప్రభుత్వంలో చాలామంది సర్పంచ్‌లు బిల్లులు రాక, వేధింపులకు గురై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. అయితే, వారి సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలం ఉందని పేర్కొన్నారు.

డెయిరీలో చేరి ఆదాయం పొందాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు

కరీంనగర్ కల్చరల్/చిగురుమామిడి(హుస్నాబాద్): పాల ఉత్పత్తిదారులు, వారి పిల్లలతోపాటు పాడి పశువుల సంక్షేమం కోసం కరీంనగర్ డెయిరీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రైతులు ఎక్కువ సంఖ్యలో డెయిరీలో చేరి, వ్యవసాయంతోపాటు డెయిరీ యూనిట్‌తో ఆదాయం పొందాలని సూచించారు. బుధవారం కరీంనగర్ డెయిరీ సంక్రాంతి ఉత్సవాలు–2024లో భాగంగా నిర్వహించిన రంగోలీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల నుంచి ముగ్గుల పోటీల్లో 472 మంది పాల ఉత్పత్తిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పి.శ్రీలత ముత్యంపేట, ద్వితీయ బహుమతి కె.లహరి మల్లంపల్లి, తృతీయ బహుమతి జె.రజిత మొగిలిపాలెం, మార్కెటింగ్ విభాగంలో మొదటి బహుమతి స్వప్న రాంనగర్, ద్వితీయ బహుమతి డి.సౌమ్య రెడ్డి చొప్పదండి, తృతీయ బహుమతి ఇ.రజిత మంకమ్మతోట, కరీంనగర్ డెయిరీ పరిధిలో అత్యధిక పాల సేకరణ చేసిన సంఘాల్లో ప్రథమ బహుమతి చిగురుమామిడి మండలంలోని సుందరగిరి సంఘం(రోజుకు 1,641 లీటర్లు) అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్‌కుమార్ అందుకున్నారు. ద్వితీయ బహుమతి నవాబ్‌పేట(రోజుకు 1,361 లీటర్లు), తృతీయ బహుమతి గంభీరావుపేట(1,296 లీటర్లు)కు దక్కాయి. విజేతలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతి అందజేశారు. నాబార్డ్ డీజీఎం శ్రీహరి ఏజీఎం స్వాతి, డీడీఎం జయప్రకాశ్, ఆర్జీఎం కె.శ్రీలత, కేడీసీసీబీ సీవోఎం సత్యనారాయణరావు, పద్మనగర్ బ్రాంచి మేనేజర్ సుజాత, డెయిరీ అడ్వైజర్లు బి.హనుమంత రెడ్డి, పి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు



డెయిరీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు

అవసరం లేకున్నా సిజేరియన్ వద్దు

- చేసే డాక్టర్లు, ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి
- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్

కరీంనగర్‌టౌన్: అవసరం లేకున్నా సిజేరియన్ చేయొద్దని, చేసే డాక్టర్లు, ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్, వైద్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఎండీఆర్, సీడీఆర్, మెటరనల్ డెత్‌లపై సమీక్షించాలన్నారు. అనుమతులు, అవసరమైన వైద్యులు లేకుండా ఐవీఎఫ్, ఐయూఎఫ్‌లను అందించే ఆస్పత్రులను గుర్తించి, వాటిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలని ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమంపై దృష్టిసారించాలని సూచించారు. వైద్యశాఖ ద్వారా జరిగే ప్రతీ పని సంబంధిత పోర్టల్‌లో నమోదు కావాలన్నారు. పీహెచ్‌సీలను కొన్ని రకాల ఆరోగ్యశ్రీ సేవలందించేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ఎవరైనా లింగనిర్ధారణ, అబార్షన్ చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. స్థానిక మెడికల్ కళాశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, సూపరింటెండెంట్ వీరారెడ్డి, డాక్టర్ జువేరియా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

'ఇరిగేషన్'లో రెండోరోజు సోదాలు



ఎల్ఎండీ కాలనీ నుంచి రికార్డుల తరలింపు

తిమ్మాపూర్(మానకొండూర్)/జ్యోతినగర్(రామగుండం): ఇరిగేషన్ కార్యాలయాల్లో సోదాలు రెండోరోజు బుధవారం కొనసాగాయి. అధికారులు తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ ఆఫీస్‌లో కీలక రికార్డులు తీసుకొని హైదరాబాద్ వెళ్లారు. వాటిని ప్రభుత్వానికి అందిస్తామని, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి, నాణ్యత నియంత్రణ, తనిఖీ విభాగం నంబర్–9 ఆఫీస్‌లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐజీసీ రాజు ఆధ్వర్యంలో సోదాలు చేశారు.

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

- ప్రభుత్వం సహకారం అందించాలి
- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరంలోని 35వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ సహకారంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. నగర వ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని హైలాండ్ జంక్షన్ ఆధునీకరణ జరుగుతోందని, తెలంగాణ తల్లి విగ్రహం, చొక్కారావు హైలాండ్‌లను వేర్వేరుగా అభివృద్ధి చేసి, విగ్రహాలను యథావిధిగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అవార్డులు ప్రకటించినా కరీంనగర్ నగరపాలక సంస్థకు వచ్చేలా అభివృద్ధి చేసి, పరిశుభ్రంగా మార్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం స్కూల్లో రూ.32 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ ఎత్తు పెంచే పనులకు భూమిపూజ చేశామని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.25 కోట్లతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుత ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- డీఏవోతో సహా అందరికీ టార్గెట్
- తేడాలుంటే చర్యలు

కరీంనగర్ అర్బన్: జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ బుధవారం తనిఖీలు చేసింది. ఎరువుల సరఫరా, పంపిణీ, అమ్మకాల నిర్వహణ నిరంతర ప్రక్రియ కాగా మండలాల పరిధిలోని ఏవోలు క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. హోల్‌సేల్ డీలర్ కంపెనీల నుంచి రిటైలర్ల వరకు ఎరువుల కొనుగోలు, అమ్మకాలపై ప్రభుత్వం రాయితీ భరిస్తోంది. ఇ–పాస్ మెషిన్ ద్వారా మాత్రమే విక్రయించాల్సి ఉండగా అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం ఫైప్స్ ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా వారంలో మొదటి 3 రోజులు 10 రిటైల్ దుకాణాలు, తర్వాత 3 రోజులు 10 దుకాణాలు మొత్తంగా వారానికి 20 షాపులు, జిల్లా వ్యవసాయ అధికారి వారానికి 10 హోల్‌సేల్ షాపులు తనిఖీ చేయాలని టార్గెట్ నిర్దేశించింది. భౌతిక నిల్వలు, రికార్డులు పరిశీలించి తేడా ఉంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లాలో డీఏవో వాసిరెడ్డి శ్రీధర్, ఏడీఏలు, ఏవోలు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. జిల్లాలో 21,706 మెట్రిక్ టన్నుల యూరియా, 4,972 మెట్రిక్ టన్నుల డీఏపీ, 29,653 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 4,593 మెట్రిక్ టన్నుల పొటాష్‌ను రైతులకు అందుబాటులో ఉంచారు.



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న డీఏవో శ్రీధర్

ఆడపిల్లలు ఆదర్శంగా నిలవాలి

- జిల్లా సంక్షేమాధికారి సరస్వతి

కొత్తపల్లి(కరీంగనర్): ఆడపిల్లలు చక్కని అలవాట్లు నేర్చుకొని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా సంక్షేమాధికారి(డీడబ్ల్యూవో) సరస్వతి అన్నారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్నేహిత ఫేస్–1 కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పాశ్చాత్య పోకడలు అధికమయ్యాయని, వాటికి ఆడపిల్లలు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అలాగే, అపరిచితులు ఇచ్చిన తినుబండారాలు తీసుకోవద్దని, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటర్నెట్, సెల్‌ఫోన్ వినియోగం జోలికిపోకుండా క్రమశిక్షణతో విద్యపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ నిర్మించుకోవచ్చని, లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. హెచ్ఎం వెంకటపద్మావతి, కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్ వనజ, ఏఈవో రాములు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ, టీచర్లున్నారు.



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సరస్వతి

క్లుప్తంగా

కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.71లక్షలు


డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈవో వెంకటేశ్ సమక్షంలో లెక్కించారు. 35రోజులకు రూ.71,73,723, అలాగే 51గ్రాముల మిశ్రమ బంగారం, 3.200 గ్రాముల మిశ్రమ వెండి, 30 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, సునీల్, ఏఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి


నిందితుడు

సిరిసిల్లక్రైం: పలు కేసుల్లో నిందితుడిగా అనుమానిస్తున్న వ్యకి పరారీలో ఉన్నాడని, కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సిరిసిల్ల టౌన్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో యువకుడి ఫొటోను షేర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఫొటోను సేకరించిన పోలీసులు అతని కోసం గాలింపులు చేపట్టారు. నిందితుడి వివరాలు తెలిసిన, ఎక్కడైన కనిపించినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన బత్తిని శ్రీకాంత్(25) కొత్తపల్లి ఠాణా పరిధిలోని సీతారాంపూర్‌లో తన భార్య, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఓ గ్యాస్ గోదాంలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నాడు. బుధవారం ఉదయం కడుపునొప్పి వస్తోందని కుటుంబసభ్యులకు తెలిపాడు. భార్య ఇంటి బయట ఉండగా లోపల ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సంతానం కలగ లేదని...

ముస్తాబాద్(సిరిసిల్ల): సంతానం కలగడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన గొట్టి ఇంద్రయ్య (45)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడం, భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం(మానకొండూర్): ఇప్పలపల్లిలో ఎస్సారెస్పీ కెనాల్‌కు బిగించిన విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. ఇప్పలపల్లికి చెందిన రైతులు కాలువకు మోటార్లను బిగించుకొని, దుక్కులు దున్నుతున్నారు. రైతు చింతిరెడ్డి కర్ణాకర్ రెడ్డి కెనాల్‌కు తాను బిగించిన మోటార్‌ను చూడటానికి బుధవారం వెళ్లగా కనిపించలేదు. చోరీకి గురైందని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇప్పటివరకు గ్రామంలో 10 వ్యవసాయ మోటార్ల దొంగతనం జరిగిందని రైతులు తెలిపారు.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న పరీక్ష
- ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన
- ఉమ్మడి జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు


రుక్మాపూర్ మోడల్ స్కూల్ (ఫైల్)

కరీంనగర్/మల్లాపూర్/వీర్నపల్లి/జ్యోతినగర్: ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మోడల్ స్కూళ్లు ఓ వరం. రూ.వేలకు వేలు ఖర్చులు పెట్టి, దూరప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ సంస్థల్లో విద్యనభ్యసించాలంటే పిల్లలు ఇబ్బంది పడాల్సి వచ్చేది. చదువుకునేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదర్శ పాఠశాలలను నెలకొల్పడంతో నాణ్యమైన విద్య అందుతోంది. బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్న మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 07న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, మిగతా వారు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలను http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో చొప్పదండి మండలంలోని రుక్మాపూర్, కరీంనగర్ మండలంలోని ఎలగందల్, మానకొండూర్ మండలంలోని పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలంలోని టేకుర్తి, చిగురుమామిడి మండలంలోని ములకనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయి. 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.

ఏప్రిల్ 1 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్ష ఫలితాల ప్రకటన తర్వాత సంబంధిత ప్రిన్సిపాళ్లకు మెరిట్ జాబితాల అందుతుంది. మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు చేస్తారు. దానికి అడిషనల్ కలెక్టర్ల ఆమోదం తెలుపుతారు. మే 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి, ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

పరీక్ష విధానం..

6వ తరగతి ప్రవేశ పరీక్షలో 100 ప్రశ్నలు ఉంటాయి. 100 మార్కులు కేటాయించారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 6వ తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్ల పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ నుంచి వంద ప్రశ్నలుంటాయి. ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. 2 గంటలపాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం

బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంది. 9, 10వ తరగతులతోపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంద మందికి మాత్రమే అవకాశం. హాస్టల్‌కు కనీసం 3 కిలోమీటర్ల నుంచి ఆపైన దూరంలో ఉండేవారే ఇందుకు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యతోపాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ అందిస్తారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉంది. ఏటా మెరుగైన ఫలితాలు వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

వృద్ధురాలికి ఉచితంగా మోకీలు మార్పిడి


మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

కరీంనగర్‌టౌన్: బీఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధురాలికి ఉచితంగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ బీఎస్.రావు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఆదర్శ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంగాధర మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన దాసరి కనకమ్మ పదేళ్లుగా మోకాలు నొప్పులతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉందన్నారు. ఆమె పరిస్థితిని బీఎస్.రావు హెల్త్ ఫౌండేషన్‌కు తెలుపగా ఉచితంగా మోకీలు మార్పిడి చేసేందుకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 14న ఒక కాలికి ఆపరేషన్ పూర్తి అయిందని, మరో కాలికి వారం రోజుల్లో చేస్తామన్నారు. సుమారు రూ.2 లక్షల విలువైన ఈ ఆపరేషన్‌ను ఆదర్శ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ సత్యనారాయరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ సేవలను ఇకనుంచి ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. సంస్థ బాధ్యులు అలీం, ఝాన్సీ పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు సంక్రాంతి

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గౌరీమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, వేడుకలు, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్యాయత పంచుకునే పండగ సంక్రాంతి

జగిత్యాల: సంక్రాంతి పండగ ప్రేమానురాగాలు పంచుకునే పండగ అని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ, సంక్రాంతి పండగ ద్వారా సాంప్రదాయాల పరిరక్షణ సందేశాన్ని అందించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ఆనందోత్సవాలు, కేరింతల మధ్య బొడ్డెమ్మ వచ్చిందమ్మ అంటూ కేరింతలతో ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు.


వేడుకల్లో విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుండీ లెక్కింపులో తాత్కాలిక ఉద్యోగి చేతివాటం

- రూ.11,010 దొంగిలిస్తూ పట్టుబడిన వైనం


పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన వ్యక్తి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా లడ్డూ, ప్రసాదం విభాగంలో తాత్కాలికంగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. అంజన్న ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. ఇందులో తాత్కాలిక ఉద్యోగి కొలకాని రవి కూడా పాల్గొన్నాడు. ఉదయాన్నే లెక్కింపు కోసం వచ్చిన రవి.. డబ్బులను తీసి దాచిపెట్టడాన్ని గమనించిన నిర్మల్‌కు చెందిన మరో భక్తుడు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే అక్కడున్న ఏఎస్సై శ్రీనివాస్ పోలీసులతో రవి దుస్తులను సోదా చేయగా అందులో నుంచి రూ.11,010 లభించాయి. రవిపై ఈవో వెంకటేశ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణి బలి

- జింకగా అనుమానిస్తున్న అధికారులు
- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన


సంఘటన స్థలంలో వన్యప్రాణి తల, కాళ్లు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం సూరంపేట అటవీ ప్రాంతంలో ఓ వన్యప్రాణిని వేటాడి చంపి, కాల్చిన ఆనవాళ్ల ఫారెస్టు అధికారులకు ఆలస్యంగా లభించాయి. సదరు వన్యప్రాణి జింకనా..? లేక మనుబోతా..? తేలాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారం క్రితం పక్కా సమాచారంతో కొడిమ్యాల ఫారెస్ట్ అధికారులు సూరంపేట అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సమయంలో కాలినస్థితిలో ఉన్న ఓ అటవిజంతువు కనిపించింది. జంతువును వేటాడి చంపినట్లు అనుమానించి విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉచ్చు బిగించి.. వేటాడి చంపినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే ఆ వన్యప్రాణి జింకనా..? లేక మనుబోతా..? అని తేల్చేందుకు వాటి శరీర భాగాలను ఫారెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఎఫ్‌ఆర్‌వో లత బుధవారం తెలిపారు. ఫారెన్సిక్ నివేదిక అనంతరం నిందితులపై కేసు నమోదు చర్యలు తీసుకుంటామన్నారు.

సత్తక్కపల్లి శివారులో చిరుతపులి కలకలం

- పాదముద్రల ఆధారంగా నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు
- తాజాగా పలువురికి కనిపించిన చిరుత
- జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు


సత్తక్కపల్లి శివారులో ఓ పంటపొలంలో చిరుత పాదముద్రలు


చిరుతను చూసిన వ్యక్తి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో చిరుతపులి సంచరించడం కలకలం సృష్టిస్తోంది. గ్రామ శివారు ప్రాంతంలోని ఉసికెగుట్ట సమీపంలో.. డంపింగ్ యార్డు వద్ద చెట్ల పొదల్లో.. పంట పొలాల్లో చిరుతపులి తిరిగినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. రెండురోజుల క్రితం ఇదే ప్రాంతంలో సంచరించిన చిరుతపులి.. బుధవారం అటువైపుగా వెళ్లినవారికి కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిరుత కనిపించిన వెంటనే స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న అధికారులు మొదట చిరుతను చూసిన వ్యక్తి నుంచి పలు వివరాలు ఆరా తీశారు. చిరుత కనిపించిన పరిసరాల్లో గాలింపు చేపట్టారు. అయితే చిరుత కనిపించకపోవడంతో అంతకుముందురోజు గుర్తించిన పాదముద్రలను పరిశీలించి.. చిరుతపులేని అధికారులు నిర్ధారణకు వచ్చారు. గ్రామస్తులు, రైతులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆందోళనలో రైతులు, గీతకార్మికులు

ఉదయం గ్రామ శివారులో కనిపించిన చిరుత.. సాయంత్రం సమయంలో సత్తక్కపల్లి – ఎర్రాపూర్ శివారు ప్రాంతం దుబ్బలభూమి వద్దగల రైల్వేలైన్ వద్ద కనిపించినట్లు రైతులు చెబుతున్నారు. అదే చోట సత్తక్కపల్లి, ఎర్రాపూర్ రైతుల పొలాలు, ఈత వనాలు ఉన్నాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. కల్లు గీసేందుకు గీత కార్మికులు భయపడుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం


చిరుత రెండు, మూడు రోజులుగా తమ గ్రామ శివారులో సంచరిస్తోందని అటవీ శాఖ అధికారులకు తెలిపినా.. కేవలం జాగ్రత్తలే చెబుతున్నారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని సత్తక్కపల్లి గ్రామస్తులు అంటున్నారు. పాదముద్రలను పరిశీలించి చిరుత అని నిర్ధారించారని, పట్టుకునేందుకు ఎందుకు సాహసించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీని వివరణ కోరగా.. సత్తక్కపల్లిలో చిరుత సంచరిస్తోందని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అటవీప్రాంతంలో తిరుగుతున్న చిరుత ఇప్పటివరకు ఎలాంటి హానీ కలిగించలేదని, చిరుతను పట్టుకోవాలంటే నిబంధనలు ఉంటాయని, ప్రస్తుతానికైతే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్

- డ్రైవర్ మృతి

మానకొండూర్: ట్రాక్టర్ చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని జగ్గయ్యపల్లికి చెందిన నందగిరి సాయినంద్ (26) గ్రామానికే చెందిన ఓ వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం కూలీలను తీసుకొని, శ్రీనివాస్‌నగర్ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో స్థానిక హనుమాన్ టెంపుల్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయినంద్ కిందపడటంతో తలకు, ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరి కట్ట తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


మౌన్మి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఆరోగ్యం సహకరించడం లేదని, ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కావడంలేదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని గోధూర్‌లో చోటుచేసుకుంది. మౌన్మి(17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. తరచూ అనారోగ్యం బారిన పడుతున్న ఆమె చదువులో వెనుకబడుతున్నానని మానసికంగా కృంగిపోయింది. గత నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఉమాసాగర్ బుధవారం తెలిపారు. మృతురాలి తండ్రి లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


పట్టుకున్న వాహనాలతో పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న దొంగను పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లికి చెందిన అడ్లూరి నాగరాజు గతంలో పలుమార్లు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. ఇటీవల జైలు నుంచి వచ్చిన తర్వాత జగిత్యాల జిల్లా కేంద్రంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లాడు. బుధవారం సాయంత్రం పొన్నాల గార్డెన్‌కు వెళ్లే చిన్నకెనాల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగరాజు అనుమానాస్పదంగా కన్పించడంతో విచారణ చేపట్టగా విషయం వెలుగుచూసింది. అతనినుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం, మన్మథరావు, ఏఎస్సై వేణురావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ విశాల్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ సురేశ్‌గౌడ్

రామగుండం: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి, సామగ్రి చోరీచేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రామగుండం రైల్వే సీఐ సురేశ్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన కడమంచి మహేశ్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేశ్, ఇగ్గన నగేశ్, వనరాశి ఉప్పలయ్య గతనెల 14న రాత్రి గోదావరి రైల్వే వంతెన వద్ద విధుల్లో ఉన్న ట్రాక్‌మన్ పవన్‌కుమార్‌ను బెదిరించి రైల్వే సామగ్రి చోరీచేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను అరెస్టు చేశారు. వారినుంచి సొత్తును రికవరీ చేశారు. ఏఎస్సై శేఖర్‌రెడ్డి, సిబ్బంది అయిలయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న పోలీసులు

పెగడపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ ఎస్సై సతీశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం మండలంలోని వెంగళాయిపేటకు చెందిన రాగల్ల వంశీ(22) అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని సోదా చేయగా.. సుమారు రెండు కిలోల గంజాయి పట్టుబడింది. దాని విలువ సుమారు రూ.35వేల వరకు ఉంటుందని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ, ఎస్సై, ఏఎస్సై సత్తయ్య, సిబ్బంది తిరుపతి, సంపత్, ఉదయ్, ప్రవీణ్, ఎల్లయ్యను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

రెండు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి, రాచర్లగుండారం గ్రామాల శివారుల్లో బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రాచర్లగొల్లపల్లి శివారులో బైక్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో గొల్లపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు ఖాదర్, మరొకరు, వ్యాన్ యజమాని సత్యం, డ్రైవర్ రాజం గాయపడ్డారు. ఖాదర్‌తోపాటు మరొకరిని సిరిసిల్లకు తరలించారు. రాచర్లగుండారంలో కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో గుండారం గ్రామానికి చెందిన ముడావత్ శ్రీరామ్, కిషన్ గాయపడ్డారు. అదే ప్రమాదంలో గోరింటాలకు చెందిన కారు డ్రైవర్ ప్రశాంత్ గాయపడ్డారు. గాయపడ్డ శ్రీరామ్, కిషన్‌లను 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్య కోసమే ఇంటర్నెట్ వినియోగించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పమేల సత్పతి

కరీంనగర్/తిమ్మాపూర్: ఇంటర్‌నెట్ కారణంగా విద్యార్థులు పెడదోవ పడుతున్నారని, దాన్ని విద్య కోసమే ఉపయోగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్నేహిత కార్యక్రమాన్ని తిమ్మాపూర్‌లోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్లో బుధవారం ఆమె ప్రారంభించారు. ఆడపిల్లలు ఏ సమస్య ఉన్నా ధైర్యంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా చదువు కొనసాగించాలని పేర్కొన్నారు. ఫొటోలను, ఫోన్ నంబర్లను ఎవరికీ పంపించవద్దన్నారు. సర్పంచ్ నీలిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, వైద్యాధికారి లలితాదేవి, కరీంనగర్ రూరల్ సీడీపీవో సబితాకుమారి, డీసీపీవో శాంత, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ..

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లును కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లును పరిశుభ్రంగా ఉంచాలని ని ర్వాహకుడు ప్రభాకర్‌రావుకు సూచించారు. ధాన్యం నిల్వల వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ కనకయ్య, పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రోడ్లపై ప్రయాణించే సమయంలో ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ పమెలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులతో రోడ్ల ఆక్రమణ, మరమ్మతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లపై పండ్లు, కూరగాయల అమ్మకాలు జరగకుండా చూడాలని, ఓవర్ లోడ్ వాహనాలు, గ్రానైట్ రవాణా మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించాలని పేర్కొన్నారు. వీధి దీపాలు, సీసీ కెమెరాలను బిగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ, డిపో–1 మేనేజర్ మల్లేశం, ట్రాన్స్‌పోర్ట్ అధికారి చంద్రశేఖర్ గౌడ్, రోడ్లు, భవనాల శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, పంచాయతీరాజ్ ఈఈ నవీన్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ సర్వర్, ఎస్ఈ ఆర్‌అండ్‌బీ లక్ష్మణ్, ఎక్సైజ్ అధికారి తాతాజీ తదితరులున్నారు.

క్లుప్తంగా

రైతు శిక్షణ కేంద్రం డీడీగా ఛత్రునాయక్



కరీంనగర్ అర్బన్: కరీంనగర్ రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా భూక్యా ఛత్రునాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతను మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిగా వ్యవహరించగా పలు కారణాల క్రమంలో కరీంనగర్ బదిలీ చేశారు. 2015లో జిల్లాలో జేడీఏగా విధులు నిర్వహించగా పలు కారణాలతో ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. తాజాగా రైతు శిక్షణ కేంద్రం డీడీగా నియమితులయ్యారు.

వివేకానందుని స్ఫూర్తితో ముందుకెళ్లాలి



విద్యార్థులతో సాగర్

కరీంనగర్‌రూరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని బుధవారం తీగలగుట్టపల్లి, ఆరెపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ, దృఢ సంకల్పం ఆత్మవిశ్వాసానికి తొలిమెట్టుగా భావించిన వివేకానందుని జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన 10మంది విద్యార్థులకు మెమొంటోలతోపాటు వివేకానందుని జీవితచరిత్ర పుస్తకాలు అందజేశారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు కరుణ, కళావతి, సంస్థ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: ఇటీవల కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్ సంపత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 8, 9వ తరగతుల విద్యార్థులు సత్తాచాటారు. గుడిపల్లి అమూల్య, కాశ్యాప్ నేహా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 11,12,13,14వ తేదీల్లో గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ విమల, ప్రిన్సిపాల్ విద్య, దీప్తి, పీఈటీ రఘుపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్నికాయిట్ పోటీలకు 'మోడల్' విద్యార్థి



అక్షిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందులలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సీహెచ్ అక్షిత్ 67వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. ఈ మేరకు బుధవారం అక్షిత్‌ను అభినందించి మాట్లాడారు. విద్యార్థి ఎంపిక పట్ల ఎస్ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీ హరీశ్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రకృతి సంపదను కాపాడాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విద్యాసాగర్

సప్తగిరికాలనీ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేయబడిన 50 పాఠశాలల విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయులకు నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ)కార్యక్రమాలపై స్థానిక సేయింట్ జాన్స్ పాఠశాలలో బుధవారం 'సుస్థిర అభివృద్ధి కోసం జీవనశైలి'పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ఎన్‌జీసీ కోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ, బయోడైవర్సిటీ పైన విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే తరాలవారు ప్రకృతి సంపదను అనుభవించాలని అందుకోసం మనం ప్రకృతిని కాపాడాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి, జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ జయపాల్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఎం.స్వదేశ్ కుమార్, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, గెజిటెడ్ హెచ్ఎం టీఎస్ అనంత ఆచార్య, శశికిరణ్, వంతడుపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థులు



బాపుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల సంబరాలు



వాణినికేతన్ పాఠశాలలో..

ముందస్తు సంక్రాంతి సంబరం

కరీంనగర్/సప్తగిరికాలనీ/కొత్తపల్లి: నగరంలోని మంకమ్మతోట, విద్యానగర్‌లోగల సిద్ధార్థ విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు గోదాదేవి, హరిదాసు, జంగమదేవరులు, గంగిరెద్దుల వేషధారణలతో ప్రదర్శనలు చేశారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కొత్తపల్లి మండలం బాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. హెచ్ఎం కట్ట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వాసంతి, శివకుమార్, ఏంజలీస్, హరికృష్ణశర్మ, సంతోష్ పాల్గొన్నారు. వాణినికేతన్ బాలవిహార్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి సంబురాలు వైభవంగా జరుపుకున్నారు. వాణినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ విజయ అయోధ్యరామారావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మెహందీ, పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ బి.ప్రశాంత్, కిడ్స్‌కేర్ ఇన్‌చార్జి జేసన్, రిటైర్డు హెచ్ఎం హనుమంతరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయాలి

• ఎమ్మెల్యే గంగుల కమలాకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కరీంనగర్: భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కరీంనగర్ నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రతిష్ఠకు విద్యార్థి నాయకులు నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ పరిష్కరించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యను అందుబాటులో తేవడం కోసం విద్యా విధానంలో నూతన ఒరవడిని సృష్టించిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, కర్ర సూర్యశేఖర్, అశోక్‌రెడ్డి, గాలిబ్ వేణు, మాడిశెట్టి అజయ్‌కుమార్, జంగపెల్లి వినోద్, జక్కినపల్లి ప్రశాంత్, కొంకటి మధు, మహేశ్, బొంకూరి అశోక్, మెడిచేలిమి సాయిరాం, బెజ్జంకి దీపక్, రమేశ్ పాల్గొన్నారు.

'వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించం'



మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై నగర మేయర్ సునీల్‌రావు వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ను తెగ పొగుడుతున్న సునీల్‌రావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతారా అనే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. బండి సంజయ్‌పై వ్యక్తిగతంగా విమర్శలు చేసి నవ్వుల పాలయ్యాడని దుయ్యబట్టారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి సుమారు రూ.9,000 కోట్ల పనులను తీసుకొచ్చిన ఘనత సంజయ్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. సునీల్‌రావు కేరాఫ్ కాంగ్రెస్ అని, ఎప్పటికీ బీఆర్ఎస్ కాలేడని విమర్శించారు. అందుకే అదే స్థాయిలో కాంగ్రెస్‌లో ఎంతో కష్టపడ్డానని చెప్పడం తిరిగి అదే పార్టీలోకి వెళ్తున్నాడనే సంకేతాలు ఇవ్వడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సమావేశంలో బోయినపల్లి ప్రవీణ్‌రావు, కాసర్ల ఆనంద్, కటకం లోకేశ్, రమణారెడ్డి, తోట అనిల్, ఆవుదుర్తి శ్రీనివాస్, నవీన్, మల్లేశం, పర్వతాలు పాల్గొన్నారు.

పాఠశాల చదువు జీవితానికి పునాది



మాట్లాడుతున్న రామస్వామి

కరీంనగర్‌కల్చరల్: క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణిస్తారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణుడు శ్రీబొట్ల రామస్వామి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వికాస శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుకునే శక్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటాడని పేర్కొన్నారు. పాఠశాల చదువు జీవితానికి పునాది అని, పునాది ఎంత పటిష్టంగా ఉంటే జీవితం అంతా గొప్పగా ఉంటుందని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్' దొంగలు



కుండీలను ఆటోలో ఎత్తుకెళ్తున్న దృశ్యం

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో 'స్మార్ట్' దొంగలు మొదలయ్యారు. స్మార్ట్ సిటీలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్‌ను దొంగలించడమే వీరి పని. రెండురోజుల క్రితం నగరంలోని హౌసింగ్‌బోర్డుచౌరస్తా (బోట్ చౌరస్తా) వద్ద సిమెంట్ కుండీలను దొంగలిస్తుండడాన్ని గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. కుండీలను ఏకంగా ఆటో ట్రాలీలో దర్జాగా వేసుకొని తరలిస్తుండడంతో స్థానికులు ఆటోను నిలిపివేశారు. అయితే ఇది తమకేం కొత్త కాదని, ఫొటోలు తీసుకున్నా తమను ఎవరూ ఏం చేయలేరంటూ సదరు వ్యక్తి స్థానికులను బెదిరించి మరీ ట్రాలీని తరలించాడు. నగరంలో పనులు జరుగుతున్న చాలా చోట్ల ఇలా మెటీరియల్‌ను ఎత్తుకెళ్తున్న ఉదంతాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే బోట్ చౌరస్తా లాంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం కూడా దొంగలకు ఉపయోగపడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొంతమంది ముఠాగా ఏర్పడి ఇలాంటి సామగ్రిని ఎత్తుకెళ్తున్నారనే ప్రచారం ఉంది. స్మార్ట్ దొంగల ఉదంతం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు చేపట్టాలి

కరీంనగర్: విద్యారంగాన్ని అభివృద్ధి చేయుటకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి కోరారు. ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి, డీసీఈబీ కార్యదర్శి ఎం.స్వదేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె

కరీంనగర్: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు, అధికారుల జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం దేశవ్యాప్తంగా ఒక గంట పాటు సమ్మెలో పాల్గొన్నారు. క్లాస్‌వన్ అధికారుల సంఘం నాయకుడు చలం, ఏఐఐఈఏ కరీంనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు రాంమోహన్‌రావు, వికాసాధికారుల సంఘం నాయకుడు వాసు, పెన్షనర్స్ సంఘం డివిజన్ నాయకుడు లక్ష్మీకాంతం, ఐసీయూ కరీంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వామన్‌రావు బ్రాంచ్ వన్, బ్రాంచ్ టు కార్యాలయాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఆర్‌సీవోను నియమించాలి

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకులాలకు రెగ్యులర్ ఆర్‌సీవోను నియమించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్,లోకిని రమేశ్ తదితరులు ఉన్నారు.

బ్లాంకెట్లు పంపిణీ

కొత్తపల్లి: రేకుర్తిలోని 18,19వ డివిజన్‌లలో నిరుపేద ముస్లిం మహిళలకు బుధవారం హీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లాంకెట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు హాఫిజ్ అహ్మద్‌హిష్టి, కలీం, షరీఫ్, హాఫిజ్, ఫరీద్, హాఫిజ్, హమీద్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులను నిర్మూలించాలి

కరీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ బెల్ట్ షాపులు పూర్తిగా నిర్మూలిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. నిర్వాహకులకు సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'అలిశెట్టి' పురస్కారానికి ఎంపిక

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందించే అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన కవయిత్రి తోట నిర్మలారాణిని ఎంపిక చేసినట్లు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ప్రకటనలో తెలిపారు. పురస్కారాన్ని శుక్రవారం సాయంత్రం ఫిలింభవన్‌లో ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటుపై హర్షం

కరీంనగర్: రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా కేసీఆర్ ప్రభుత్వం చేసిన జిల్లాల విభజనపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) పక్షాన స్వాగతిస్తున్నామని టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ ఖలీలు ద్దీన్, టి.శ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్ర మంగళవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం విశ్వహిందూ పరిషత్ విభాగ్ గోరక్ష ప్రముఖ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ముకరంపుర, డాక్టర్ స్ట్రీట్‌లలో ఇంటింటికీ వెళ్లి వితరణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పూర్వ ప్రాంత ఉపాధ్యక్షుడు డాక్టర్ జగన్మోహన్‌రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ వికా రావు దంపతులతోపాటు రమణారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న మేయర్ దంపతులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ కాశ్మీర్‌గడ్డలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో బుధవారం గణపతి హోమం నిర్వహించారు. నగర మేయర్ యాదగిరి అపర్ణ సునీల్‌రావు దంపతులు గణపతి హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి, భక్తులు పాల్గొన్నారు.

ధనుర్మాస అధ్యయన ఉత్సవాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రంగనాయక గోదాదేవి కల్యాణాన్ని వేదపండితుడు సుధాకర చార్యులు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులతో పాటు సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, కూర నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, రమేశ్‌గౌడ్, కిష్టయ్య, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డె ఓబన్న జయంతి

కరీంనగర్: వడ్డె ఓబన్న జయంతిని గురువారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎం.అనిల్ ప్రకాశ్ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, వడ్డెర కులబాంధవులు హాజరుకావాలని కోరారు.

నెహ్రూ విగ్రహం ఏర్పాటు చేయాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వెనకాల చౌరస్తాలో ఉన్న నెహ్రూ విగ్రహాన్ని గత ప్రభుత్వ హయాంలో తొలగించారని, ఆ స్థానంలో నెహ్రూ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాజీవ్ చౌక్‌లోని రాజీవ్‌గాంధీ పాత విగ్రహం స్థానంలో కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు

కరీంనగర్ క్రైం: మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. శ్రీనివాస్‌నగర్ వాగు నుంచి కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాలకు బుధవారం ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వాటిని ఠాణాకు తరలించి, డ్రైవర్లు రమేశ్, కుమారస్వామిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రసాదం అందజేత



బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌చారి, బీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి తిరుపతి ప్రసాదం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– కరీంనగర్

పెండింగ్ బిల్లులు ఇప్పించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

కరీంనగర్: మానకొండూరు మండలం నిజాయితీగూడెంలో నూతన పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు అంజనీ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, ఎన్నికలు వాయిదా పడితే సర్పంచ్‌లకు పర్సన్ ఇన్‌చార్జి ఇచ్చి కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం మంత్రిని సర్పంచ్‌లు సన్మానించారు. మంత్రిని కలిసినవారిలో సర్పంచ్‌లు మేడి అంజయ్య, నేరెళ్ల మహేందర్‌గౌడ్, బింగి కరుణాకర్, వంశీధర్ రెడ్డి, బొల్ల మురళీధర్, మామిడి సతీశ్, రెడ్డి త్రివేణి, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టర్ ఆలోచన.. విద్యార్థులకు చేయూత



నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న ఏవో సుధాకర్

కరీంనగర్ అర్బన్: కలెక్టర్ నిర్ణయం వందల మంది చిన్నారులకు చేయూతనిచ్చింది. ఇటీవల నూతన సంవత్సరం క్రమంలో తనను కలిసేందుకు వచ్చేవారు పూల బొకేలు, శాలువాలకు బదులు పెన్నులు, నోట్ బుక్కులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు తీసుకురావాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి వినియోగించేలా ఉండాలని స్పష్టం చేయడంతో ఉద్యోగ సంఘాలు, అధికారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, నేతలు పెన్నులు, నోట్‌బుక్కులు, ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ క్రమంలో వచ్చిన సదరు సామగ్రిని కలెక్టర్ ఆదేశాల క్రమంలో నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, నాయబ్ తహసీల్దార్ నేరేళ్ల కిషన్ విద్యార్థులకు అందజేశారు.

కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

కరీంనగర్: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన నాయకులకే కాకుండా అన్ని జిల్లాలు, నియోజకవర్గ స్థాయిల్లో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని టీజేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం జిల్లా స్థాయిలో జేఏసీ, విద్యావంతుల వేదిక, తెలంగాణ జనసభల్లో పనిచేసిన వారికి ఎలాంటి కార్పొరేషన్ పదవులు ఇవ్వలేదని, సీనియర్ ఉద్యమకారులను సైతం పక్కనపెట్టి హైదరాబాద్ కేంద్రంగా పనిచేసినవారికి పదవులు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జేఏసీ నాయకత్వం వల్లే ఉద్యమం ముందుకు పోయిందనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని కోరారు. ప్రజల్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయి రాష్ట్రాన్ని సాధించారనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పదేళ్లుగా నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసినవారిని, ప్రజల పక్షాన ఉద్యమించినవారిని గుర్తించి కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చురుకుగా అభయహస్తం ఆన్‌లైన్

• బొమ్మకల్, నగునూరు పంచాయతీల్లో ప్రత్యేకంగా నమోదు



బొమ్మకల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. ఈ నెల 5నుంచి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. కరీంనగర్ మండలంలోని 17గ్రామాల్లో గత నెల 28నుంచి ఈ నెల 4వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం నివాస గృహాలు 14,510 ఉండగా 15,261 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 454 దరఖాస్తులు రేషన్ కార్డులు, ఇతర సమస్యలపై ఉన్నాయి. కరీంనగర్ మండలానికి మొత్తం 40 లాగిన్లు మంజూరుకావడంతో మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.దివ్యదర్శన్‌రావు, తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా నడుస్తోంది. రెండుమూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశముంది. అయితే నగునూరులో 1,720, బొమ్మకల్‌లో 4,080 దరఖాస్తులు రావడంతో అధికారులు ఆయా గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు. బుధవారం బొమ్మకల్ పంచాయతీలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును ఎంపీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి పరిశీలించారు. నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లాను ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో వ్యవసాయ కనెక్షన్లు

• మీటర్లకు జియోట్యాగింగ్.. 25వరకు గడువు



జూబ్లీనగర్‌లో వ్యవసాయ మీటర్ వివరాలను సెల్‌ఫోన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయ విద్యుత్ మోటార్ల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు ఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేసి విద్యుత్‌మీటర్లను జియోట్యాగింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నెల 25వరకు అన్ని విద్యుత్ కనెక్షన్లకు జియోట్యాగింగ్ పూర్తి చేయాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో రూరల్ ఏడీఈ కె.రాజు, ఏఈ నరేశ్ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల వివరాలు పరిశీలించారు. రూరల్ డివిజన్ పరిధిలో మొత్తం 8,586 కనెక్షన్లున్నాయి. మొగ్దుంపూర్, జూబ్లీనగర్‌లో పర్యటించి విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనే వివరాలు సేకరించారు. ఒక్కో కనెక్షన్ వద్దకు వెళ్లి మొబైల్‌లోని యాప్‌లో ట్రాన్స్‌ఫార్మర్ నంబరు, మీటరు నంబరు, యజమాని పేరు తదితర వివరాల నమోదు అనంతరం మీటరును జియోట్యాగింగ్ చేశారు. మొగ్దుంపూర్‌లో 80, జూబ్లీనగర్‌లో 70 మీటర్లకు జియోట్యాగింగ్ చేసి వివరాలు నమోదు చేసినట్లు ఏడీఈ తెలిపారు.

క్లుప్తంగా...

19 నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక సర్వే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి కుల ఆధారిత సామాజిక, ఆర్థిక స్థితిగతుల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.గిరిజాశంకర్ బుధవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఈ నెల 19వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేని పదిరోజుల్లో.. ఈ నెల 28వ తేదీకి పూర్తిచేయాలని నిర్దేశించారు. సర్వేకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ నెల 11వ తేదీలోగా శిక్షణ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీలోగా సర్వే సిబ్బందిని, పర్యవేక్షణ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలని, 17వ తేదీలోగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని సూచించారు.

షరతులతో చంద్రబాబుకు ముందస్తు బెయిల్

ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉచిత ఇసుక, మద్యం కేసుల్లో మంజూరు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఇన్నర్ రింగ్ భూ కుంభకోణం, ఉచిత ఇసుక, మద్యం విధానాల్లో అక్రమాలపై సీఐడీ నమోదు చేసిన కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ అప్పటి కమిషనర్ శ్రీ నరేష్‌లకు కూడా ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఈ సందర్భంగా హైకోర్టు పలు షరతులు విధించింది. ఇప్పటి నుంచి వారంలోపు దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని చంద్రబాబు, రవీంద్ర, శ్రీ నరేష్‌లను హైకోర్టు ఆదేశించింది. రూ.లక్షకు రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలంది. ముందస్తు బెయిల్‌పై విడుదలైన తరువాత ఎప్పుడు పిలిస్తే అప్పుడు దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. అయితే 48 గంటల ముందు నోటీసు ఇవ్వాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించింది. ఈ కేసుల గురించి తెలిసిన వ్యక్తిని.. ఆ కేసుల వాస్తవాలను కోర్టుకు గానీ, పోలీసులకు గానీ చెప్పకుండా బెదిరించడం గానీ, ప్రలోభపెట్టడం గానీ, వాగ్దానాలు చేయడం గానీ ఎంత మాత్రం చేయడానికి వీల్లేదంది. ఈ కేసులకు సంబంధించి ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయడానికి వీల్లేదని చంద్రబాబు తదితరులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం తీర్పులు వెలువరించారు.

టీడీపీ కకావికలం

తమ్ముళ్ల హాహాకారాలు.. పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల కరువు

ఎంపీ కేశినేని నాని బాటలోనే టీడీపీకి గుడ్‌బై చెబుతున్న నేతలు

- దబ్బు మూటలే అర్హతగా సమన్వయకర్తల నియామకం
- మరోవైపు టీడీపీ–జనసేన మధ్య పొత్తు కుంపట్లు.. అనేక నియోజకవర్గాల్లో కుదరని సయోధ్య
- ఘోర పరాజయం తప్పదని పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి రాజకీయం అంతా నాటి నుంచి నేటి వరకు డబ్బుతోనే ముడిపడి సాగుతోంది. అభ్యర్థులను డబ్బు మూటలతో తూకం వేస్తుండటం ఆ పార్టీ సీనియర్ నేతలను నివ్వెర పరుస్తోంది. ఒక్కచోట కూడా గెలవని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పక్కన పెట్టుకుని అడుగులు ముందుకు వేస్తుండటం పట్ల అత్యధిక నియోజకవర్గాల్లో నేతల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. దీనికి తోడు మాలోకం లోకేష్ తీరు కలవర పెడుతోంది. ఇప్పటికే కొందరు నేతలు ఆ పార్టీని వీడటం.. త్వరలో గుడ్‌బై చెప్పేందుకు పెద్ద సంఖ్యలో నేతలు సిద్ధపడుతుండటం బాబును ఆందోళనకు గురిచేస్తోంది. నష్ట నివారణ కోసం మధ్యవర్తులను రంగంలోకి దింపినా ఫలితం కనిపించక తండ్రీ కొడుకులు తల పట్టుకున్నారు.

సాక్షి, అమరావతి : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాలకు సమన్వయకర్తల ఎంపికకు డబ్బు మూటలనే ప్రధాన అర్హతగా నిర్ణయించడం ఆ పార్టీలో సీనియర్ నేతలను కలవరపరుస్తోంది. ఆది నుంచి టీడీపీని నమ్ముకున్న వారిని కాదని.. డబ్బు మూటలను చూపుతున్న వారినే సమన్వయకర్తలుగా నియమిస్తుండటంతో సీనియర్ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని బుధవారం ఆ పార్టీని వీడారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. సీఎం వైఎస్ జగన్‌తో కలిసి పని చేస్తానని ప్రకటించారు. ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో రూ.20 కోట్లు డిపాజిట్ చేసిన వారికే టికెట్ ఇస్తానంటూ చంద్రబాబు తెగేసి చెప్పడంతో మాజీ మంత్రి పీతల సుజాత ఆందోళన చెందుతున్నారు. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో తనను కాదని పక్కన పెట్టి.. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని నియమించాలని చంద్రబాబు ఆలోచిస్తుండటంతో ఆ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మవరం సుబ్బారెడ్డి గందరగోళంలో పడ్డారు. డబ్బు మూటలే ప్రాతిపదికగా సమన్వయకర్తలను చంద్రబాబు మార్చేస్తుండటం.. కేశినేని నాని బాటలోనే సీనియర్ నేతలు ఒకరి వెంట ఒకరు పార్టీని వీడుతుండటంతో 'దేశం'కకావికలమవుతోంది. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి ముందే పార్టీ బలహీనంగా మారడంతో తెలుగు తమ్ముళ్లలో హాహాకారాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతుండటంతో ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేందుకు అత్యధిక నియోజకవర్గాల్లో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. దాంతో ఎన్నికల్లో ఉనికి చాటుకోవడం కోసం జనసేనతో పొత్తుకు చంద్రబాబు పాకులాడారు. కానీ.. క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన నేతల మధ్య సఖ్యత కుదరక పోవడంతో పొత్తు కుంపట్లను రాజేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్.. తెనాలిలో జనసేన నేత నాదేండ్ల మనోహర్, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల మధ్య విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. టీడీపీ బలహీనంగా మారడం.. టీడీపీ–జనసేన పొత్తు కుంపట్లను రాజేస్తుండటంతో 2019 ఎన్నికల కంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమికి ఘోర పరాజయం తప్పదనే భావన ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి నుంచి విధుల్లోకి మున్సిపల్ కార్మికులు

కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు సఫలం

సాక్షి, అమరావతి: పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు గురువారం నుంచి విధుల్లో చేరేందుకు అంగీకరించారు. బుధవారం సచివాలయంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. సీవరేజీ మరణాలకు సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రూ.30 లక్షలు పరిహారం చెల్లింపు, సరండర్ లీవ్ బిల్లులు విడుదల, రెగ్యులర్ కార్మికులకు పీఎఫ్ అకౌంట్ చెల్లింపు, పారిశుద్ధ్య కార్మికులు కానివారి కేటగిరీల మార్పు విషయంలో ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై సత్వరమే చర్యలు తీసుకుంటామని గతంలోనే మంత్రుల బృందం హామీ ఇచ్చింది. అలాగే గతంలో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంపును కూడా అంగీకరించింది. ప్రభుత్వ హామీలకు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయని, గురువారం సాయంత్రానికి మినిట్స్ ఇస్తామని మంత్రి బొత్స ప్రకటించారు. చర్చలు సానుకూలంగా జరిగాయని, సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గురువారం నుంచి కార్మికులు విధుల్లోకి వస్తారన్నారు. జీవో వచ్చాక సమ్మెను విరమిస్తామన్నారు.

పనికిరాని వ్యక్తి.. పచ్చి మోసగాడు

చంద్రబాబుపై ఎంపీ కేశినేని నాని ధ్వజం

- తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన కేశినేని
- రాజీనామా స్పీకర్ ఆమోదం పొందగానే వైఎస్సార్ సీపీలో చేరతానని ప్రకటన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు పచ్చి మోసగాడు.. ఈ రాష్ట్రానికి పనికిరాని వ్యక్తి అని తెలిసి కూడా విజయవాడపై ప్రేమ, నియోజకవర్గం కోసమే టీడీపీలో ఇంతకాలం ఉన్నా..''అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) వ్యాఖ్యానించారు. టీడీపీలో ఎన్నో అవమానాలను ఓర్చుకున్నానని, ఇక భరించలేక బయటికి వచ్చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 'ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతి. ఆయన విధానాలు నాకు నచ్చాయి. సీఎం జగన్ వెనుక నడవాలని నిర్ణయించుకున్నా. పార్టీ కోసం ఆయన ఏం చేయమంటే అది చేస్తా..'అని పేర్కొన్నారు. తాను నైతిక విలువలు పాటించే వ్యక్తినని, టీడీపీకి రాజీనామాతో పాటు ఎంపీ పదవికి రాజీనామాను స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతానన్నారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరతానని తెలిపారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలసిన అనంతరం ఎంపీ కేశినేని నాని మీడియాతో మాట్లాడారు. సీఎంను మర్యాద పూర్వకంగానే కలిశానని చెప్పారు.

నాతో నెల జీతాలు ఇప్పించారు..

పేదలకు అండగా ఉన్న సీఎం జగన్ వెంట నడవాలని నిర్ణయించుకున్నట్లు ఎంపీ కేశినేని నాని వెల్లడించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడితో ప్రెస్‌మీట్ పెట్టించి తనను దూషించారని, చెప్పు తీసుకొని కొడతానని ఓ క్యారెక్టర్‌లెస్ వ్యక్తి తిట్టినా పార్టీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనను గొట్టంగాడు అని దారుణంగా అవమానించినా భరించానన్నారు. 'చంద్రబాబు నన్ను ఎన్నోసార్లు అవమానించారు. టీడీపీ గెలిచేది లేదని చాలా మంది నాకు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పార్టీని నా భుజస్కందాలపై నడిపించా. పార్టీ కోసం నా సొంత వ్యాపారాలను పక్కనపెట్టా. వ్యాపారాల కంటే పార్టీ ముఖ్యమని పని చేశా. టీడీపీ కోసం ఆస్తులు అమ్ముకున్నా. వ్యాపారాలు సైతం వదులుకున్నా. చంద్రబాబు పాదయాత్ర, స్థానిక సంస్థల ఎన్నికలను నా భుజాలపై మోశా. పార్టీ కోసం, ప్రజల కోసం నిజాయితీగా కష్టపడ్డా. కొందరికి నెలవారీ జీతాలు ఇవ్వమని చంద్రబాబు చెబితే డబ్బులు ఖర్చు పెట్టా. తొమ్మిదేళ్లుగా పార్టీలో ఉంటే నేను చేసిన తప్పేమిటో కనీసం చెప్పాలి కదా?'అని ఎంపీ కేశినేని పేర్కొన్నారు.

బొండా భార్యను నిలబెడితే ప్రమాదం..

'విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బొండా ఉమ భార్యను నిలబెడితే చాలా ప్రమాదం. నీ కుమార్తెను పోటీ చేయించు అని చంద్రబాబు నాతో అన్నారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా శ్వేతను చంద్రబాబే నిర్ణయించారు. ఆయన మూడు రోజులు అడిగితేనే ముందుకొచ్చాం. ఆ తర్వాత ప్రెస్‌మీట్ పెట్టించి చంద్రబాబు నన్ను తిట్టించారు. సొంత పార్టీ నేతలే అవమానించినా చర్యలు తీసుకోలేదు. నన్ను చాలా రకాలుగా అవమానించారు. టీడీపీలో ఉంటూ ఇంకా ఎన్ని భరించాలి? ఇష్టం లేకపోతే వెళ్లిపోతానని అందరి సమక్షంలోనే చంద్రబాబుతో చెప్పా. నువ్వు ఉండాల్సిందే అని చంద్రబాబు నాతో అన్నారు. టీడీపీ కోసం సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని చాలా మంది హితవు చెప్పినా వినకుండా పార్టీలో కొనసాగా'అని కేశినేని ఆవేదన వ్యక్తం చేశారు.

లోకేష్.. ఆస్ఫాల్

'టీడీపీ కోసం నేను అమ్ముకున్న ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు ఉంటుంది. చివరకు నా కుటుంబంలో చిచ్చు పెట్టారు. నా కుటుంబ సభ్యులతో, రౌడీలతో కొట్టించాలని లోకేష్ ఎందుకు ప్రయత్నించారు? లోకేష్ అనే వ్యక్తి ఆస్ఫాల్..! చంద్రబాబు కుమారుడిగా మినహాయిస్తే ఆయనకు ఎలాంటి అర్హతా లేదు. అతడికి పార్టీ అన్నీ ఇచ్చినా ఓడిపోయాడు. నేను నా సొంత వనరులతో గెలిచా. అలాంటిది అతడి వద్ద మోకరిల్లాలంటే సాధ్యం కాదు'అని కేశినేని స్పష్టం చేశారు.

సీఎం కార్యక్రమాలకు హాజరు కానివ్వలేదు

'చంద్రబాబు పచ్చి మోసగాడని ప్రపంచానికి తెలుసు. ఇంత దగా చేస్తాడనుకోలేదు. ప్రోటోకాల్ ప్రకారం ఎంపీగా ముఖ్యమంత్రి కార్యక్రమాలకు నేను హాజరు కావాలి. కానీ సీఎం కార్యక్రమాలకు చంద్రబాబు నన్ను హాజరు కానివ్వలేదు. చంద్రబాబు ఏపీకి పనికి రాని వ్యక్తి. టీడీపీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ఇప్పటికే ప్రకటించా. నా రాజీనామా ఆమోదం పొందగానే వైఎస్సార్‌సీపీలో చేరుతా'అని ఎంపీ కేశినేని చెప్పారు.

బెజవాడ, గుంటూరు నిజం.. అమరావతి ఓ కల

'నాకు విజయవాడ అంటే ప్రాణం. బెజవాడ కోసం ఏమైనా చేస్తా. అధికారంలో ఉండగా విజయవాడ కోసం చంద్రబాబు రూ.100 కోట్లైనా ఇచ్చాడా? కానీ విజయవాడ కోసం నేను ఎంతో చేశా. షాజహాన్ తాజ్‌మహల్ కడితే నేను అమరావతి కడతానంటూ చంద్రబాబు గొప్పలు చెప్పారు. విజయవాడ, గుంటూరు మాత్రమే నిజం.. అమరావతి ఒక కలే. అది భ్రమరావతి. అక్కడంతా రియల్ ఎస్టేట్. నేను చంద్రబాబును ఎప్పుడూ టికెట్ అడగలేదు. సీఎం జగన్‌ను కూడా అడగను. సీఎం జగన్‌తో ప్రయాణం చేయాలనుకుంటున్నా. ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ 60 శాతం ఖాళీ అవబోతుందని ఆయన చెప్పారు'అని కేశినేని నాని పేర్కొన్నారు.

గోదావరిలో ఆల్కహాల్ వ్యర్థాలు

- వదిలిన ధర్మాబాద్‌లోని ఫ్యాక్టరీ
- కలుషితమవుతున్న నదీజలాలు
- పుణ్యస్నానాలు చేయకనే వెళ్తున్న బ్రహ్మేశ్వరాలయ భక్తులు



ఆకుపచ్చవర్ణంలో గోదావరి నీరు

లోకేశ్వరం: మహారాష్ట్రలోని ధర్మాబాద్ సమీపంలోగల ఆల్కహాల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు గోదావరినదిలోకి వదలడంతో నీరంతా ఆకుపచ్చ రంగులోకి మారింది. బుధవారం మండలంలోని బ్రహేశ్వరాలయం వద్ద భక్తులు కలుషితమై ఆకుపచ్చ వర్ణంలోకి మారిన నీటిని గమనించారు. పుణ్యస్నానాలు చేసేందుకు భయపడ్డారు. నదిలో చేపలు మరణించే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి పరీవాహక గ్రామాలైన కన్కపూర్, అబ్దుల్లాపూర్, వట్టోలి, పంచగుడి, పిప్రి, గడ్‌చాంద, రాజూర గ్రామాలకు చెందిన పశువులు నిత్యం గోదావరి నీటిని తాగుతున్నాయి. కలుషిత నీటిని తాగిన మూగజీవాలు రోగాల బారిన పడే ప్రమాదముందని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఫ్యాక్టరీ నుంచి తరచూ ఇలాగే వ్యర్థాలు వదులుతున్నా ఎప్పుడూ బ్రహేశ్వరాలయం వరకు రాలేదని స్థానికులు చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి గోదావరి నీటిని ఆల్కహాల్ వ్యర్థాలతో కలుషితం చేస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, పరీవాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సయ్యద్ మహమూద్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్టీయూసీ అనుబంధ ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఐఎన్టీయూసీ ఎస్‌డబ్ల్యూయూ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం పెరిగిపోయిందన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2015, 2021కి సంబంధించి పీఆర్సీలు సైతం చెల్లించలేదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు త్వరలోనే సీఎంను కలవనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ చైర్మన్ మల్లేశం గౌడ్, జనరల్ సెక్రెటరీ రాజారెడ్డి, నాయకులు అబ్రహం, గోపాల్, సాయిరెడ్డి, యాదన్న, కె.వీ.రెడ్డి, ఆదిలాబాద్ డివిజన్ గౌరవ అధ్యక్షుడు బీడి చారి, వైస్ ప్రెసిడెంట్ బీవీ రమణ, డివిజనల్ రీజినల్ సెక్రెటరీ రమేశ్ తదితరులున్నారు.

భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద ఉద్రిక్తత

- ఆందోళనకు దిగిన లారీడ్రైవర్లు
- స్వల్పంగా పోలీసుల లాఠీచార్జి



లారీ డ్రైవర్లను సముదాయిస్తున్న ఎస్సై

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తి, లారీ డ్రైవర్‌కు మధ్య జరిగిన వివాదమే కారణంగా తెలుస్తోంది. లారీ డ్రైవర్లు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 44వ నంబర్ జాతీయ రహదారిపై గల భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద ఆర్టీఏ తనిఖీ కేంద్రం కొనసాగుతుంది. రాత్రి సమయంలో ఇక్కడ పనిచేస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తి, లారీ డ్రైవర్‌కు మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలో ప్రైవేట్ వ్యక్తి తన చేతిలో ఉన్న టార్చ్ లైట్‌తో డ్రైవర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో డ్రైవర్ తలకు గాయం కాగా మిగతా లారీ డ్రైవర్లు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేసి ఆందోళనకు దిగారు. తాము లారీకి రూ.వెయ్యి ముట్టచెబుతున్నప్పటికీ ప్రైవేట్ వ్యక్తులు ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. డబ్బులు ఇవ్వకుంటే దాడులకు పాల్పడుతున్నారన్నారు. సుమారు గంటసేపు రోడ్డుపైనే ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జైనథ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారికి నచ్చజెప్పే యత్నం చేశారు. అయితే వారు ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేశారు. దీంతో డ్రైవర్లు తమ వాహనాల్లో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలు నివేదిస్తున్న స్వదేశ్

నిర్మల్ ఖిల్లా: అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్ జిల్లాకు చెందిన కార్మిక నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన నేషనల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రాంతీయ సలహా మండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సంస్థ రీజినల్ డైరెక్టర్ ఆర్ మీనాక్షి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్మికుల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై నివేదిక అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అసంఘటితరంగ కార్మికులకు అందాల్సిన మౌలిక వసతులపై నేషనల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ తగిన కార్మిక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. దేశ సామాజిక, ఆర్థిక వృద్ధిలో శ్రామికశక్తి భాగస్వామ్యం మహోన్నతమైందని వివరించారు. బోర్డు ఆధ్వర్యంలో కార్మికులకు పనిలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సంస్థ చైర్మన్ జానకీరామ్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారిలా ఆలోచిస్తేనే రైతులకు ఆదాయం

- జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా
- పాల్గొన్న జాతీయ నూనెగింజల పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు
- సందడిగా కిసాన్ మేళా–2024
- హాజరైన పది జిల్లాల రైతులు
- ఆకట్టుకున్న యంత్ర పరికరాల స్టాళ్లు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా



పాల్గొన్న వివిధ జిల్లాల రైతులు, శాస్త్రవేత్తలు



స్టాళ్లను పరిశీలిస్తున్న జాతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు వ్యాపారిలా ఆలోచించాలని, ఇప్పుడున్న పరిస్థితుల్లో పంటలకు పెట్టే ఖర్చు, వచ్చే ఆదాయం లెక్కలేసుకుని అమ్ముకుంటేనే రైతులకు ఆదాయం వస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ మండలంలోని పది జిల్లాలకు సంబంధించి బుధవారం జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ, జాతీయ నూనెగింజల ఎగుమతి సంస్థల ఆధ్వర్యంలో కిసాన్ మేళా–2024 నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పంట పండించడంతోపాటు ఆ పంటను అమ్ముకునే మార్కెట్ నైపుణ్యం సాధించాలన్నారు. అధిక ఆదాయం ఇచ్చే ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఇండియన్ ఆయిల్ సీడ్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్టు కౌన్సిల్ సెక్రెటరీ కిశోర్ తాన్య మాట్లాడుతూ నూనెగింజల పంటలు ఎగుమతి చేసే రైతులకు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఆనంద్‌కుమార్ విశ్వకర్మ మాట్లాడుతూ నువ్వుల పంటకు తెలంగాణలో అనువైన వాతావరణం ఉందని, సాగు విస్తీర్ణాన్ని పెంచాలని పేర్కొన్నారు. జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డిప్యూటీ సీఈవో రమేశ్ మాట్లాడుతూ నూనెగింజల ఉత్పత్తుల్లో పురుగుమందుల అవశేషాలు ఉంటున్నాయని, చాలా దేశాలు ఎగుమతిని నిషేధిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ వి.సుధారాణి మాట్లాడుతూ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంఘాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా నువ్వులను ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ పి.రఘురామిరెడ్డి మాట్లాడుతూ నూనెగింజల పంటలపై ఎప్పటికప్పుడు పరిశోధనలు సాగుతున్నాయన్నారు. పొలాస పరిశోధన స్థానంలో ఏడు రకాల నువ్వు విత్తనాలు రూపొందించామన్నారు. వ్యవసాయ వర్సిటీ అగ్రి ఇన్నోవేషన్ క్లబ్ డైరెక్టర్ కల్పన మాట్లాడుతూ ఒకప్పుడు శాస్త్రవేత్తలు రైతులకు వివరించేవారని, ఇప్పుడు రూరల్ అగ్రిహబ్ ద్వారా రైతులే తమ విజ్ఞానాన్ని శాస్త్రవేత్తలకు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఈఏసీ మెంటర్ వెంకటేశ్వర్ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్ రెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, పద్మజ, రజనీదేవి, బలరాం, జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సురేష్‌కుమార్, ప్రతాప్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు..

వ్యవసాయ పరిశోధన స్థానం రైతులతో సందడిగా మారింది. పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు సాగుచేసిన వరి నారుమళ్లు, పత్తి, కంది, పొద్దుతిరుగుడు వంటి పంట క్షేత్రాలను రైతులు సందర్శించారు. మేళాలో వివిధ కంపెనీల స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ఉద్యాన శాఖ ఆయిల్‌పాం సాగుపై మొక్కలు, డ్రిప్ సిస్టంతో స్టాల్ ఏర్పాటు చేసింది. డ్రోన్ కంపెనీలు తమ డ్రోన్లను ప్రదర్శనకు పెట్టాయి. మినీ ట్రాక్టర్ల నుంచి పెద్దయంత్రాల వరకూ వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు తయారు చేసిన తినుబండరాలు, వెటర్నరీ కళాశాల విద్యార్థులు గడ్డి జాతులపై ప్రదర్శనకు ఉంచారు.

పరికరాలు బాగున్నా.. రేటు ఎక్కువ



కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలు బాగున్నాయి. అయితే వాటి రేటు ఎక్కువగా ఉంది. కొమ్మ కత్తిరింపు మిషన్లు, కలుపు తీసే యంత్రాలు బాగున్నాయి. రైతులు వాడే ఆధునిక పరికరాలకు సబ్సిడీ ఇవ్వాలి.

– భగవంతరావు, ఆదిలాబాద్ జిల్లా

సోలార్ ఫెన్సింగ్‌పై సబ్సిడీ ఇవ్వాలి



అడవి పందుల నుంచి పంటను రక్షించేలా సోలార్ ఫెన్సింగ్‌కు సబ్సిడీ ఇవ్వాలి. ప్రైవేట్ సోలార్ ఫెన్సింగ్ పెట్టుకుంటే రూ.5 లక్షలు ఖర్చు వస్తుంది. అంతా పెట్టుబడి పెట్టే స్థోమత రైతుల వద్ద లేదు.

– తాతయ్య, కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. రసాయన ఎరువులు, పురుగుమందుల ద్వారా మనిషి ఆరోగ్యానికే కాకుండా భూమికి.. భూమిలోని సూక్ష్మజీవులకు ఇబ్బందిగా మారాయి.

– శంకర్, కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా



పండగ శోభ

సంక్రాంతి వచ్చిందంటే
ప్రతి వాకిలి ముగ్గులతో మురిసిపోతుంది.
తెల్లటి చుక్కలు మల్లెల్లా ఇంటిముందు వికసిస్తాయి.
రంగులు పూసుకొని ముస్తాబవుతాయి.
స్త్రీలు తెల్లవారుజాము నుంచి ఓపిగ్గా వీటిని తీర్చుదిద్దుతారు.
నిలువు చుక్కలు, అడ్డ చుక్కల మధ్య
మెలి తిరుగుతూ రేఖలు కదులుతాయి.
ఈ ముగ్గుల వెనుక చాలా విశేషాలున్నాయి.
శుభాలూ ఉన్నాయి.
బోసి వాకిలిని ముగ్గుతో
ఎందుకు కళను నింపాలో తెలుసుకుందాం.

వాకిళ్లు కళ కళ

సంవత్సరమంతా ఇంటి వాకిలి ముందు సుద్ద ముక్కతో అమ్మ గీసే ముగ్గు వేరు. సంక్రాంతి రాగానే వేసే ముగ్గు వేరు. సంక్రాంతి పండగ నెలంతా ఇంటిముందు పెద్ద ముగ్గులు పడతాయి. తెల్లగీతలతో ఒక్కోసారి, రంగులతో నిండి ఒక్కోసారి. పండగ నెల వస్తే వీధిలోని స్త్రీలంతా తెల్లవారు జామున లేచి ఇంటి ముందు పెద్ద ముగ్గును వేయడానికి ఇష్టపడతారు. కాని అది ఒక నిమిషంతో అయ్యేదా? వాకిలి చిమ్ముకోవాలి, కళ్లాపి చల్లుకోవాలి, తర్వాత చుక్కలు పెట్టాలి, చుక్కలు కలపాలి, రంగులు అద్దాలి.... యోగా అంటారు గాని ఇంతకు మించిన యోగా లేదు. ఇంతకు మించిన వ్యాయామమూ లేదు. ముగ్గు పెట్టాక ఇంటికి ఇంతకు మించిన కళ లేదు.

మనకు ఉంది... మరి క్రిమి కీటకాలకు?

సంక్రాంతికి పంట చేతికొస్తుంది. కొత్త బియ్యం ఇంట చేరుతాయి. గాదెలు నిండుతాయి. వడ్ల బస్తాలున్న ఇల్లు సమృద్ధిగా కనిపిస్తుంది. కాని పండించింది మనమే తింటే ఎలా? క్రిమి కీటకాదులకు? ముగ్గు ఒక పంపకం. ముగ్గు ఒక దానం. ముగ్గు ఒక సంతర్పణ. ఎందుకంటే ముగ్గును బియ్యం పిండితో వేస్తారు. బియ్యం సమృద్ధిగా ఉన్నప్పుడు బియ్యం పిండితో పెద్ద పెద్ద ముగ్గులు వేయడానికి కొదవేముంది? ఆ పిండి ముగ్గు వేస్తే ఆ పిండిని చీమలు, క్రిములు, కీటకాలు ఆరగిస్తాయి. అలా ప్రకృతిని సంతృప్తి పరిచిన ఇంటిని ప్రకృతి కాచుకుంటుంది. శుభం జరుగుతుంది.

ముగ్గు ఆడవాళ్ల సొంతం


భారతీయ సంస్కృతిలో హరప్పా, మొహెంజోదారో కాలం నాటి నుంచే అంటే క్రీ.పూ 2000 కాలం నుంచే ముగ్గులు ఉన్నట్టు ఆధారాలున్నాయి. తమిళనాడులో ముగ్గుకు విశేష ఆదరణ ఉంది. ఉత్తరాదిలో ముగ్గును 'రంగోలి' అంటారు. తెలుగువారి సంస్కృతిలో ముగ్గు ఉందనడానికి సాహిత్య తార్కాణాలున్నాయి. కాకతీయుల గాథను తెలిపే 'క్రీడాభిరామం'లో 'చందంబున గలయంపి చల్లినారు... ముగ్గులిడినారు' అని ఒక పద్యంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్త మాల్యద'లో 'బలువన్నె ముగ్గుబెట్టి' అని ఒక పద్యంలో రాశాడు. అయితే తొలి రోజుల్లో పురుషుల కళగా ఉన్న ముగ్గు క్రమేపి స్త్రీల కళగా మారింది. స్త్రీని ఇంటి పట్టునే ఉంచడం వల్ల, వంటకు, పూజకు, భక్తి గీతాలకు మాత్రమే అనుమతించడం వల్ల, చాలాకాలం ఇతర లలిత కళలకు దూరంగా ఉంచడం వల్ల 'ఎవరి కంట పడకుండా' ఇంటి పట్టున సాధన చేసుకునే ముగ్గు మీద ఎవరికీ అభ్యంతరం లేకపోయింది. దాంతో స్త్రీలు తమ సృజనాత్మకతను ముగ్గుల్లో చూపారు. ముగ్గుల వల్ల కొద్దో గొప్పో లెక్కలు తెలియడం, ధ్యాస నిలవడం, వేసుకున్న ముగ్గును చూసి సంతృప్తి చెందడం ఆడవాళ్లకు వీలయ్యింది. అంతేకాదు తెల్లవారు జామున స్త్రీలు లేచి వీధి మొత్తాన్ని పలకరించుకుంటూ మానవ సంబంధాలు పెంచుకునే వీలు చిక్కింది. కష్టసుఖాలు మాట్లాడుకునే వీలు కూడా. మనం వేసిన ముగ్గున మరుసటి రోజున మనమే చెరిపివేయడంలో ఎప్పటికప్పుడు జీవితాన్ని కొత్తగా మొదలెట్టాలన్న భావన, గతం గతః అనుకునే తాత్త్వికత ఏర్పడతాయి. ఇప్పటి కాలంలో కూడా ముగ్గుల్లో మగవాళ్లకు ప్రవేశం లేకపోవడం గమనార్హం.

రకరకాల ముగ్గులు

ముగ్గుల్లో చాలా రకాలు ఉన్నాయి. వాటి చుక్కలను బట్టి, రూపాలను బట్టి ఆధ్యాత్మిక, ధార్మిక వ్యాఖ్యానాలు ఉంటాయి. తొమ్మిది చుక్కల ముగ్గు నవగ్రహాలకు ప్రతీక అని, చుక్కలు లేకుండా రెండు అడ్డగీతలు గీసి ఖండించుకునే త్రికోణాలతో వేసే ముగ్గు కుండలినికి గుర్తు అని అంటారు. అలాగే పురాణాలను తెలిపే, అవతారాలను సూచించే ముగ్గులు ఉంటాయి. రాను రాను ఈ ముగ్గులు సందేశాత్మకంగా కూడా మారాయి. దేశభక్తిని తెలిపే నాయకుల బొమ్మలు, జాతీయ పతాకాలు ముగ్గుల్లో చేరాయి. ఒక్కోసారి నిరసనలకు, నినాదాలకు కూడా వేదికలయ్యాయి. ముగ్గు ప్రథమ లక్ష్యం పారిశుద్ధత. ఇంటిముంగిలిని శుభ్రం చేసుకుని వేస్తారు కాబట్టి ఆ రోజుల్లో కాని ఈ రోజుల్లోకాని సగం రోగకారకాలు ఇంట్లో రాకుండా ఉంటాయి. అయితే రాను రాను స్త్రీలు బద్ధకించి ఆధునికత పేరుతో స్టిక్కర్ ముగ్గులతో సరి పెట్టడం కనిపిస్తోంది. చిటికెన వేళ్ల మధ్య ముగ్గు ఎంత ధారగా వేయడం వస్తుందో అంత నైపుణ్యం వచ్చినట్టు. ముగ్గు వేయడంలో నైపుణ్యం వస్తే జీవితాన్ని చక్కదిద్దుకోవడంలో కూడా నైపుణ్యం వస్తుంది. సంక్రాంతిని బ్రహ్మాండమైన ముగ్గులతో స్వాగతం చెపుదాం.



కాంతి శారద
శ్రీనివాస్
మెట్టుగూడ,
సికింద్రాబాద్



19 చుక్కలు, 9 వచ్చేవరకు
సంధు చుక్క

ముగ్గు ముచ్చట



కె. చందన శ్రీ అంజని
ఓం శాంతినగర్
కడప



19 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకు



సి.రాజ్యలక్ష్మి
హైదరాబాద్

18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు
సరి చుక్క







ఎమ్. ధనలక్ష్మి
కల్లూరిపల్లి,
నెల్లూరు

15 చుక్కలు
1 వచ్చేవరకు
సరి చుక్క



శోభా రాణి
హైదరాబాద్

16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
చుక్క వదిలి చుక్క



ఇటీవల మానవ అక్రమ రవాణాలో ఆధునికత చోటు చేసుకుంది.
సాంకేతిక యుగంలో మనం ఉపయోగించే రకరకాల మాధ్యమాలు
ఇందుకు ప్రధాన కారణం అవుతున్నాయి.
ఈ నవీన కాలంలో హ్యూమన్ ట్రాఫికింగ్ ఏ విధంగా జరుగుతుందో
అవగాహన పెంచుకుంటే, జాగ్రత్త పడటం సులువు అవుతుంది.



ట్రాఫికింగ్ నెట్‌తో జాగ్రత్త!

ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీజ (పేరుమార్చడమైంది) తన తల్లి ఫోన్‌ని ఉపయోగిస్తుండేది. శ్రీజకు తోడబుట్టిన అక్కచెల్లెళ్లు ముగ్గురు ఉన్నారు. తండ్రి మరణించడంతో తల్లి నాలుగిళ్లలో పాచి పని చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఒక రోజు మొత్తం శ్రీజ కనిపించకపోవడంతో కంగారు పడి పోలీసులను సంప్రదించారు. రెండు రోజులు వెతకగా శ్రీజ కలకత్తాలో ఉన్నట్టు తెలిసింది. అపరిచిత వ్యక్తి ప్రేమ పేరుతో ఫోన్ ద్వారా నమ్మబలికి, శ్రీజ ను రప్పించినట్టుగా, అటు నుంచి ఆమెను మరో చోటుకి తరలించే ప్రయత్నం చేసినట్టు గుర్తించి, తిరిగి తీసుకొచ్చి, తల్లికి అప్పజెప్పారు. ఆడపిల్లలు/మహిళలను తప్పుదోవ పట్టించే నేర ప్రక్రియలో ఇంటర్నెట్ ఒక మాధ్యమంగా మారింది.

• • •

సామాజిక మాధ్యమాలలో కనిపించిన 'కిడ్నీ కావలెను' అనే ప్రకటన చూసిన రమేష్ (పేరు మార్చడమైనది) అందులో ఇచ్చిన ఫోన్ నెంబర్‌ను సంప్రదించాడు. అవతలి వ్యక్తులు చెప్పిన విషయాలు విని, ఒక కిడ్నీ ఇస్తే తనకు ఆర్థిక బాధలు తొలగిపోతాయని భావించాడు. చెప్పిన చోటికి వెళ్లిన అతను తిరిగి ఇంటికి చేరుకోలేదు.

• • •

లైంగిక అత్యాచారం, శ్రమ దోపిడి, శిశువుల అమ్మకాలు, అవయవాలు, వధువుల అక్రమ రవాణాలో ఇప్పటి వరకు ఒక దశలో ఉన్నాయి. ఇప్పుడు ఇంటర్నెట్ ద్వారా ట్రాఫికర్లు సైబర్ స్పేస్‌ను కూడా ఉపయోగించుకుంటున్నారు. దీంతో ఈ సమస్య ప్రభుత్వం, పోలీసులు, న్యాయవ్యవస్థకు పెద్ద సవాల్‌గా నిలిచింది.

- సైబర్ ట్రాఫికింగ్‌లో లైంగిక దోపిడీ ప్రాబల్యం రకరకాల రూపాలను చూపుతుంది. యుఎన్ డాట్ జిఐఫ్‌టి గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం సైబర్ ట్రాఫికింగ్‌లో లైంగిక దోపిడీకి, మానవ అక్రమ రవాణా 79 శాతం ఉన్నట్టు గుర్తించింది. బాలికలు 13 శాతం, పురుషులు 12 శాతం, బాలురు 9 శాతం అక్రమ రవాణాకు గురైనట్టు పేర్కొంది.

సైబర్ ఫేక్...

- ట్రాఫికర్లు మహిళలపై హింసకు సోషల్ మీడియా ద్వారా కొత్త మార్గాలను తెరిచారు. నేరస్తులు సోషల్ మీడియా ద్వారా బాధితులను ఆకర్షించడం, మోసగించడం, ట్రాప్ చేయడం ఈ విధానంలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యంగా అమ్మాయిలను /మహిళలను ట్రాప్ చేయడానికి నేరస్తులు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. ఫేక్ ఐడీలను సృష్టించి స్కూల్, కాలేజీ యువతుల భావోద్వేగాలపైన తమ ప్రభావం చూపుతుంటారు. ప్రేమ పేరుతో చాటింగ్ చేస్తూ, కానుకల ద్వారా ఆకర్షిస్తూ, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోల ద్వారా బెదిరిస్తూ ఇల్లు దాటేలా చేస్తుంటారు.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో బాధితులను తమకు అనుకూలంగా మార్చడం, నియంత్రించడం వంటివి జరుగుతున్నాయి.
- ఉద్యోగాల పేరుతో యువకులను ఆకర్షించి, వారు సైబర్ నేరాలకు పాల్పడేలా వేధింపులకు లోను చేయడం.
- అద్దె గర్భం (సరోగసీ విధానం) కూడా ఇప్పుడు ఆన్‌లైన్ వేదికగా కొత్త పుంతలు తొక్కుతోంది. నమ్మి వెళ్లిన వాళ్లు కొత్త సమస్యలలో చిక్కుకునే పరిస్థితి ఎదురైంది.
- పోర్నోగ్రఫీ అక్రమ రవాణాకు ప్రతి క్షణం ఆజ్యం పోస్తూనే ఉంది. ఈ విష చట్రంలోకి ప్రపంచ వ్యాప్తంగా 12 నుంచి 14 ఏళ్ల లోపు బాలికలు చేరుతున్నట్టు, ఈ అక్రమ రవాణాకు గురవుతున్నట్టు నివేదికలు తెలుపుతున్నాయి.

డిజిటల్ వేగం

వాడుకలో సౌలభ్యంతో పాటు వేగం ఉండటం వల్ల కూడా నేరస్తులు తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని ఇంటర్నెట్ మాధ్యమాల్లో వాటిని చూపుతున్నారు. దీని వల్ల డిజిటల్ జాడలు కనిపెట్టి, మనవారిని రక్షించడం అనేది పెద్ద ప్రయాసగా మారింది.

అప్రమత్తతే అడ్డుకట్ట

ఇంటర్నెట్ వాడకం వల్ల అపారమైన ప్రయోజనాలు ఉన్నట్టే, సరిహద్దులు దాటి సుదూర దేశాల నుండి మనల్ని మరో మార్గంలో ప్రయాణించేలా చేయడానికి సైబర్ ట్రాఫికర్స్ పొంచి ఉన్నారు. అందుకే, సోషల్ మీడియా వాడకంలో తల్లిదండ్రులు ఎప్పుడూ తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి. స్కూళ్లు, కాలేజీలు ఇంటర్నెట్ వాడకం ద్వారా జరిగే నష్టాలు, మానవ అక్రమ రవాణాకు జరుగుతున్న ప్రయత్నాల గురించి అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది.

డార్క్ టీమ్స్ ఉంటాయి జాగ్రత్త

సైబర్ ఎనేబుల్డ్ హ్యూమన్ ట్రాఫికింగ్ అనేది ఈ మధ్య కొత్త పదం వచ్చింది. మన దేశం నుంచి విదేశాలకు మంచి ఉద్యోగం ఇప్పిస్తామని తీసుకెళ్లి, సైబర్ క్రైమ్ చేయిస్తుంటారు. విదేశాలకు వెళ్లాలనే కోరిక అధికంగా ఉన్నవారిని గుర్తించి ఈ విధానానికి ఎంచుకుంటారు. తాము చెప్పినట్టుగా ఒప్పుకోనివారిని వేధిస్తారు. లేదంటే, వారి ఆర్థిక స్థితిని బట్టి డబ్బు వసూలు చేసి, వదిలేస్తారు. ఆ తర్వాత సైబర్ ట్రాఫికింగ్‌లో ఆర్గాన్ ట్రేడింగ్, సరోగసి కూడా ప్రధానంగా ఉన్నాయి. నేరస్థులు సైబర్ డార్క్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తారు. వీరి ద్వారా అమాయకులను ట్రాప్ చేసి, అక్రమ రవాణాకు పాల్పడుతుంటారు. అందుకని అపరిచితులతో పరిచయాలను పెంచుకోవద్దు. ఒంటరి మహిళలను ట్రాప్ చేయడానికి సైబర్ నేరగాళ్లు ఎప్పుడూ శోధిస్తూనే ఉంటారు. మన వివరాలను ఆన్‌లైన్‌లో బహిరంగ పరచకూడదు. ఆన్‌లైన్ అగ్రిమెంట్ లాంటివి చేయకూడదు. సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే ప్రకటనలు చూసి మోసపోకూడదు.



– అనీల్ రాచమల్ల,
సైబర్ నిపుణులు, ఎండ్ నౌ ఫౌండేషన్

స్ఫూర్తి

బాధ కాదు బాట చూడాలి

బెంగళూరుకు చెందిన వీణా అంబరీష బస్సు ప్రమాదంలో కుడి కాలిని కోల్పోయింది. ఆ తరువాత డిప్రెషన్ బారిన పడింది. ఆ చీకటి నుంచి అతి కష్టం మీద బయటపడి అర్ధంతరంగా ఆగిపోయిన చదువును కొనసాగించింది. ఆ తరువాత ఎంబీఏ చేసింది.'కరీ దోశ' పేరుతో ఫుడ్ స్టాల్ ప్రారంభించి తన కాళ్ల మీద తాను నిలబడుతూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తోంది వీణా అంబరీష.


వీణా అంబరీష

కొన్ని సంవత్సరాల క్రితం..

భరతనాట్యం డ్యాన్సర్ అయిన వీణ తన ఆరంగేట్రం కోసం సన్నాహాలు చేసుకుంటోంది. కాలేజీకి వెళ్లడానికి రోడ్డు దాటుతున్నప్పుడు బస్సు ఢీకొట్టడంతో ప్రమాదానికి గురై కుడికాలు కోల్పోయింది.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన తరువాత వాకింగ్ స్టిక్‌తో నడవడం మొదలు పెట్టింది. చాలా కష్టంగా అనిపించేది.

భరతనాట్య కళాకారిణిగా పేరు తెచ్చుకోవాలని ఎన్నో కలలు కన్న వీణ తనకు జరిగిన ప్రమాదాన్ని జీర్ణించుకోలేపోయింది. కలల రెక్కలు విరిగిన బాధ ఆమె కళ్లలో కన్నీరై కనిపించేది.

'నాకు ఇలా జరిగిందేమిటి!' అని ఒకటికి పదిసార్లు అనుకోవడం వల్ల వీణ పరిస్థితి ఎక్కడి దాకా వెళ్లిందంటే...'ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో దారి లేదు' అని బలంగా అనుకునేంతగా. అయితే వీణ తన నిర్ణయం మార్చుకోవడానికి ఒక దృశ్యం కారణం అయింది. ఆ దృశ్యం తనకు వేకప్-కాల్‌గా పనిచేసింది.

ఫిజికల్ డిజేబిలిటీ సర్టిఫికెట్ తీసుకోవడానికి విక్టోరియా హాస్పిటల్‌కు వెళ్లిన వీణ అక్కడ ఒక మహిళను చూసింది. ఆమెకు రెండు కాళ్లు లేవు. ఆమె తన బిడ్డను లాలిస్తూ బువ్వ తినిపిస్తోంది. ఒక క్షణం ఆమె ముఖం వైపు చూసింది వీణ. రవ్వంత బాధ కూడా ఆమె ముఖంలో కనిపించలేదు. జీవనోత్సాహంతో ఆ ముఖం వెలిగిపోతోంది.

తాను ఏవైతే పెద్ద సమస్యలు అనుకుంటుందో అవి గాలిలో దూదిపింజల్లా ఎగిరిపోయాయి.

ఈ ఒక్క దృశ్యం వీణ ఆలోచనలో పూర్తిగా మార్పు తీసుకువచ్చింది.

'ఏదో సాధించాలి' అనే ఉత్సాహం మనసులోకి వచ్చింది. ఆగిపోయిన చదువును కొనసాగించింది. మంచి మార్కులతో పరీక్షలు పాసైంది. ఆ తరువాత ఎంబీఏ పూర్తి చేసింది. బ్యాంకులలో సేల్స్ ఆఫీసర్‌గా, ఐటీ పరిశ్రమలో సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేసింది. ఒకవైపు గంటల కొద్దీ చేసే ఉద్యోగం... మరోవైపు పిల్లల ఆలనా పాలనా కష్టమనిపించింది. ఒక సౌత్ అమెరికన్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు ఎడతెగకుండా జరిగే మీటింగ్‌లు, పనిభారం వల్ల కాలికి ఇన్‌ఫెక్షన్ వచ్చి హాస్పిటల్‌లో పదిహేను రోజులు ఉండాల్సి వచ్చింది. ఈ సమయంలోనే సొంతంగా ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది వీణ. దానికి ఫిట్‌నెస్ ట్రెయినర్ అయిన ఆమె భర్త ప్రోత్సాహం తోడైంది.

గత సంవత్సరం బెంగళూరులో 'కరీ దోశ' పేరుతో దోశ స్టాల్ మొదలు పెట్టినప్పుడు 'ఎంబీఏ చదివి ఇదేమిటీ' అన్నట్లుగా మాట్లాడారు కొద్దిమంది. వారి మాటలేవీ పట్టించుకోలేదు వీణ. ప్రత్యేకత ఉంటేనే ఫుడ్ స్టాల్ అయినా పెద్ద వ్యాపారమైనా విజయం సాధిస్తుంది. మరి 'కరీ దోశ' స్పెషల్ ఏమిటి? కరీ దోశే!

తమిళనాడులోని మధురై ప్రాంతంలో 'కరీ దోశ'గా పిలిచే వేడి వేడి దోశ దానిపై ఆమ్లెట్, మటన్ కీమా చాలా ఫేమస్. కరీ దోశ బెంగళూరులో కూడా హిట్ అయింది. ఈ దోశ కోసం కస్టమర్‌లు పొద్దున్నే లైన్ కడతారు.

స్టాల్ ప్రారంభించడానికి ముందు 'కరీ దోశ' రుచులలో ప్రావీణ్యం సంపాదించడానికి రెండు నెలల పాటు ఇంట్లోనే ఉంది వీణ. వంటగది తన పాఠశాలగా, ప్రయోగశాలగా మారింది.

'కరీ దోశ' స్టాల్ పొద్దున ఏడు నుంచి మధ్యాహ్నం పన్నెండు వరకు అందుబాటులో ఉంటుంది. ఇక మిగిలిన సమయమంతా ఇంట్లోనే పిల్లలతో గడుపుతుంది వీణ.

చిరునవ్వే సందేశం

బాధ లేనిది ఎవరికి? బాధ పడుతూ కూర్చోవడం కంటే దాని నుంచి బయటపడడానికి కొత్తబాట వెదకాలి. మనకంటే ఎక్కువ బాధలు పడుతున్న వారు, పెద్ద పెద్ద సమస్యల్లో ఉన్న వారు ఎంతోమంది మన చుట్టుపక్కలే ఉన్నారు. అంత కష్టంలోనూ వారి పెదవి మీద కనిపించే చిరునవ్వు మనకు సందేశాన్ని ఇచ్చి ముందుకు నడిపిస్తుంది.

– వీణా అంబరీష





రెండో రౌండ్‌లో సుమిత్ నగాల్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. మెల్‌బోర్న్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 139వ ర్యాంకర్ సుమిత్ 6-3, 7-5తో జెఫ్రీ బ్లాన్‌కనెక్స్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. గంటా 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అంకిత రైనా (భారత్) 1-6, 5-7తో సారా బెజ్‌లెక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడిపోయింది.

ఇంగ్లండ్ 'ఎ' జట్టు సహాయక బృందంలో...



భారత్‌లో పర్యటించనున్న ఇంగ్లండ్ 'ఎ' జట్టుకు వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా పని చేయనున్నాడు. ఈ పర్యటనలో భాగంగా భారత 'ఎ' జట్టుతో ఇంగ్లండ్ అహ్మదాబాద్‌లో 3 నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ టూర్ తొలి 9 రోజుల పాటు కార్తీక్ ఇంగ్లండ్ టీమ్‌కు అందుబాటులో ఉంటాడు. హెడ్ కోచ్ నీల్ కిలీన్ నేతృత్వంలో అతను పని చేస్తాడు.

ప్రపంచకప్‌కు ముందు ఒకసారి...

వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత జట్టు సొంతగడ్డపై టి20 ఫార్మాట్‌లో కొత్త సమరానికి సిద్ధమైంది. గతంలో ఎన్నడూ ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడని అఫ్గానిస్తాన్‌తో సిరీస్ కోసం ఇప్పుడు టీమిండియా బరిలోకి దిగుతోంది. టి20 ప్రపంచకప్‌కు మరికొంత సమయం ఉన్నా... దానికి ముందు భారత్ ఆడనున్న ఆఖరి అంతర్జాతీయ సిరీస్ ఇదే కానుంది. 2022 వరల్డ్ కప్ సెమీస్ పరాజయం తర్వాత కుర్రాళ్ల కోసం వరుసగా విశ్రాంతి తీసుకుంటూ వచ్చిన రోహిత్, కోహ్లి ఇప్పుడే మళ్లీ ఈ సిరీస్‌లో ఆడనుండటంతో జట్టు బలం పెరిగింది. మరోవైపు అప్పుడప్పుడు కొన్ని మెరుపు ప్రదర్శనలతో సత్తా చాటుతున్న అఫ్గానిస్తాన్ పటిష్ట ప్రత్యర్థి పోటీనివ్వాలని పట్టుదలగా ఉంది.



మొహాలి: దక్షిణాఫ్రికా గడ్డపై టి20 సిరీస్‌లో సమంగా నిలిచిన భారత జట్టు స్వదేశంలో కొత్త సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది. అఫ్గానిస్తాన్‌తో 3 మ్యాచ్‌ల పోరులో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో భారత్ తలపడుతుంది. ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్ జరగడం ఇదే మొదటిసారి. గతంలో ప్రపంచకప్, ఆసియా కప్‌లలో అఫ్గాన్‌ను ఎదుర్కొన్న ప్రతీసారి భారత్‌కే విజయం దక్కింది. ప్రస్తుతం కూడా బలాబలాల దృష్ట్యా అన్ని రంగాల్లో భారత్ పటిష్టంగా కనిపిస్తోంది. పునరాగమనం చేసిన సీనియర్లతో పాటు తమకు లభించిన పరిమిత అవకాశాల్లోనే తమను తాము నిరూపించుకున్న కుర్రాళ్లను పరీక్షించేందుకు కూడా ఇది సరైన అవకాశం.

కుర్రాళ్లంతా ఉత్సాహంగా...

టి20 జట్టులో కచ్చితంగా ఉండే హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ గాయాల కారణంగా ఈ సిరీస్‌కు అందుబాటులో లేరు. అయితే రోహిత్ నాయకత్వంలో సత్తా చాటేందుకు ఇతర కుర్రాళ్లంతా సిద్ధంగా ఉన్నారు. ఈ ఫార్మాట్‌లో తానేంటో ఇప్పటికే నిరూపించుకొని ఫినిషర్‌గా చెలరేగుతున్న రింకూ సింగ్ తొలిసారి రోహిత్ కెప్టెన్సీలో ఆడనున్నాడు. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ కూడా ఇటీవల ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. రోహిత్, యశస్వి ఓపెనింగ్ చేస్తారని కోచ్ ద్రవిడ్ ఇప్పటికే స్పష్టం చేశాడు. యశస్వి శుభారంభం అందించాల్సి ఉండగా... కొంత విరామం తర్వాత బరిలోకి దిగుతున్న రోహిత్‌పై కూడా భారం ఉంది. ఫామ్‌ను బట్టి చూస్తే గిల్‌కు తుది జట్టులో చోటు కష్టమే.

- ద్వైపాక్షిక టి20 సిరీస్ బరిలో భారత్
- నేడు అఫ్గానిస్తాన్‌తో తొలి పోరు
- మ్యాచ్‌కు కోహ్లి దూరం
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

4 మొహాలీలో భారత జట్టు ఇప్పటి వరకు నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో విజయం సాధించి, ఒక మ్యాచ్‌లో ఓడిపోయింది. అఫ్గానిస్తాన్‌తో టీమిండియా ఐదు టి20లు ఆడగా... నాలుగింటిలో గెలిచింది. మరో మ్యాచ్ రద్దయింది.

అయితే వ్యక్తిగత కారణాలతో విరాట్ కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దాంతో మూడో స్థానంలో గిల్‌కు అవకాశం దక్కనుంది. కీపర్‌గా ఇద్దరు ఆటగాళ్లు అందుబాటులో ఉన్నా... సంజూ సామ్సన్ కాకుండా జితేశ్ శర్మ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపవచ్చు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తిరిగొచ్చినా అతడికి తొలి మ్యాచ్‌లో చాన్స్ దక్కకపోవచ్చు. భారత్ ముగ్గురు పేసర్లతో ఆడుతుందా లేక ఇద్దరికే పరిమితం అవుతుందా అనేది చూడాలి. స్పిన్నర్లలో కుల్దీప్ యాదవ్ చక్కటి ఫామ్‌లో ఉండగా...అదనంగా మరో ముగ్గురు స్పిన్నర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు.



సత్తా చాటేనా...

వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్ అంచనాలకు మించి రాణించింది. అదే ఫామ్‌లో ఆ జట్టు టి20ల్లోనూ కొనసాగిస్తే భారత్‌కు ఇబ్బందులు కలగవచ్చు. గుర్బాజ్ ఇప్పటికే మెరుపు ఓపెనర్‌గా గుర్తింపు తెచ్చుకోగా, కెప్టెన్ ఇబ్రహీం మంచి ఫామ్‌లో ఉన్నాడు. రహ్మత్, నజీబుల్లా జట్టు బ్యాటింగ్ భారం మోస్తారు. నబీ, ముజీబ్, నూర్‌లతో అఫ్గాన్ స్పిన్ పటిష్టంగా కనిపిస్తోంది. ఈ ముగ్గురిని కూడా తుది జట్టులో ఆడించే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో ఇక్కడ ఆడిన అనుభవం ఉన్న పేస్‌బౌలర్లు ఫజల్ హక్, నవీన్ ప్రభావం చూపించగలరు. అయితే జట్టు ప్రధాన బలం రషీద్ ఖాన్ సిరీస్‌కు దూరం కావడం ఆ జట్టుకు ప్రతికూలాంశం. గాయం నుంచి కోలుకుంటున్న రషీద్ ఊహించినట్లుగానే సిరీస్ మొదలయ్యే వరకు కోలుకోలేకపోయాడు. అయితే పోరాటపటిమ ఉన్న అఫ్గాన్ సంచలనం సృష్టించినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇటీవలే యూఏఈతో జరిగిన సిరీస్‌ను 2-1తో అఫ్గానిస్తాన్ గెలుచుకుంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, తిలక్, రింకూ, జితేశ్, అక్షర్, అర్ష్‌దీప్, ముకేశ్, కుల్దీప్, రవి బిష్ణోయ్. **అఫ్గానిస్తాన్:** ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), హజ్రతుల్లా, గుర్బాజ్, అజ్మతుల్లా, నజీబుల్లా, నబీ, నైబ్, ముజీబ్, ఖైస్, నవీన్ ఉల్ హక్, ఫజల్ హక్

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ పిచ్. పీసీఏ స్టేడియం భారీ స్కోర్లకు వేదిక. ఇక్కడ జరిగిన చివరి టి20లో (2022) మొత్తం 419 పరుగులు నమోదయ్యాయి. ఉత్తరాదిలో మంచు ప్రభావం ఉంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు.



భారత షూటర్లకు ఐదు పతకాలు

జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నమెంట్‌లో మూడో రోజూ భారత షూటర్లు ఐదు పతకాలతో మెరిశారు. బుధవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ నాన్సీ స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... ఇలవేనిల్ వలారివన్ రజత పతకం దక్కించుకుంది. నాన్సీ, ఇలవేనిల్, మెహులీ ఘోష్‌లతో కూడిన భారత జట్టు 1897.2 పాయింట్లతో టీమ్ విభాగంలో బంగారు పతకం నెగ్గింది. వ్యక్తిగత ఫైనల్లో నాన్సీ 252.8 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఇలవేనిల్ 252.7 పాయింట్లతో రెండో స్థానాన్ని పొందింది. చైనా షూటర్ షెన్ యుఫాన్ 231.4 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్య పతకం సాధించగా... రుద్రాంక్ష్, అర్జున్ బబూటా, శ్రీకార్తీక్‌లతో కూడిన భారత బృందానికి కాంస్య పతకం దక్కింది. వ్యక్తిగత ఫైనల్లో రుద్రాంక్ష్ 228.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానాన్ని పొందాడు. టీమ్ విభాగంలో రుద్రాంక్ష్, అర్జున్, శ్రీకార్తీక్ బృందం 1885.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.

ముగిసిన శ్రీజ పోరాటం



దోహా: వరల్డ్ టేబుల్ టెన్నిస్ దోహా కంటెండర్ టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన శ్రీజ రెండో రౌండ్‌లో 14-12, 11-8, 11-7తో ఆద్రీ జరీఫ్ (ఫ్రాన్స్)పై గెలిచింది. అయితే మూడో రౌండ్‌లో శ్రీజ 5-11, 10-12, 9-11తో చెన్ జు యు (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో శ్రీజ-యశస్విని ద్వయం 6-11, 7-11, 5-11తో జియాన్ టియాని-చెన్ జింగ్‌టాన్ (చైనా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-18, 21-19తో మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రి-మౌలానా బాగస్ (ఇండోనేసియా) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ 14-21, 11-21తో ఆండెర్స్ ఆంటోన్సన్ (డెన్మార్క్) చేతిలో... లక్ష్య సేన్ 15-21, 16-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు.



సందీప్ లమిచానేకు ఎనిమిదేళ్ల జైలు

రేప్ కేసులో నేపాల్ క్రికెటర్‌కు శిక్ష



కఠ్మాండూ: మైనర్‌పై అత్యాచారం కేసులో నేపాల్ లెగ్ స్పిన్నర్, మాజీ కెప్టెన్ సందీప్ లమిచానేకు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తామని లమిచానే తరఫు న్యాయవాది వెల్లడించారు. 18 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన 23 ఏళ్ల లమిచానే 51 వన్డేలు, 52 టి20లు ఆడి మొత్తం 202 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఆడిన తొలి నేపాల్ బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అతను ఢిల్లీ జట్టు తరఫున 2 సీజన్లలో కలిపి 9 మ్యాచ్‌లు ఆడాడు. గత ఏడాది సెప్టెంబర్‌లో మైనర్‌ను రేప్ చేశాడనే ఆరోపణలు రావడంతో నేపాల్ బోర్డు సస్పెండ్ చేసింది. అయితే తీవ్ర విమర్శల మధ్య అతను గత ఫిబ్రవరిలో జట్టులోకి తిరిగొచ్చి మ్యాచ్‌లు ఆడాడు. విచారణ అనంతరం లమిచానే నేరం చేసినట్లు రుజువైంది.

తమిళ్ తలైవాస్ గెలుపు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తమిళ్ తలైవాస్ మూడో విజయం నమోదు చేసింది. యూపీ యోధాస్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 46-27తో గెలిచింది. యు ముంబా, హరియాణా స్టీలర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 44-44తో 'డ్రా' అయింది.

సినిమా



● రాజ్ తరుణ్, కీరవాణి, విజయ్ బిన్నీ, నాగార్జున, శ్రీనివాసా చిట్టూరి, చంద్రబోస్, 'అల్లరి' నరేశ్

కిష్టయ్య వస్తున్నాడు... బాక్సాఫీస్‌ని కొడుతున్నాడు

– హీరో నాగార్జున

''టీవీలు రాగానే సినిమాలు చూడరు అన్నారు. ఫోన్స్ వచ్చినప్పుడు, సీడీ-డీవీడీలు వచ్చినప్పుడు సినిమాలు చూడరు అన్నారు.. చూస్తూనే ఉన్నారు ఆడియన్స్. ఈ మధ్య ఓటీటీ వచ్చింది. అయినా సినిమాలు చూస్తూనే ఉన్నారు. కోవిడ్ తర్వాత కూడా సినిమాలు చూస్తున్నారు. పండగ రోజున సినిమాలు చూడటం అనేది మన ఆనవాయితీ. ఒకటి కాదు.. రెండు కాదు.. నాలుగు సినిమాలు వచ్చినా ప్రేక్షకులు చూస్తారు. మన తెలుగు వారికి సంక్రాంతి అంటే సినిమా పండగ'' అని నాగార్జున అన్నారు. నాగార్జున హీరోగా నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నాగార్జున మాట్లాడుతూ– ''మహేశ్‌బాబు 'గుంటూరుకారం', 'హను–మాన్'గా వస్తున్న తేజకు, 75వ సినిమాతో 'సైంధవ్'గా వస్తున్న మా వెంకీకి ఆల్ ది బెస్ట్. మేం 'నా సామిరంగ'తో వస్తున్నాం. మేం ఇచ్చే సినిమా మీకు నచ్చితే ఎలా ఆదరిస్తారో సంక్రాంతి పండగలకు నేను చూశాను. మీకు సినిమా నచ్చుతుందని, ఈ సంక్రాంతి పండక్కి కూడా అలానే ఆదరిస్తారని.. నా సామిరంగ. మా సినిమాకి కీరవాణిగారు బ్లాక్‌బస్టర్ పాటలు ఇచ్చారు. ఈ సినిమాను త్వరగా పూర్తి చేయడానికి కారణం కీరవాణిగారు. సినిమా స్టార్ట్ అవ్వకముందే మూడు పాటలు, ఓ ఫైట్‌కు ఆర్ఆర్ చేసి పెట్టారు. విజయ్ బిన్నీని కీరవాణి, చంద్రబోస్‌గార్లు బాగా ప్రోత్సహించారు. మూడు నెలల్లోనే మేం సినిమా తీశాం. సెప్టెంబరు 20 నాన్నగారి నూరవ జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ (గత ఏడాది) జరిగింది. ఆ సందర్భంగా దండం పెడుతుంటే 'వెళ్లి సినిమా చేయరా.. నా సామిరంగ' అని చెప్పినట్లుగా అనిపించింది. ఆయన చెప్పిన ధైర్యంతోనే సినిమాను పూర్తి చేశాం. ఈసారి సంక్రాంతికి కిష్టయ్య (నాగార్జున పాత్ర పేరు) వస్తున్నాడు... బాక్సాఫీస్ కొడుతున్నాడు. కీరవాణి, చంద్రబోస్‌గార్లు తెలుగు ఇండస్ట్రీని ఆస్కార్ వేదికపై నిలబెట్టారు'' అని అన్నారు. ''నాగార్జునగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''నా తొలి సినిమా 'ఉయ్యాలా.. జంపాల' అన్నపూర్ణ స్టూడియోలో చేశాను. 'రంగులరాట్నం', 'అనుభవించు రాజా' సినిమాలు చేశాను. ఇప్పుడు నాగార్జునగారితో 'నా సామిరంగ' సినిమా చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు రాజ్ తరుణ్. ''నా లైఫ్‌కి ఇంపార్టెంట్ పర్సన్ నాగార్జునగారు. దర్శకుల గత సినిమాల ఫలితాలు చూసి అవకాశాలు ఇచ్చే ఇండస్ట్రీ ఇది. అలాంటిది ఓ కొరియోగ్రాఫర్‌ను అయిన నన్ను నమ్మి, నాకు ఇంత పెద్ద సినిమా చేసేందుకు అవకాశం వచ్చిన రియల్ హీరో నాగార్జునగారు'' అన్నారు విజయ్ బిన్నీ. ''కొత్త దర్శకులు, కొత్త సాంకేతిక నిపుణులను గుర్తించి, వారిని ప్రోత్సహించడంలో నాగార్జునగారు ముందుంటారు'' అన్నారు కీరవాణి. ''మా అన్నయ్య కీరవాణిగారి స్వరకల్పనలో ఈ సినిమా కోసం మంచిగా నాలుగు పాటలు రాశాను'' అన్నారు చంద్ర బోస్.

సాధించాల్సింది ఎంతో ఉంది

రకుల్ ప్రీత్ సింగ్.. పరిచయం అక్కర్లేని పేరు. అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులతో పాటు బాలీవుడ్ ఆడియన్స్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారామె. 2009లో 'జిల్లీ' సినిమాతో కన్నడ పరిశ్రమలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. కాగా, రకుల్ ప్రీత్‌సింగ్ 'యారియాన్' అనే సినిమాతో హిందీ ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. దివ్య ఖోస్లా కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2014 జనవరి 10న రిలీజైంది. ఈ చిత్రం విడుదలై మంగళవారంతో పదేళ్లయింది. తాను బాలీవుడ్‌లో అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోషల్ మీడియా వేదికగా ఆనందాన్ని వ్యక్తం చేశారు రకుల్ ప్రీత్‌సింగ్. ''ఎన్నో అందమైన కలలతో యంగ్ గర్ల్‌గా పదేళ్ల క్రితం బాలీవుడ్‌లో తొలి అడుగు వేశాను. నా శ్రమ, పట్టుదలతో ఇంత పెద్ద స్థాయికి చేరుకున్నాను. ఒక నటిగా నేను సాధించాల్సింది ఇంకా చాలా ఉంది. ఇందుకోసం మరింత ఉత్సాహంగా పని చేస్తాను. నేనీ స్థాయికి చేరుకోవడానికి సాయపడిన వారికి కృతజ్ఞతలు. 'యారియాన్'లో వర్క్ చేసినందుకు సంతోషిస్తున్నా'' అంటూ ఆ సినిమా ఫొటోని జత చేసి షేర్ చేశారు రకుల్. కాగా హిందీలో పదేళ్లు పూర్తి చేసుకున్న రకుల్‌కి ఫ్యాన్స్ శుభాకాంక్షలు చెప్పారు. ఇదిలా ఉంటే నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ పెళ్లి ఫిబ్రవరిలో గోవాలో జరగనుందని టాక్.



● రకుల్

కల్కి రాక ఆ రోజేనా..?



థియేటర్స్‌లో 'కల్కి' రాకకు సమయం ఆసన్నమైంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫ్యాంటసీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను ఈ ఏడాది మే 9న విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందని, విడుదల తేదీ గురించిన అధికారిక ప్రకటన ఈ వారంలోనే వెల్లడి కానుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడు. ఈ సంగతి ఇలా ఉంచితే... వైజయంతీ మూవీస్ పై అశ్వనీదత్ నిర్మించిన చిరంజీవి–శ్రీదేవిల 'జగదేకవీరుడు అతిలోక సుందరి' (1990), కీర్తి సురేష్ 'మహానటి' (2018) చిత్రాలు మే 9న రిలీజై, బ్లాక్ బస్టర్స్‌గా నిలిచిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఒక మాస్ హీరోలా ఫైట్ చేశా!

– వరలక్ష్మీ శరత్‌కుమార్



''హను-మాన్' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి సార్ నా పని గురించి, నా నటన గురించి చాలా పాజిటివ్‌గా మాట్లాడారు. 'నీలాంటి ప్రతిభ ఉన్న నటి తెలుగు చిత్రపరిశ్రమలో ఉండాలి.. హైదరాబాద్‌లోనే ఉండు' అని ఆయన చెప్పడంతో ఇన్నాళ్ల నా కష్టానికి ఒక అవార్డు వచ్చిందని సంతోషంగా అనిపించింది. సహ నటీనటుల గురించి అలా మాట్లాడాలంటే ఎంతో మంచి మనసుండాలి. ప్రీ రిలీజ్ వేడుక అయిన తర్వాత కృతజ్ఞతలు చెబుతూ ఆయనకు మెసేజ్ చేశాను" అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించిన వరలక్ష్మీ శరత్‌కుమార్ పంచుకున్న విశేషాలు.

● 'హను-మాన్'లో తేజ సజ్జాకి అక్క (అంజమ్మ) పాత్రలో కనిపిస్తాను. ఇది సూపర్ హీరో ఫిల్మ్. ఇందులో తేజ సూపర్ హీరో. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ ఉండే ఫైట్ నాది. అంజమ్మ పాత్ర నా కెరీర్‌లో వైవిధ్యంగా ఉంటుంది. ● తేజ, ప్రశాంత్, నిరంజన్ రెడ్డిగారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. నా అంజమ్మ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రం ప్రేక్షకులను అద్భుతంగా అలరిస్తుంది. నేను ఒక సినిమా చేస్తున్నానంటే అందులో ఏదో కొత్తదనం ఉంటుందనే పేరు వచ్చింది.. ఆ పేరుని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాను.

● ఏ సినిమా చేసినా 'ఇది నా తొలి చిత్రం.. నేను కొత్త' అనే ఆలోచనతో చేస్తాను. విలన్, హీరోయిన్, సైడ్ క్యారెక్టర్ అని చూడను. నా పాత్రకి ప్రాధాన్యత ఉంటే ఏదైనా చేస్తాను. కొంతమందికి నా పేరు తెలియదు. వాళ్లు నేను చేసిన పాత్రలతో జయమ్మ, భానుమతి అని పిలుస్తారు.. అదే నాకు అసలైన అవార్డ్. హిందీ, బెంగాలీలో అవకాశాలు వచ్చాయి. కానీ పాత్రలు నచ్చకపోవడం, డేట్స్ కుదరకపోవడం వల్ల చేయలేదు. మా నాన్న (శరత్ కుమార్) నా ప్రతి సినిమా చూసి, నా నటన గురించి చెబుతారు. 'కోట బొమ్మాళి పీఎస్'లో నా పాత్రకి ఆయన ఎలాంటి వంక పెట్టలేదు.. చాలా బాగా చేశావని అభినందించారు. ప్రస్తుతం సుదీప్‌గారితో 'మ్యాక్స్', ధనుష్‌గారితో 'డీ 50'లో చేస్తున్నాను. మరికొన్ని తెలుగు, తమిళ చిత్రాలు చర్చల్లో ఉన్నాయి.

హృదయాలను ధైర్యంతో నింపుకోండి!

– నటి ఏంజెలా బాసెట్



● కరోల్ లిటిల్టన్, మెల్ బ్రూక్స్, ఏంజెలా బాసెట్, మిచెల్ సాటర్

ఆస్కార్ అకాడమీ పద్నాలుగో ఆనరరీ అవార్డుల ప్రదానం అమెరికాలో జరిగింది. 2023 సంవత్సరానికిగాను నటి ఏంజెలా బాసెట్, నటుడు–రచయిత–ఫిల్మ్ మేకర్ మెల్ బ్రూక్స్, ఫిల్మ్ ఎడిటర్ కరోల్ లిటిల్టన్, సన్‌డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మిచెల్ సాటర్‌లకు ఈ అవార్డులను ప్రదానం చేసింది అకాడమీ. అయితే ఈ వేడుక గత ఏడాది నవంబరు 18న జరగాల్సింది. కానీ హాలీవుడ్‌లో రచయితలు, నటీనటులు చేసిన సమ్మెల కారణంగా ఈ వేడుక వాయిదా పడింది. తాజాగా ఈ అవార్డు ప్రదానోత్సవం అమెరికాలో జరిగింది. ఈ గౌరవ పురస్కారాల అవార్డు విభాగంలో రెండో అవార్డును గెలుచుకున్న బ్లాక్ లేడీగా నిలిచారు ఏంజెలా బాసెట్. తొలిసారిగా నటి సిసిలీ టైసన్ ఈ గౌరవాన్ని పొందారు. ''ఈ విభాగంలో నేను అవార్డు అందుకున్నందుకు ఆమె (సిసిలీ) స్వర్గంలో ఆనందంగా ఉండి ఉంటారు. నా తోటి బ్లాక్ యాక్టర్స్ అందరికీ చెబుతున్నాను. మీ హృదయాలను ధైర్యంతో నింపుకోండి. ధృడంగా ఉండండి'' అంటూ అవార్డు అందుకున్న అనంతరం ఏంజెలా బాసెట్ ఉద్వేగంగా ప్రసంగించారు. ''మీ సహచరులు మీ పనిని మెచ్చుకున్నప్పుడు మరియు వారు ఈ బంగారు విగ్రహంతో అభినందించినప్పుడు కలిగే ఆనందమే వేరు. ఈ పురస్కారానికి నా మనసులో ఎప్పటికీ గౌరవం ఉంటుంది. అందుకే ఈ అవార్డును అమ్మను సుమా..'' అని చమత్కరించారు మెల్ బ్రూక్స్. ఈ వేడుకలో టామ్ హాంక్స్, జూలియన్నే మూర్, మార్గొట్ రాబీ, కోల్మన్ డొమింగో వంటి హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... చిత్రసీమకు విశిష్టమైన సేవలు అందించిన వారికి ఈ హానరరీ అవార్డులను ప్రదానం చేస్తుంటారు. మరోవైపు ఈ ఏడాది మార్చిలో 96వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. జనవరిలో నామినేషన్స్ వెల్లడి కానున్నాయి.

సాక్షి
బిజినెస్
గురువారం
11-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
271	74
71,658	21,619

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,906	▲	48
డోజోన్స్	37,558	▲	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,651	▽	32
డాక్స్	16,689	▽	1
షాంఘై	2,878	▽	16
నికాయ్	34,443	▲	679

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,348	▽	67
బంగారం (99.5 స్వచ్ఛత)	62,098	▽	67
వెండి (కేజీ)	71,447	▽	679

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.85	107.42
€	యూరో	ఎస్‌బీఐ	89.85	92.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.15
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.87	56.80
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.49	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.27
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.46

కోటక్ మహీంద్రా లైఫ్ నుంచి 'టులిప్' ప్లాన్

టర్మ్ ఇన్సూరెన్స్, యులిప్ ప్రయోజనాలతో పాలసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా టులిప్ (టీయూఎల్‌ఐపీ) పేరిట కొత్త పాలసీని ఆవిష్కరించింది. ఇటు టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజీతో పాటు అటు యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ (యులిప్) ప్రయోజనాలను కూడా అందించే విధంగా ఈ ప్లాన్ ఉంటుందని సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మనీష్ అలఘ్ తెలిపారు. వార్షిక ప్రీమియానికి 100 రెట్లు లైఫ్ కవరేజీ పొందవచ్చని, నిర్దిష్ట కాలం తర్వాత ప్రీమియం అలొకేషన్ చార్జీల రీఫండ్, క్రిటికల్ ఇల్‌నెస్..యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్ వంటి ప్రయోజనాలు ఇందులో ఉన్నాయని ఆయన చెప్పారు. హైదరాబాద్ మార్కెట్లో తమకు బ్యాంక్‌ఎష్యూరెన్స్ తదితర చానల్స్‌తో పాటు సుమారు 5,000 మంది ఏజెంట్లు ఉన్నట్లు మనీష్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థ స్థాయిలో వ్యక్తిగత పాలసీల ప్రీమియం ఆదాయం 37 శాతం పెరగ్గా.. కొత్త ట్యాక్సేషన్ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈసారి 10–12 శాతం స్థాయిలో వృద్ధి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. కంపెనీ స్థాయిలో ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో 10 శాతం, తెలుగు రాష్ట్రాల్లో 13 శాతం వృద్ధి నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.

బిగ్'సి' సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: రిటైల్ మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్'సి' సంక్రాంతి సందర్భంగా ఆఫర్లు ప్రకటించింది. బిగ్ 'సి' స్టోర్లలో స్మార్ట్ ఫోన్ కొనుగోళ్లపై రూ.3,000 వరకు తక్షణ తగ్గింపుతో పాటు రూ.4,999 విలువైన స్మార్ట్‌వాచ్ ఉచితంగా అందిస్తుంది. అలాగే రూ.1.10 లక్షల విలువైన హెల్త్ కేర్ సంబంధిత ప్రయోజనాలు, అదే విధంగా రూ.75వేల విలువైన పేటీఎం ప్రయోజనాలు ఉచితంగా లభిస్తున్నాయి. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చు. ప్రజలంతా ఈ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి కోరారు.



భారీ పెట్టుబడులకు రెడీ..

- వైబ్రంట్ గుజరాత్ సదస్సులో కార్పొరేట్ల క్యూ
- తొలిరోజే రూ. 2.35 లక్షల కోట్ల ప్రణాళికలు



గాంధీనగర్: గత రెండు దశాబ్దాలుగా వైబ్రంట్ గుజరాత్ సదస్సు అంతర్జాతీయ బిజినెస్ నెట్‌వర్కింగ్ ఈవెంట్‌గా ఆవిర్భవించింది. తద్వారా కార్పొరేట్ ప్రపంచం నుంచి భారీ పెట్టుబడులను ఆకట్టుకుంటోంది. తాజాగా 10వ వైబ్రంట్ గుజరాత్(2024) సదస్సులో రిలయన్స్ గ్రూప్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీ, సుజుకీ మోటార్ కార్ప్ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు పెట్టుబడులకు ఆసక్తిని ప్రదర్శించారు. వెరసి తొలి రోజే రూ. 2.35 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించారు. దేశ, విదేశీ దిగ్గజాల నుంచి భారీ పెట్టుబడులను ఆకట్టుకుంటున్న రాష్ట్రాలలో గుజరాత్ ఒకటిగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. వివరాలు చూద్దాం..

రిలయన్స్.. కార్బన్ ఫైబర్ ప్లాంట్

హజీరాలో దేశంలోనే తొలి కార్బన్ ఫైబర్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ చీఫ్ ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. గుజరాత్ కేంద్రంగా రిలయన్స్ కార్యకలాపాలు కొనసాగనున్నట్లు తెలియజేశారు. గత దశాబ్ద కాలంలో ప్రపంచస్థాయి ఆస్తులు, సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో దేశవ్యాప్తంగా 150 బిలియన్ డాలర్లు(రూ. 12 లక్షల కోట్లు) వెచ్చించినట్లు వివరించారు. వీటిలో మూడో వంతు పెట్టుబడులను గుజరాత్‌లోనే చేపట్టినట్లు తెలియజేశారు. తద్వారా ఈ ప్రాంతానికి తామిస్తున్న ప్రాధాన్యతను ప్రస్తావించారు.

టాటా.. సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్

ఈ ఏడాది(2024) చివరిలో నూతన సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంటును గుజరాత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. దేశీయంగా చిప్స్ తయారీకి ప్రధాని మోదీ ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ సాణంద్‌లో లిథియమ్ అయాన్ బ్యాటరీల తయారీ కేంద్రానికి తెరతీయనున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక దశలో 20 గిగావాట్ స్టోరేజీ బ్యాటరీ సామర్థ్యంతో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఎలక్ట్రిక్ వాహనా (ఈవీ)లకు పెరుగుతున్న డిమాండుకు అనుగుణంగా పెట్టుబడులు చేపట్టనున్నట్లు వివరించారు. రెండు దశలలో చేపట్టనున్న ప్రాజెక్ట్ పనులు రెండు నెలల్లోగా ప్రారంభంకానున్నట్లు తెలియజేశారు.

ఆర్సెలర్‌మిట్టల్.. అతిపెద్ద స్టీల్‌ప్లాంట్

ప్రపంచంలోనే ఒకే ప్రాంతంలో అతిపెద్ద స్టీల్ ఫ్యాక్టరీని హజీరాలో ఏర్పాటు చేయనున్నట్లు ఆర్సెలర్‌మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ పేర్కొన్నారు. జేవీ ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ద్వారా 2029కల్లా ప్లాంటు నిర్మాణం పూర్తికాగలదని తెలియజేశారు. ప్లాంటును వార్షికంగా 2.4 కోట్ల టన్నుల స్టీల్ తయారీ సామర్థ్యంతో నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. 2026లో తొలి దశ ప్రారంభం కావచ్చని తెలియజేశారు.



మైక్రాన్.. రూ. 6,760 కోట్లు

సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా నిలపాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలను మైక్రాన్ టెక్నాలజీ సీఈవో సంజయ్ మెహ్‌రోత్రా ప్రశంసించారు. ఈ యూఎస్ చిప్ తయారీ దిగ్గజం సాణంద్‌లో 2.75 బిలియన్ డాలర్ల సెమీకండక్టర్ టెస్టింగ్, ప్యాకేజింగ్ ప్లాంటు నిర్మాణాన్ని సెప్టెంబర్‌లోనే ప్రారంభించింది. పెట్టుబడుల్లో మైక్రాన్ 82.5 కోట్ల డాలర్లు (సుమారు రూ. 6,760 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. మిగిలిన నిధులను ప్రభుత్వం రెండు దశలలో సబ్సిడీ రూపంలో సమకూర్చనుంది.

అదానీ.. రూ. 2 లక్షల కోట్లు

రానున్న ఐదేళ్లలో గుజరాత్‌లో రూ. 2 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో భారీ గ్రీన్ ఎనర్జీ పార్క్‌కు తెరతీయనున్నట్లు అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ వెల్లడించారు. అంతరిక్షం నుంచి సైతం దర్శించగల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఉద్యోగాలకు అవకాశముంటుందని తెలిపారు. గత వైబ్రంట్ సదస్సులో 2025కల్లా రూ. 55,000 కోట్ల పెట్టుబడులను ప్రకటించగా... రూ. 50,000 కోట్లు ఇప్పటికే వెచ్చించినట్లు వివరించారు.

మారుతీ సుజుకీ రెండో ప్లాంట్



ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా గుజరాత్‌లో రెండో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్ప్ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ పేర్కొన్నారు. ఇందుకు రూ. 35,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. 2030–31కల్లా వార్షిక తయారీ సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు చేర్చాలని చూస్తున్నట్లు తెలియజేశారు. 2028–29కల్లా కొత్త ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు తెలియజేశారు.

ఎయిర్‌పోర్ట్‌ల విభాగాన్ని లిస్టింగ్ చేస్తాం

అదానీ ఎంటర్‌ప్రైజెస్ వీపీ జీత్ అదానీ వెల్లడి

హైదరాబాద్: నిర్దిష్ట మైలురాళ్లను సాధించిన తర్వాత సమీప భవిష్యత్తులో ఎయిర్‌పోర్ట్స్ విభాగాన్ని లిస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని అదానీ ఎంటర్‌ప్రైజెస్ వైస్ ప్రెసిడెంట్ జీత్ అదానీ వెల్లడించారు. ప్రస్తుతం కంపెనీ చేతిలో ఉన్న విమానాశ్రయాలను విస్తరిస్తున్నామని, గతేడాది అన్ని ఎయిర్‌పోర్ట్‌ల నుంచి 8 కోట్ల మంది ప్యాసింజర్లు ప్రయాణించినట్లు ఆయన చెప్పారు. లక్నో, గువాహటి ఎయిర్‌పోర్ట్‌లలో కొత్త టెర్మినల్స్‌ను ప్రారంభించనున్నామని, నవీ ముంబై విమానాశ్రయం ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి కాగలదని చెప్పారు. అహ్మదాబాద్, జైపూర్, మంగళూరు ఎయిర్‌పోర్ట్‌ల విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. భారత నేవీ కోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ తయారు చేసిన దృష్టి 10 స్టార్‌లైనర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) ఆవిష్కరణ కార్యక్రమంలో జీత్ పాల్గొన్నారు.



అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ (ఏఏహెచ్‌ఎల్) మంగళూరు, లక్నో, అహ్మదాబాద్, తిరువనంతపురం, ముంబై తదితర విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (ఎంఐఏఎల్) 73% వాటా ఉంది. ఎంఐఏఎల్‌కు నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో 74% వాటాలు ఉన్నాయి. ప్రయాణికుల పరంగా 25% వాటా, ఎయిర్ కార్గో ట్రాఫిక్‌లో 33% వాటాతో ఏఏహెచ్‌ఎల్ దేశీయంగా అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రా సంస్థగా ఉంది.

చివర్లో కొనుగోళ్లు...

నష్టాల్లోంచి లాభాల్లోకి సూచీలు



ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొన్న స్టాక్ మార్కెట్ బుధవారం లాభాలతో ముగిసింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల కారణంగా ప్రారంభంలోనే భారీ నష్టాలు చవిచూశాయి. మిడ్ సెషన్ నుంచి కనిష్ట స్థాయిలో ఐటీ, బ్యాంకింగ్, మెటల్, సర్వీసెస్, వినిమ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చివర్లో రిలయన్స్(2.50%), ఐసీఐసీఐ(1.50%) షేర్లు రాణించడంతో లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 615 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 271 పాయింట్లు పెరిగి 71,658 వద్ద నిలిచింది. నిఫ్టీ 21,449 – 21,642 శ్రేణిలో ట్రేడైంది. మార్కెట్ ముగిసే సరికి 74 పాయింట్లు బలపడి 21,619 వద్ద నిలిచింది. ఎఫ్‌ఎంసీజీ, టెలికం, యుటిలిటీ, రియల్టీ, విద్యుత్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,721 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,080 కోట్ల విలువైన షేర్లను కొన్నారు.

- అదానీ గ్రూప్‌లోని పదింటికి గానూ 8 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ఎన్‌డీటీవీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 3%, అదానీ గ్రీన్ ఎనర్జీ 2%, అదానీ పోర్ట్స్ 1.50%, అదానీ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ గ్యాస్ టోటల్, అంబుజా సిమెంట్స్ అరశాతం వరకు పెరిగాయి. కాగా, అదానీ విల్మార్, ఏసీసీ షేర్లు అరశాతం మేర నష్టపోయాయి.
- ట్రేడింగ్ చివర్లో అనూహ్య కొనుగోళ్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3% లాభపడి రూ. 2,650 వద్ద ముగిసింది. ఒక దశలో 3%కి పైగా పెరిగి రూ.2659 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.46,810 కోట్లు పెరిగి రూ.17.93 లక్షల కోట్లకు చేరింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇఫ్లూ, హైదరాబాద్‌లో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ, నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రీసోర్సెస్ విభాగం.. ప్రొఫిషియన్సీ కోర్సు ఇన్ ఇంగ్లిష్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 200
» కోర్సు వ్యవధి: 05.02.2024 నుంచి 01.03.2024 వరకు (నాలుగు వారాలు)–40 గంటలు.
» అర్హత: ఇంటర్మీడియట్/10+2 పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి.
» హైదరాబాద్ ఇఫ్లూలో దరఖాస్తు ఫారాలు ఇచ్చే చివరితేది: 19.01.2024.
» చిరునామా: ఎన్‌ఎఫ్‌సీఏఆర్ కార్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్.
» దరఖాస్తులకు చివరితేది: 31.01.2024.
» వెబ్‌సైట్: www.efluniversity.ac.in

స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, అహ్మదాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

అహ్మదాబాద్‌లోని ఇస్రో–స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(ఇస్రో).. వివిధ విభాగాల్లో సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 19
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ(అగ్రికల్చర్)–08, సైంటిస్ట్/ ఇంజనీర్–ఎస్సీ(అట్మాస్ఫియరిక్ సైన్సెస్ అండ్ ఓషనోగ్రఫీ)–08, సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)–03.
» అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్సీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.56,100 నుంచి 1,77,500.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులకు చివరితేది: 15.01.2024.
» వెబ్‌సైట్: www.sac.gov.in

యూఐఐసీ, చెన్నైలో 250 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్ (యూఐఐసీ).. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్ 1)–జనరలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 250
» అర్హత: 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.01.2024.
» వెబ్‌సైట్: https://uiic.co.in

మదనపల్లెలో 266 పారామెడికల్ పోస్టులు

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ప్రభుత్వ వైద్య కళాశాల, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో.. కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 266.
» పోస్టులు: చైల్డ్ సైకాలజిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనీ, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, కార్డియాలజీ టెక్నీషియన్, రిఫ్రాక్షనిస్ట్, ఫిజియోథెరపిస్ట్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, మదనపల్లె, అన్నమయ్య జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 14.01.2024.
» వెబ్‌సైట్: https://chittoor.ap.gov.in.

సమీర్‌లో 24 అప్రెంటిస్‌లు

ముంబైలోని సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ అండ్ రీసెర్చ్(సమీర్).. గ్రాడ్యుయేట్,డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీల నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 24
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీలు–16, డిప్లొమా ఇంజనీర్స్ అప్రెంటిస్ ట్రైనీలు–08.
» విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఐటీ, మెకానికల్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 25 ఏళ్లు మించకూడదు.
» స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్లకు రూ.10,500, డిప్లొమా అభ్యర్థులకు రూ.8500.
» ఇంటర్వ్యూ తేదీలు: 17.01.2024, 18.01.2024
» వేదిక: సమీర్, ఐఐటీ క్యాంపస్, హిల్ సైడ్, పోవై, ముంబై.
» వెబ్‌సైట్: www.sameer.gov.in

సెంట్రల్ వర్సిటీస్‌లో పీజీ చేస్తారా!

» సీయూఈటీ–పీజీ 2024 నోటిఫికేషన్ విడుదల
» సెంట్రల్ వర్సిటీలు, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ ప్రవేశాలు
» ఆరు విభాగాల్లో 157 పేపర్లు/సబ్జెక్ట్‌లలో పరీక్ష
» గరిష్టంగా నాలుగు పేపర్లకు హాజరయ్యే అవకాశం

సెంట్రల్ యూనివర్సిటీలు.. విశ్వవిద్యాలయ విద్యకు పేరొందిన సంస్థలు! దేశంలో సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, టెక్నికల్.. ఇలా ఏ విభాగంలో పీజీ చేయాలనుకున్నా.. ఎక్కువ మంది విద్యార్థుల తొలి ప్రాథమ్యం సెంట్రల్ యూనివర్సిటీలే!! కారణం.. ఈ యూనివర్సిటీ సర్టిఫికెట్ చేతిలో ఉంటే.. ఉద్యోగావకాశాలకు ఢోకా ఉండదనే అభిప్రాయం. తాజాగా సెంట్రల్ యూనివర్సిటీల్లో... పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)-పీజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-పీజీ-2024 వివరాలు, అర్హతలు, యూనివర్సిటీల ప్రవేశ ప్రక్రియ తదితర వివరాలు..

దేశంలో పదుల సంఖ్యలో సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో చేరాలనుకునే విద్యార్థులు.. గతంలో ప్రతి యూనివర్సిటీ సొంతంగా నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకొని హాజరవ్వాల్సి వచ్చేది.ఇది విద్యార్థులకు భారమని భావించిన ప్రభుత్వం.. అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల కోసం ఉమ్మడిగా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు సీయూఈటీ–యూజీ, పీజీ కోర్సులకు సీయూఈటీ–పీజీ నిర్వహిస్తున్నారు.

56 సెంట్రల్ యూనివర్సిటీలు

సీయూఈటీ–పీజీ స్కోర్ ఆధారంగా దేశంలోని 56 సెంట్రల్ యూనివర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం; తెలంగాణలో.. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లలో సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. సెంట్రల్ యూనివర్సిటీలతో పాటు దాదాపు 210కి పైగా ఇన్‌స్టిట్యూట్‌లకు సీయూఈటీ–పీజీ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

అర్హతలు

- అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్న సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 2024లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: ఎలాంటి గరిష్ట వయో పరిమితి నిబంధన లేదు.

ఆరు విభాగాలు.. 157 పేపర్లు

సీయూఈటీ–పీజీ పరీక్షను మొత్తం ఆరు విభాగాల్లో 157 పేపర్లలో నిర్వహించనున్నారు. కామన్ విభాగంగా 22 సబ్జెక్ట్‌లు; లాంగ్వేజెస్ విభాగంలో 41 సబ్జెక్ట్‌లు; సైన్స్ విభాగంలో 30 సబ్జెక్ట్‌లు; హ్యుమానిటీస్ విభాగంలో 26 సబ్జెక్ట్‌లు; ఎంటెక్/హయ్యర్ సైన్సెస్ విభాగంలో 12 సబ్జెక్ట్‌లు; ఆచార్య విభాగంలో 26 సబ్జెక్ట్‌లలో పరీక్ష పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు పీజీలో ఏ స్పెషలైజేషన్‌లో చేరాలనుకుంటున్నారో దానికి సంబంధించిన పేపర్‌లో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

గరిష్టంగా నాలుగు పేపర్లు

విద్యార్థులు గరిష్టంగా నాలుగు సబ్జెక్ట్ పేపర్లలో పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నారు. బ్యాచిలర్ డిగ్రీలో తాము చదివిన సబ్జెక్ట్‌లు, వాటికి పీజీలో సరితూగే స్పెషలైజేషన్లకు సంబంధించిన పేపర్ల పరీక్షకు హాజరయ్యే వీలుంది.



జనరల్ విభాగం తొలగింపు

సీయూఈటీ–పీజీ–2024లో ప్రధాన మార్పు.. జనరల్ విభాగాన్ని తొలగించడం. గతేడాది ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి పార్ట్–ఎలో జనరల్ టెస్ట్‌ను నిర్వహించారు. పార్ట్–బిలో సబ్జెక్ట్ ప్రశ్నలను అడిగారు. ఈ ఏడాది జనరల్ టెస్ట్ విభాగం లేదని పేర్కొన్నారు. దీంతో.. పేపర్‌లో ప్రశ్నలన్నీ సబ్జెక్ట్‌కు సంబంధించినవే అడిగే అవకాశముంది.

75 ప్రశ్నలు.. 300 మార్కులు

- సీయూఈటీ–పీజీ పరీక్షలో ప్రతి పేపర్/సబ్జెక్ట్‌లో 75 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించే సమయం 1 గంట 45 నిమిషాలు.
- పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్/ హిందీ మీడియంలలోనే పరీక్ష ఉంటుంది. ఎంటెక్/హయ్యర్ సైన్సెస్‌కు ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తారు. ఆచార్య విభాగంలోని కోర్సులకు సంబంధించి హిందూ స్టడీస్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, బుద్ధ దర్శన్ మినహా అన్ని పేపర్లు సంస్కృతంలో ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

మలి దశలో.. వేర్వేరుగా దరఖాస్తు

సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడిగా సీయూఈటీ–పీజీని నిర్వహిస్తున్నప్పటికీ.. ఆయా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల సమయంలో విద్యార్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సదరు యూనివర్సిటీలు అడ్మిషన్ నోటిఫికేషన్లు విడుదల చేశాక.. సీయూఈటీ–పీజీ స్కోర్‌ను పేర్కొంటూ దరఖాస్తు చేసుకోవాలి. ఇలా.. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. సీయూఈటీ–పీజీ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటూ.. పీజీ ప్రవేశాలను ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జనవరి 24
- దరఖాస్తు సవరణ చివరి తేదీ: 2024, జనవరి 29
- టెస్ట్ సెంటర్ సమాచారం వెల్లడి: 2024,మార్చి 4
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2024, మార్చి 7
- సీయూఈటీ–పీజీ తేదీలు: మార్చి 11 నుంచి మార్చి 28 వరకు (ప్రతి రోజు మూడు షిఫ్ట్‌లలో పరీక్ష. మొదటి షిఫ్ట్ 9 నుంచి 10:45 వరకు; రెండో షిఫ్ట్ 12:45 నుంచి 2:30 వరకు; మూడో షిఫ్ట్ 4:30 నుంచి 6:15 వరకు);
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://pgcuet.samarth.ac.in/index.php/site/index

రాత పరీక్షలో రాణించేలా

- సీయూఈటీ–పీజీలో రాణించాలంటే.. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా డొమైన్ స్పెసిఫిక్ సబ్జెక్ట్‌ల కోసం బ్యాచిలర్ డిగ్రీతోపాటు ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి వరకూ పుస్తకాలను సంపూర్ణంగా చదవాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి.
- జనరల్ పేపర్‌కు హాజరయ్యే అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇక.. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థగణిత అంశాలు, కోడింగ్–డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై అవగాహన అవసరం.
- ఎంటెక్/హయ్యర్ సైన్స్ పేపర్ల అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో అభ్యసనం సాగించడం ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ఆయా ఫార్ములాలు, బేసిక్స్, సిద్ధాంతాలు, వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయిస్తున్న విధానంపై అవగాహన ఏర్పరచుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. సైన్స్ విభాగం అభ్యర్థులు కూడా ఇదే తరహా ప్రిపరేషన్ సాగిస్తే మంచి స్కోర్ సాధించొచ్చు.
- లాంగ్వేజెస్ అభ్యర్థులు లిటరేచర్, పొయెట్రీ, కవులు, కాంప్రహెన్షన్, గ్రామర్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హ్యుమానిటీస్ విద్యార్థులు తమ సబ్జెక్ట్‌లకు సంబంధించి కోర్ అంశాలతోపాటు.. సమకాలీన పరిణామాలపైనా అవగాహన పొందాలి. అదే విధంగా కోర్ సబ్జెక్టులను తాజా పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ముఖ్యంగా సోషియాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఫిలాసఫీ, ఆంత్రోపాలజీ, జాగ్రఫీ సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

టెస్ట్ ప్రాక్టీస్ సెంటర్స్

అభ్యర్థులకు సీయూఈటీ విధానం, అదే విధంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌పై అవగాహన కల్పించేందుకు ఎన్‌టీఏ.. టెస్ట్ ప్రాక్టీస్ సెంటర్స్ సదుపాయాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ ప్రాక్టీస్ సెంటర్లలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ద్వారా పరీక్షలో అడిగే ప్రశ్నల తీరుపై అవగాహన పొందొచ్చు.

220కు పైగా స్కోర్‌తో

జేఎన్‌యూ, డీయూ, బీహెచ్‌యూ వంటి ప్రముఖ యూనివర్సిటీల్లో పీజీ ప్రోగ్రామ్‌లకు సైతం సీయూఈటీ స్కోర్‌నే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇలాంటి ప్రసిద్ధ యూనివర్సిటీల్లో ప్రవేశాలు ఖరారు చేసుకోవాలంటే.. సీయూఈటీలో 220కు పైగా స్కోర్ సాధించేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 190కు పైగా మార్కులు సాధిస్తే టాప్ వర్సిటీల్లో ప్రవేశం లభిస్తుందని పేర్కొంటున్నారు.

క్లుప్తంగా...

మూడో టీఎంసీ విషయంలోనూ విచారణ జరపాలి



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని, కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ విషయంలో సమగ్రమైన విచారణ జరపాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాయడం స్వాగతిస్తున్నామని చెప్పారు. కంప్యూటర్ల మాయంపై కూడా విచారణ జరపాలని కోరారు. ఈ–రేస్ రద్దుపై కేటీఆర్ వెంటనే స్పందించి, ఇది తిరోగమన చర్య అనడం ఆశ్చర్యమని ఎద్దేవా చేశారు.

ధరణిని ఎత్తేయాలి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: ధనవంతులకే లాభం కలిగించే ధరణిని ఎత్తేయాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. ధరణిపై అధ్యయన కమిటీ వేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ధరణి పోర్టల్‌తో భూములు అన్యాక్రాంతం అయ్యాయని, కీసర ఔటర్ రింగ్‌రోడ్డు అనుమతుల్లో పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం టెంపుల్: మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 12న ఉదయం 8.30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. 13 నుంచి స్వామి, అమ్మవార్లకు విశేష వాహన సేవలు నిర్వహిస్తారు. 13న భృంగి వాహన సేవ, 14న రావణ వాహన సేవ, 15న నంది వాహన సేవ, బ్రహ్మోత్సవ కల్యాణం, 16న కైలాస వాహన సేవ, 17న పూర్ణాహుతి, 18న అశ్వావాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం జరుగుతాయి. మకర సంక్రాంతి రోజున స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు రుద్ర హోమం, చండీ హోమం, మృత్యుంజయ హోమం, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంత సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈ నెల 14న భోగి రోజున దేవస్థానం ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక భోగి పండ్ల కార్యక్రమం, 15న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు.

ఏపీలో గ్రూప్‌–2 పోస్టుల దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్‌–2 పోస్టుల భర్తీకి డిసెంబర్ 7న నోటిఫికేషన్ ఇచ్చిన ఏపీపీఎస్సీ.. దరఖాస్తు గడువును మరో వారం రోజుల పాటు పొడిగించింది. వాస్తవానికి బుధవారంతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ తేదీలో మార్పు లేదని, ముందుగా ప్రకటించిన ఫిబ్రవరి 25నే పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడవచ్చని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ శిక్షణ ఏర్పాట్లపై అధికారుల దృష్టి



సాక్షి, హైదరాబాద్: కానిస్టేబుల్ అభ్యర్థుల శిక్షణ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన 15,750 మంది అభ్యర్థుల జాబితాను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి గతంలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రశ్నపత్రంలో తప్పులపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవల హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం అభ్యంతరాలున్న ప్రశ్నలపై నిపుణుల కమిటీల ఏర్పాటుతోపాటు నాలుగు వారాల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సూచించిన నేపథ్యంలో ఆ ప్రక్రియ మళ్లీ ఊపందుకుంది. అందుకు అనుగుణంగా అభ్యర్థుల శిక్షణ ఏర్పాట్లపై పోలీస్ ఉన్నతాధికారులు ఫోకస్ పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 29 పోలీసు శిక్షణా సంస్థల్లో ఇప్పటికే మౌలిక వసతుల ఏర్పాట్లు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.17.20 కోట్లతో పనులు పూర్తి చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, వీలైనంత త్వరగా శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని సమాచారం.

'భయో' ఫెర్టిలైజర్



రైతులకు భారంగా గోల్డ్ కంపోస్ట్

- బలవంతంగా అంటగడుతున్న మార్క్‌ఫెడ్.. ప్యాక్స్‌లపై ఒత్తిడి తెస్తూ అధిక ధరలకు విక్రయం
- మార్క్‌ఫెడ్ పేరును వాడుకునేలా.. అనుమతి ఇవ్వడంపై విమర్శలు

కొత్త ప్రభుత్వం దృష్టిసారించాలన్న విన్నపాలు

తమకు భారంగా మారిన గోల్డ్ కంపోస్ట్ ఎరువుల ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్నారు. గ్రోమోర్ వంటి కంపెనీ ఉండగా, నిజామాబాద్ జిల్లాలో ఒక మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన కంపెనీకి ప్రాధాన్యం ఇవ్వడంపైనా విమర్శలున్నాయి. ఏ ప్రమాణాల ప్రకారం ఆ కంపెనీతో అవగాహనకు వచ్చారో కొత్త ప్రభుత్వం దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

సాక్షి, హైదరాబాద్

బయో ఫెర్టిలైజర్ పేరిట బలవంతంగా 'గోల్డ్ కంపోస్ట్'తమకు అంటగడుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇష్టం లేకపోయినా తప్పనిసరి కొనాల్సిందేనని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్) ఒత్తిడి తెస్తున్నాయని చెబుతున్నారు. బహిరంగ మార్కెట్లో బహుళజాతి కంపెనీలు తక్కువ ధరకు ఇస్తున్నా, గోల్డ్ కంపోస్ట్‌ను అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రోమోర్ కంపెనీకి చెందిన బయో ఫెర్టిలైజర్ 40 కేజీల బస్తా రూ. 300 వరకు మార్కెట్‌లో ఉండగా, స్థానికంగా రాష్ట్రంలో తయారయ్యే 'మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్'ధర మాత్రం ఏకంగా రూ. 472 ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ నుంచి ఒత్తిడి పెరగడంతో ప్యాక్స్‌లు గోల్డ్ కంపోస్ట్‌ను కొనుగోలు చేయక తప్పడంలేదు. అయితే రైతులు కొనుగోలు చేయనిచోట ఆ మేరకు ప్యాక్స్‌ల వద్దే నిల్వ ఉండిపోతున్నాయి. గత వానాకాలం సీజన్ నుంచి పూర్తిస్థాయిలో దీనిని రైతులకు అందుబాటులోకి తీసుకురావడంతో అప్పటినుంచి ఈ ఫెర్టిలైజర్‌ను అంటగట్టే పనిలో మార్క్‌ఫెడ్ నిమగ్నమైంది. జిల్లాల్లోని మార్క్‌ఫెడ్ మేనేజర్లకు ఇండెంట్ పెట్టి మరీ దీనిని విక్రయిస్తున్నారు. దీంతో రైతులు, డీలర్లు, ప్యాక్స్ నిర్వాహకులు లబోదిబోమంటున్నారు.

బయో ఫెర్టిలైజర్ వ్యాపారంలోకి అడుగుపెట్టాలని గతేడాది మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. పంటలకు రసాయన ఎరువులను తగ్గించేందుకు 'మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్'పేరుతో సేంద్రియ ఎరువును మార్కెట్లోకి తీసుకొచ్చింది. వరి, మొక్కజొన్న, పత్తితోపాటు ఉద్యాన పంటలకూ వినియోగించేలా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో విశ్వ ఆగ్రోటెక్ ఆధ్వర్యంలో పెద్ద ప్లాంట్ నిర్మించి దీనిని తయారు చేస్తున్నారు. ఈ సంస్థతో మార్క్‌ఫెడ్ ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలతోపాటు

టెండర్లు లేకుండానే ఒప్పందం...

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ వీటిని రైతులకు అందుబాటులో ఉంచాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ సేంద్రియ ఎరువును వరి, టమాటా, మిరప, మామిడి, బత్తాయి, నిమ్మ, నారింజ, అరటి, డ్రాగన్ ఫ్రూట్ సహా అన్నిరకాల పూలతోటలు, ఆయిల్‌పామ్, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, పసుపు, చెరకు పంటలకు ఉపయోగించడం వల్ల నేల సారవంతమవుతుందని, అధిక దిగుబడి వస్తుందని మార్క్‌ఫెడ్ చెబుతోంది. అయితే ఇలాంటి సేంద్రియ ఎరువులకు ప్రసిద్ధి చెందిన అనేక కంపెనీలు జాతీయస్థాయిలో చాలా ఉన్నాయి. అవన్నీ ఉన్నప్పుడు విశ్వ ఆగ్రోటెక్‌తో ఒప్పందం చేసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. టెండర్ పిలవకుండా ఏకంగా 'మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్'పేరుతో దానికి నామకరణం చేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. ఒక ప్రైవేట్ కంపెనీని ప్రమోట్ చేయడానికి ప్రభుత్వానికి చెందిన మార్క్‌ఫెడ్ పేరును ఉపయోగించుకోవడంపై ఉద్యోగులు, కొందరు అధికారుల్లోనూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ సంబంధిత కంపెనీ పేరు పెట్టుకుంటే సరేననుకోవచ్చు. అంతేకానీ మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్ అని నామకరణం ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. తమకున్న అధికారాన్ని ఉపయోగించుకొని మార్క్‌ఫెడ్ బోర్డులో ఆమోదం తెలుపుకోవడంపైనా ఆరోపణలు ఉన్నాయి. మార్క్‌ఫెడ్‌లో ఒక ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధి సహా కొందరు పెద్దస్థాయి వ్యక్తులకు ఇందులో భాగస్వామ్యం ఉందన్న ఆరోపణలూ ఉన్నాయి. ఆ కంపెనీతో వారికి లోపాయికారీ సంబంధాలు ఉన్నాయన్న చర్చా జరుగుతోంది. అందుకే టెండర్లు లేకుండానే ఒప్పందం చేసుకొని మార్కెట్లోకి ప్రవేశపెట్టారని చెబుతున్నారు. అంతేకాదు అధిక ధరకు విక్రయించడంపై రైతులు, డీలర్లు, ప్యాక్స్ నిర్వాహకులు మండిపడుతున్నారు.

> **కొనాలని ఒత్తిడి చేయడం లేదు**
> మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్‌ను కొనుగోలు చేయాలని ప్యాక్స్‌లు, డీలర్లపై ఒత్తిడి చేయడం లేదు. ప్యాక్స్‌లకు పంపిస్తున్నామంతే. రైతులు తమకు ఇష్టమైన వాటిని కొనుగోలు చేయవచ్చు. మార్కెట్‌లో కంటే మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్ట్ బయో ఫెర్టిలైజర్ ఎక్కువ ధర ఉందనే విషయంపై పరిశీలన చేస్తాం.
> – విష్ణువర్ధన్‌రావు, జనరల్ మేనేజర్, మార్క్‌ఫెడ్

అంతా సీక్రెట్‌గానే విచారణ

రెండో రోజూ కాళేశ్వరంపై కొనసాగిన విజిలెన్స్ సోదాలు

కాళేశ్వరం/తిమ్మాపూర్/జ్యోతినగర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు, సోదాలు రెండో రోజు బుధవారం కూడా సీక్రెట్‌గానే కొనసాగుతున్నాయి. మంగళవారం ఏకకాలంలో 10 చోట్ల ఇరిగేషన్ శాఖ కార్యాలయాలు, బ్యారేజీలు, పంపుహౌస్‌ల్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం ఉదయంనుంచి మహదేవపూర్‌లోని డివిజన్ ఇరిగేషన్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్‌లకు సంబంధించిన కీలక రికార్డులను సీజ్ చేసి పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అధికారులను బయటకు పంపకుండా ఇరిగేషన్ ఏఈఈ, డీఈఈ, ఈఈల నుంచి బ్యారేజీ పూర్వపరాలు, రికార్డుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. విచారణ రహస్యంగా జరుగుతోంది. దీనిపై అధికారులు పెదవి విప్పడం లేదు. పోలీసులు ఇరిగేషన్ కార్యాలయం వద్ద పహారాలో ఉన్నారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ జేసీ రాజు

పలు రికార్డులు స్వాధీనం

విజిలెన్స్ అధికారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండో రోజూ కూడా ఎల్ఎండీ, నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి, నాణ్యత నియంత్రణ, తనిఖీ విభాగం నంబర్–9 కార్యాలయాల్లో సోదాలు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జేసీ రాజు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. కీలక రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి తెలిపారు.

కాళేశ్వరంపై విచారణతో బీఆర్ఎస్‌కు దడ

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం



కరీంనగర్ కార్పొరేషన్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరుగుతుంటే బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో దడ పుడుతోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తప్పు చేయకపోతే విచారణను ఆహ్వానించి, తమ దగ్గర ఉన్న వాస్తవ సమాచారాన్ని విజిలెన్స్‌కు ఇవ్వాలని హితవు పలికారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్ట్ తొమ్మిది నెలలు కూడా ఉపయోగపడలేదన్నారు. తాను సచ్చీలుడని, నీతివంతుడినని, గొప్పోడినని భావించే మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అక్రమంగా ఉద్యోగాలు పొందిన వాళ్లతో సంబంధాలు లేకపోతే స్వయంగా తానే పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణకు ముందుకు రావాలని సూచించారు. తనను నియమించిన కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని పొన్నం ధ్వజమెత్తారు.

రాజస్థాన్ నుంచి సిటీకి హెరాయిన్ సరఫరా

- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

మైనర్ల డ్రగ్స్ దందా



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలను తరలిస్తున్న అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.50 లక్షలు విలువ చేసే 80 గ్రాముల హెరాయిన్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ మురళీధర్‌తో కలిసి రాచకొండ సీపీ సుధీర్‌బాబు బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాకు చెందిన అశోక్ కుమార్ స్థానిక కళాశాలలో బీ– ఫార్మసీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ స్నేహితులు. వీరిద్దరూ మాదక ద్రవ్యాలకు బానిసయ్యారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ఇరువురూ క్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో రాజస్థాన్‌లోని ఓ డ్రగ్ సప్లయర్‌తో వీరికి పరిచయం ఏర్పడింది. ఇతని నుంచి గ్రాము హెరాయిన్ రూ.5–6 వేల చొప్పున కొనుగోలు చేసి.. దానినిహైదరాబాద్‌కు తరలించి కస్టమర్లకు రూ.10–12 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సరుకును తరలించే క్రమంలో దుస్తుల మధ్యలో హెరాయిన్ పెట్టి ప్యాక్ చేసి ప్రైవేట్ బస్సులో ప్రయాణం చేస్తుంటారు. సరుకు చేరుకున్న తర్వాత స్థానికంగా విద్యార్థులకు, ఉద్యోగస్తులకు గ్రాముల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటారు. స్థానికంగా ర్యాపిడో, ఓలా, ఉబర్ వంటి బైక్ ట్యాక్సీలను బుకింగ్ చేసి సరుకును డెలివరీ చేస్తుంటారు.

- బుధవారం సరుకుతో సహా రాజస్థాన్ నుంచి సిటీకి చేరిన నిందితులు హయత్‌నగర్ పీఎస్ పరిధిలోని సత్య పార్కింగ్ యార్డ్ ప్రాంతాలకు చేరే సరికి.. అప్పటికే విశ్వసనీయ సమాచారం అందుకున్న హయత్‌నగర్, ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

కేసీఆర్ రక్తాన్ని, చెమటను ధారపోశారు

▶ మొదటి పేజీ తరువాయి

ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. 'పరిపాలనపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించి పార్టీకి కొంత తక్కువ సమయాన్ని కేటాయించాం. పార్టీ పరంగా లోపాలు సమీక్షించుకుని లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేస్తాం. ప్రజలను మనల్ని పూర్తిగా తిరస్కరించలేదనే విషయాన్ని గుర్తుంచుకుని ముందుకు పోదాం'అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

త్వరలో శిక్షణ తరగతులు

'బీఆర్ఎస్‌ను ఊడేస్తామని కొందరంటున్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది. పార్టీని ఏకతాటిపైకి తెచ్చేందుకు త్వరలో శ్రేణులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం. పార్టీ కేడర్‌కు ఇకపై తెలంగాణ భవన్‌లో సీనియర్ నేతలతో పాటు నేనూ అందుబాటులో ఉంటా. ఇకపై తెలంగాణ భవన్ మా అడ్డా. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతోంది. తప్పుడు కేసుల బాధితులకు పార్టీ లీగల్ సెల్ అండగా నిలబడుతుంది. కేసులకు భయపడేది లేదు. తప్పుడు కేసులను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సీరియస్‌గా తీసుకుని పోరాడాలి. పార్టీలో ఎవరిపై కేసులు పెట్టినా పార్టీ యంత్రాంగం అంతా సమష్టిగా స్పందించాలి'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

గ్యారంటీలను గుర్తు చేస్తూనే ఉండాలి

'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారంటీలతో సహా అన్నీ 420 హామీలనే విషయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేస్తూనే ఉండాలి. ప్రజలను మోసం చేయాలని అనుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి అసలు సినిమా ముందుంది. కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ఆ పార్టీ ఇచ్చిన 420 హామీలతోనే ఎండగట్టాలి. రాజకీయ అక్కసుతో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ రద్దు చేస్తున్న నేపథ్యంలో అసంతృప్తితో ఉన్న పేద గొంతుకలకు మనం అండగా నిలబడాలి''అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పార్టీ నిర్మాణంపై సమీక్ష జరగనందునే ఓటమన్న శ్రేణులు

కాగా ఈ సమీక్షలో పలువురు నాయకులు, కార్యకర్తలు తమ ఆవేదన వెళ్లగక్కారు. 2014 నుంచీ పార్టీ నిర్మాణంపై ఎలాంటి సమీక్ష జరగనందునే ఓటమి పొందామని పలువురు నేతలు వ్యాఖ్యానించారు. కింది స్థాయిలో ఏం జరుగుతుందో పార్టీ అధినేతకు చెప్పే ధైర్యం ఎమ్మెల్యేలు చేయలేదని, కాంగ్రెస్‌ను వదిలి బీజేపీని లక్ష్యంగా చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ సమావేశానికి వచ్చిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరుకు చెందిన శ్రీనివాస్ కాలుపై నుంచి ఎంపీ కేశవరావు కారు వెళ్లింది. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి కేశవరావు దగ్గరుండి చికిత్స చేయించారు.

గ్యారంటీల అమల్లో అనుమానాలు: కడియం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై అనేక అనుమానాలు ఉన్నాయని, కర్ణాటకలో గ్యారంటీల అమలు సాధ్యం కాదని అక్కడి సీఎం సలహాదారు చెప్పారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్యారంటీలతో పాటు రైతు రుణమాఫీ, రైతుబంధు, మహాలక్ష్మి పథకం తదితరాల అమలుపై సీఎం, డిప్యూటీ సీఎంకే స్పష్టత లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై శ్వేతపత్రాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫార్ములా వన్ రేస్ నిధులు దుర్వినియోగమైతే ప్రభుత్వం విచారణ చేసుకోవచ్చని, రద్దు చేయడం సరికాదని కడియం అన్నారు.

కాళ్లతోనే బొమ్మలు వేస్తూ.. కంప్యూటర్ ఎంట్రీ చేస్తూ...

ఆత్మవిశ్వాసంతో ఆదర్శంగా నిలుస్తున్న జాకీర్ పాషా



చేతులు లేకున్నా చెక్కుచెదరలేదు

కాగజ్‌నగర్‌టౌన్: పుట్టుకతోనే చేతులు లేకపోయినా ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. కాళ్లవేళ్లే కుంచగా మారి అందమైన బొమ్మలెన్నో వేశాయి..కంప్యూటర్ కీ బోర్డుపై టక్‌టక్ శబ్దం వినిపిస్తూ ఎన్నో ఎంట్రీలు చేశాయి. ఆర్థిక ఇబ్బందులెన్ని ఎదురైనా నిరుత్సాహపడకుండా పీజీ వరకూ చదివి ఎందరికో ఆదర్శంగా నిలిచాడు జాకీర్‌పాషా. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఆటో డ్రైవర్ షేక్ బాబా–మెహరా దంపతుల మొదటి సంతానమైన జాకీర్ పాషా డిగ్రీ వరకు కాగజ్‌నగర్‌లోనే చదివాడు. ఆపై నాగార్జున యూనివర్సిటీ నుంచి పీజీ పట్టా అందుకున్నాడు. పీజీ చదువుతుండగానే కంప్యూటర్ కోర్సులు కూడా పూర్తి చేశాడు.

- జాకీర్‌పాషా కాళ్లతో పెయింటింగ్స్ వేయడమే కాకుండా.. ఆ వీడియోలను యూట్యూబ్, ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు.
- హరితహారం కార్యక్రమంలో వందలాది మొక్కలను కాళ్ల సాయంతో నాటి ఆదర్శంగా నిలిచాడు.
- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా కేంద్రానికి వెళ్లి కాలి సాయంతో ఓటుహక్కు వినియోగించుకున్నాడు.
- తాజాగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో అభయహస్తం దరఖాస్తుల డేటా ఎంట్రీకి పలువురు ఆపరేటర్లను ఎంపిక చేశారు. అందులో జాకీర్‌పాషాకు అవకాశం దక్కింది. కాళ్లతోనే వివరాలను అప్‌లోడ్ చేస్తున్నాడు.

రుణం రాలేదు.. కొలువూ దొరకలేదు

గత నవంబర్‌లో తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ ద్వారా వెలువడిన రుణాల కోసం జాకీర్‌పాషా దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటివరకు మంజూరు కాలేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన కొలువు ఇప్పించాలని పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందించాడు. ఇటీవల హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సైతం కొలువు ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు సమర్పించాడు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపు

మాది నిరుపేద కుటుంబం. నాతోపాటు ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు. నాన్న ఆటో నడిపితే వచ్చే డబ్బు ఇంటి ఖర్చులకే సరిపోతున్నాయి. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నా. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగావకాశం కల్పిస్తే ఆర్థిక సమస్యలు దూరమవుతాయి. దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే నా కుటుంబానికి మేలు జరుగుతుంది.

– జాకీర్ పాషా, దివ్యాంగుడు

ప్రీ కోవిడ్ పీరియడ్‌కు కొనుగోళ్లు!

సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా వినియోగదారుల కొనుగోళ్ల సెంటిమెంట్ క్రమంగా మెరుగవుతోందని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం (సీఎంఐఈ) అంచనా వేసింది. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో 2020 మార్చిలో లాక్‌డౌన్ విధించడానికి ముందున్న రోజుల నాటికి ప్రస్తుత కొనుగోళ్ల డిమాండ్ చేరుకుంటున్నట్టు పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు మరింత మెరుగ్గా ఉన్నాయని తెలిపింది. కరోనా కాలంలో మూడేళ్ల తొమ్మిది నెలల పాటు కొనసాగిన మార్కెట్ అమ్మకాల ఎగుడు దిగుళ్లకు నెమ్మదిగా తెరపడే అవకాశాలున్నాయనే ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు 2024లో త్వరగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల (ఎఫ్ఎంసీజీ) అమ్మకాల పెరుగుదలలో గ్రామీణ ప్రాంతాలే కీలకంగా మారనున్నట్టు వివిధ కంపెనీలు, మార్కెటింగ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. కరోనా వ్యాప్తికి ముందు 2020 ఫిబ్రవరిలో నమోదైన అమ్మకాలతో పోలిస్తే 2023 డిసెంబర్‌లో నమోదైన అమ్మకాలు ఎక్కువగా ఉన్నట్టు సీఎంఐఈ (ఇండెక్స్ ఆఫ్ కన్స్యూమర్ సెంటిమెంట్స్ ఫర్ డిసెంబర్–2023) వెల్లడించింది. దేశం మొత్తంగా సూచీ విలువ (ఓవరాల్ ఇండెక్స్ వాల్యూ) 2023 డిసెంబర్‌లో 106.74 పాయింట్లతో (2020 ఫిబ్రవరిలో 105.32 పాయింట్లు) స్వల్పంగా మెరుగుపడినట్లు సీఎంఐఈ తెలిపింది. పట్టణ ప్రాంతాల్లోని కుటుంబాలకు సంబంధించి తక్కువ విలువ నమోదు కాగా, గ్రామీణ భారతం విషయానికొస్తే.. 2019 డిసెంబర్‌తో పోల్చితే అత్యధిక స్థాయికి అంటే 109.12 పాయింట్లకు చేరుకుందని పేర్కొంది. గత వర్షాకాలం సీజన్‌లో వర్షాలు బాగా కురవడం, పంటలు బాగా పండడం గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల ప్రభావం చూపించిందని అంచనా వేసింది. అయితే అల్పాదాయ వర్గాలు (ఏడాదికి రూ.లక్ష లోపు సంపాదన) ఇంకా కోలుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. రూ.5 లక్షల నుంచి 10 లక్షల లోపు ఉన్న ఆదాయవర్గాల్లో సూచీ విలువ అధికంగా ఉన్నట్టుగా పేర్కొంది.

పరిస్థితి క్రమంగా మెరుగవుతోందన్న సీఎంఐఈ

- పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగు
- మార్కెట్ అమ్మకాల ఎగుడుదిగుళ్లకు క్రమంగా తెరపడే అవకాశం

మొత్తంగా పరిస్థితి అంత మెరుగవలేదు

సీఎంఐఈ పరిశీలనను బట్టి చూస్తే పట్టణ ప్రాంతాల్లో ఇంకా పూర్తిస్థాయిలో పరిస్థితి మెరుగవలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పంటలు చేతికి రావడం వంటి సానుకూల పరిణామాలతో కొనుగోళ్లు పెరుగుతాయి. అయితే అక్కడా ఎగుడు, దిగుళ్లు సహజమే. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి లెక్కలు వేయడం వల్ల కచ్చితమైన అంచనాలు సాధ్యమయ్యే అవకాశాలు లేవు. అయితే వర్షాల విషయంలో ప్రాంతాల వారీగా అసమానతలు, హెచ్చుతగ్గులున్నాయని సీఎంఐఈ పేర్కొంది. మొత్తంగా చూస్తే మాత్రం పరిస్థితి పూర్తిగా మెరుగుపడినట్టుగా భావించలేం.

– డి.పాపారావు, ఆర్థిక రంగ విశ్లేషకుడు

నల్లగొండలో నాలుగు రహదారుల విస్తరణకు రూ.100 కోట్లు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

తొలి హామీని నిలబెట్టుకున్న మంత్రి కోమటిరెడ్డి




సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా రోడ్లకు ఇక మహర్దశ పట్టినట్టే. మంత్రిగా కోమటిరెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం చేసిన నాలుగు రహదారుల విస్తరణ ప్రతిపాదనలకు రూ.100 కోట్లతో బుధవారం పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం జీఓనంబరు 22 విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో సంప్రదింపులు జరిపి అనుమతులు వచ్చేలా చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగు ప్రతిపాదిత రహదారులపై నల్లగొండ జిల్లా ప్రజలు నిత్యం నరకం చూసినా, గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఎందరో యువకులు ఈ రహదారులపై ప్రమాదాల్లో చనిపోతుంటే తన మనసు చలించిపోయిందని, ఇదే విషయం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి వివరించి.. కాంగ్రెస్ పార్టీని ఆదరించిన నల్లగొండ జిల్లా ప్రజల రుణం తీర్చుకోవటానికి ఈ నాలుగు రోడ్లను నెల రోజుల్లో మంజూరు చేయించినట్టు తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో పూర్తి చేసి జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటానని, తానే స్వయంగా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తానని తెలిపారు.



రెండు వరుసలుగా మారే రోడ్లు ఇవే...

- నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో 1 కిలోమీటర్ రోడ్డు
- నల్లగొండ టు ముషంపల్లి వరకు 12 కిలోమీటర్లు
- ముషంపల్లి టు కన్నెకల్ వయా ధర్మపురం వరకు 6.2 కి.మీ
- ముకుందాపురం టు తిప్పర్తి వరకు 8.5 కి.మీ



క్లుప్తంగా...

తెలంగాణ ఎక్స్‌ప్రెస్ సమయంలో మార్పు

నాంపల్లి (హైదరాబాద్): నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు సమయాన్ని అధికారులు రీషెడ్యూల్ చేశారు. నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఉదయం 11 గంటలకు బయల్దేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని వెల్లడించారు.

'వ్యూహం' వాదనలు నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో వాదనలను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా బుధవారం విచారణ చేపట్టారు. అసలు పిటిషన్ దాఖలు చేసే అర్హతే పిటిషనర్‌కు లేదని, రిట్ పిటిషన్ మెయింటెనబుల్ కాదని నిర్మాత, దర్శకుడి తరఫు సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపించారు.

ఓయూ న్యాయశాస్త్రం కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 23 నుంచి న్యాయశాస్త్రం వివిధ కోర్సుల పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్‌తో పాటు ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, బీకాం ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ రెగ్యులర్ కోర్సుల సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను ఓయూ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు.

రేపటి నుంచి 18 వరకు ఓయూ హాస్టళ్ల మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: సంక్రాంతి సెలవుల కారణంగా 12వ తేదీ నుంచి 18 వరకు ఓయూ హాస్టళ్లను మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఓయూ పరిధిలో కళాశాలలకు సెలవులు ప్రకటించినందున వసతి గృహాలతో పాటు భోజనశాలలకు సెలవు ప్రకటించారు.

వైద్యులపై దాడుల్ని అరికట్టాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్ అధ్యక్షుడు డాక్టర్ చల్లగాలి ప్రభుకుమార్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో హైదరాబాద్‌లో జరిగే ఐఎంఏ సమావేశాలకు వారిని ఆహ్వానించారు. కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పనిచేసి ఉత్తమ సేవలు అందించిన వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి దామోదర హామీ ఇచ్చారని ప్రభుకుమార్ వెల్లడించారు.

పట్టాలు తప్పిన 'చార్మినార్ ఎక్స్‌ప్రెస్'

నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రమాదం

- ఏడుగురికి గాయాలు... లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో చికిత్స
- సహాయక చర్యల్లో భాగంగా పలు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దు
- సాయంత్రానికి యథావిధిగా సాధారణ రైళ్ల రాకపోకలు

హైదరాబాద్ (నాంపల్లి): చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు నాంపల్లి స్టేషన్‌లో పట్టాలు తప్పింది. ఈ ఘటనలో మూడు బోగీలు దెబ్బతినగా, ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. తాంబరం(చెన్నై) రైల్వేస్టేషన్ నుంచి వచ్చే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతిరోజూ ఉదయం 6.15 గంటలకు నాంపల్లి రైల్వేస్టేషన్‌లోని 5వ నంబరు ప్లాట్‌ఫారంపైకి చేరుకుంటుంది. కానీ బుధవారం పొగమంచు కారణంగా ఉదయం 8.30 గంటలకు నాంపల్లి స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం–5 చేరాక..రైలు ఆగినట్టే ఆగి సాంకేతిక సమస్యతో నెమ్మదిగా డెడ్‌ఎండ్(గోడ)కు గుద్దుకుంది. దీంతో ఎస్2, ఎస్3, ఎస్6 బోగీలు పట్టాలు తప్పి దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లాలాగూడ రైల్వే ఆస్పత్రికి తరలించారు. చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు నాంపల్లి చివరి స్టేషన్ కావడం, చాలామంది ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోనే దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యింది. ఇదే సంఘటన నగరం బయట జరిగి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. చార్మినార్ రైలు ప్రమాద ఘటన తెలుసుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వీరితోపాటు సెల్ఫ్ ప్రొపెల్డ్ యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ అక్కడకు వచ్చింది. ప్రమాదం జరిగిన తీరును రైల్వే అధికారులు ఏజీఎం, చీఫ్ సేఫ్టీ కమిషనర్, ఏడీ ఆర్ఎం, డీఎస్ కోఆర్డినేషన్, ఏడీ ఆర్ఎం, సీనియర్ డీఐ సెక్యూరిటీ ఆఫీసర్, సీనియర్ సీడీఓ, సీపీఆర్వోతో పాటుగా రైల్వే అడిషనల్ డీజీపీ, రైల్వే ఎస్పీ, రైల్వే డీఎస్పీ, పలువురు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పరిశీలించారు. ప్రమాద వివరాలను లోకో పైలట్‌ను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న బోగీలను సంఘటనాస్థలం నుంచి తొలగించారు. సహాయక చర్యల్లో భాగంగా నాంపల్లి స్టేషన్ నుంచి లింగంపల్లికి నడిచే ఎంఎంటీఎస్ రైళ్ల రద్దు చేశారు. కాగా విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ వివరాలు తెలుసుకున్నారు. వెంటనే సహాయక చర్యల్లో పాల్గొనాలని అధికారులను ఆదేశించారు.


ప్రమాద స్థలంలో సహాయక చర్యల్లో సిబ్బంది

బాధితులకు నష్టపరిహారం చెల్లింపు

చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద బాధితులకు దక్షిణ మధ్య రైల్వే నష్టపరిహారం అందజేసింది. తీవ్రంగా గాయపడిన ప్రయాణికుడికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన ఆరుగురు ప్రయాణికులకు రూ.50 వేలు చొప్పున అందజేసినట్టు రైల్వే క్లెయిమ్స్ విభాగ అధికారులు పేర్కొన్నారు.

తక్షణమే పునరుద్ధరణ చర్యలు

దక్షిణమధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ధనుంజయులు నేతృత్వంలోని రైల్వే అధికారుల బృందం తక్షణ పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. ప్రమాదానికి గురైన కోచ్‌లను తిరిగి రీరైలింగ్ చేశారు. సాధారణ రైలు కదలికల కోసం ప్రభావితమైన ట్రాక్‌ను కూడా వెంటనే పునరుద్ధరించారు. సాధారణ రైళ్ల రాకపోకలపై ఈ ప్రమాదం ఎలాంటి ప్రభావం చూపలేదు. నాంపల్లి స్టేషన్ నుంచి బయలుదేరాల్సిన రైళ్లు సమయానుకూలంగా నడిచాయి. హైదరాబాదు–తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (హైదరాబాద్–తాంబరం) రైలు కూడా నిర్ణీత సమయానికి సరిగ్గా సాయంత్రం 6 గంటలకు నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరింది. రైలు ప్రమాద ఘటనపై దక్షిణ మధ్య మండలం రైల్వే సేఫ్టీ కమిషనర్ నేతృత్వంలో విచారణ చేపట్టనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ మీడియాకు తెలిపారు.

సాంకేతిక కారణాలతోనే గోడను గుద్దుకుంది

సాంకేతిక కారణాలతోనే చార్మినార్ రైలు ఆగాల్సిన చోట ఆగకుండా డెడ్ ఎండ్ గోడను ఢీకొట్టింది. ఆపాల్సిన చోట బ్రేకులు వేస్తే బండి నిలబడలేదు. ఇందులో నా తప్పేమీ లేదు. బ్రేకులు పడిఉంటే ప్రమాదం జరిగేది కాదు.
– వెంకటేశ్వరరావు, లోకో పైలట్

మిలాన్–2024@విశాఖ

- త్రీ 'సీ' థీమ్‌తో ఫిబ్రవరి 19–27 వరకు నిర్వహణ
- రెండోసారి ఆతిథ్యమిస్తున్న తూర్పు నౌకాదళం




సాక్షి, విశాఖపట్నం: మరో అంతర్జాతీయ విన్యాసాలకు వేదికగా నిలిచేందుకు విశాఖ సన్నద్ధమవుతోంది. 2022లో ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్–2022ని నిర్వహించిన విశాఖ.. తాజాగా మిలాన్ విన్యాసాలకు రెండోసారి ఆహ్వానం పలుకుతోంది. నౌకాదళ విభాగంలో కీలకమైన మిలాన్ కోసం భారీ ఏర్పాట్లు చేసేందుకు ఇండియన్ నేవీ ఏడాదిగా ప్రణాళిక రచిస్తోంది. మిలాన్‌కు భారత నౌకాదళం 50 దేశాలకు ఆహ్వానం పంపగా 38 దేశాలు పాల్గొంటున్నట్లు అంగీకారం తెలిపాయి. ఫిబ్రవరి 19 నుంచి 27 వరకు జరిగే మిలాన్‌లో కీలకమైన సిటీ పరేడ్ 22న ఆర్కే బీచ్‌లో జరగనుంది. మిలాన్ అంటే.. హిందీలో సమావేశం అని అర్థం. 2023లో మిలాన్ అండమాన్ నికోబార్ దీవుల్లో దీన్ని నిర్వహించారు. పలు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణంలో స్నేహ పూర్వక సత్సంబంధాల్ని మెరుగు పరచుకోవడంతో పాటు శత్రుసైన్యానికి బలం, బలగం గురించి తెలిపేందుకు ఈ విన్యాసాలు నిర్వహిస్తుంటారు. మిలాన్ బహుపాక్షిక విన్యాసాలకు భారత నౌకాదళం సారథ్యం వహించనుంది. ఈసారి కమరడెరీ (స్నేహం), కొహెషన్(ఐక్యత), కొలాబరేషన్ (సహకారం) థీమ్‌తో దీన్ని నిర్వహిస్తున్నారు. మిలాన్–2024 విన్యాసాలు సీ ఫేజ్, హార్బర్ ఫేజ్‌ల్లో నిర్వహిస్తారు. కాగా, 1995లో మిలాన్ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తొలిసారి జరిగిన విన్యాసాల్లో భారత్‌తో పాటు ఇండోనేసియా, సింగపూర్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలు పాల్గొన్నాయి. రెండేళ్లకోసారి నిర్వహించే మిలాన్‌లో ఏటా దేశాల సంఖ్య పెరుగుతోంది. 2005లో సునామీ కారణంతో మిలాన్ రద్దయింది. 2001, 2016ల్లో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలు వల్ల విన్యాసాలు జరగలేదు. 2010 వరకూ 8 దేశాలు మాత్రమే పాల్గొనగా.. 2012లో జరిగిన విన్యాసాల్లో దేశాల సంఖ్య రెట్టింపై 16 దేశాలు పాల్గొన్నాయి. 2014లో 17 దేశాలు పాల్గొని అతి పెద్ద ఫ్లీట్ రివ్యూగా చరిత్రకెక్కింది.

ఈసారి పాల్గొంటున్న దేశాలివే...

భారత్‌తో పాటు యూఎస్ఏ, రష్యా, జపాన్, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా, ఫ్రాన్స్, ఈజిప్ట్, శ్రీలంక, వియత్నాం, మొజాంబిక్, సూడాన్, ఇజ్రాయెల్, ఖతర్, థాయ్‌లాండ్, మలేసియా, సోమాలియా, కెన్యా, మయన్మార్, న్యూజిలాండ్, టాంజానియా, కొమరోస్, మాల్దీవులు, బ్రూనే, ఫిలిప్పీన్స్, సౌదీ అరేబియా, ఒమన్, కాంబోడియా, దక్షిణ కొరియా, కువైట్, ఇరాన్, మడగాస్కర్, బంగ్లాదేశ్, బహ్రెయిన్, యూఏఈ, జిబౌటీ, ఎరిత్రియా, మారిషస్, సీషెల్స్, ఫిజీ, టోంగా, టోగో, పెరూ మొదలైన 50 దేశాలకు భారత నౌకాదళానికి చెందిన ప్రతినిధులు ఆహ్వానాలు అందించారు.

● రాముడికి 'ఉడుతా భక్తి'గా..

నిర్మల్ ఖిల్లా: చూస్తుంటే మామూలు పెయింటింగ్‌లా కనిపిస్తోంది కదూ.. జాగ్రత్తగా గమనిస్తే బియ్యపు గింజలతో మలిచిన శ్రీరాముడి ప్రతిరూపం గోచరిస్తుంది. ఇంకా తీక్షణంగా పరిశీలిస్తే ఆ బియ్యపు గింజలపై కూడా తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో రామనామం కనిపిస్తుంది. అదీ ఈ చిత్రం ప్రత్యేకత. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ ప్రాంతానికి చెందిన బిట్లింగు రాజేంద్ర ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో ఈ కళాఖండాన్ని తీర్చిదిద్దారు. రాముడు ఉడుతను నిమురుతున్న ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో పూర్తి కానుందని తెలిపారు. అయోధ్య మందిరాన్ని కూడా రూపొందించనున్నట్లు రాజేంద్ర 'సాక్షి'కి తెలిపారు.


బియ్యపు గింజలపై 3 భాషల్లో రామనామం


రాజేంద్ర


తుదిరూపు దిద్దుకున్న శ్రీరాముడి చిత్రం ఇదే

ఓటర్ల జాబితాపై టీడీపీది బోగస్ ప్రచారమే!

కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలతో సుస్పష్టం

- పూర్తి స్వచ్ఛతతో ఓటర్ల జాబితా తయారు చేస్తున్నాం: సీఈసీ రాజీవ్‌కుమార్
- కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలతో సుస్పష్టం
- తెలంగాణలో ఓటుండి ఇక్కడ కూడా నమోదు చేస్తున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం
- రెండు చోట్ల ఓటు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్ కుమార్. పక్కన ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్ గోయల్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో దొంగ ఓట్ల నమోదు, గంపగుత్తగా ఓట్ల తొలగింపు, జీరో ఇంటి నంబర్‌పై ఓటర్ల నమోదు అంటూ తెలుగుదేశం పార్టీ, పచ్చ మీడియా చేసిన ప్రచారంలో వీసమెత్తు నిజం లేదన్న విషయం బట్టబయలైంది. రానున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్, కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ విజయవాడలో రెండు రోజుల సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల చేసిన ఫిర్యాదులు.. వాటిల్లోని వాస్తవాలను అంశాల వారీగా వివరించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ ఏమన్నారంటే..

పలు ఫిర్యాదులు, సూచనలు వచ్చాయి

గుర్తింపు పొందిన ఆప్, బీఎస్పీ, ఐఎన్సీ, టీడీపీ, వైఎస్సార్‌సీపీ వంటి పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు వచ్చి కలిశారు. పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించేస్తున్నారని, చనిపోయిన, డూప్లికేట్, ఒకే ఇంటి నంబర్‌పై 10 కంటే ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నంబర్ పేరున ఓట్లు అంటూ వివిధ అంశాలపై ఫిర్యాదు చేశారు.

- జనవరి 6, 2023 నుంచి ఆగస్టు 30, 2023 మధ్య తొలగించిన 21 లక్షల ఓట్లను జిల్లా ఎన్నికల అధికారులు పునఃసమీక్షించారు. ఆ 21 లక్షల ఓట్లలో 13,061 ఓట్ల విషయంలోనే తప్పులు దొర్లాయి. అంటే తొలగించిన మొత్తం ఓట్లలో ఇది కేవలం 0.61 శాతం మాత్రమే.
- మృతి చెందిన, ఇంటి మార్పు, డూప్లికేట్ ఓటర్లపై వచ్చిన ఫిర్యాదుల విషయానికి వస్తే.. వీటికి సంబంధించి 14.48 లక్షల దరఖాస్తులు వస్తే అందులో 5.65 లక్షల ఓటర్లు చనిపోవడం లేదా శాశ్వతంగా వేరే చోటికి వెళ్లిపోవడం, ఒకటి కంటే ఎక్కువ ఓట్లు ఉండటం గుర్తించి వాటిని తొలగించాం.
- ఒకే ఇంటి నంబర్‌పై పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేసులను పరిశీలించడానికి మా సిబ్బంది 1.57 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించి 20 లక్షల ఓట్లను పరిశీలించడం జరిగింది. అక్టోబర్ 27, 2023 నాడు ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఈ విధంగా 9.49 లక్షల ఓట్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్యను 65,964కు తగ్గించడం జరిగింది. ఇందులో 4.52 లక్షల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు తేలగా 26,679 మంది ఓటర్లకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మిగిలిన వారు ఆ ఇంటి నంబర్లలోనే నివసిస్తున్నారు.
- జీరో ఇంటి నంబర్‌తో నమోదయ్యాయంటూ వచ్చిన ఫిర్యాదుల విషయానికి వస్తే.. ఆ విధంగా 2.52 లక్షల కుటుంబాలు కనపడ్డాయి. వాటిలో 97 శాతం చిరునామా నమోదు చేయడం ద్వారా సరిదిద్దడం జరిగింది.

ఒకరికి ఒక చోటే ఓటు ఉండాలి

ఒకరికి ఒక చోట మాత్రమే ఓటు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లను కలిగి ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఎన్నికల చట్ట ప్రకారం ఆస్తులు లేకపోయినా నివసిస్తున్న చోట (ఆర్డినరీ రెసిడెన్స్) ఓటు హక్కు కలిగి ఉండవచ్చు. ఊరిలో ఆస్తులు ఉన్నంత మాత్రాన అక్కడ నివాసం ఉండకపోతే మాత్రం ఓటు నమోదు చేసుకోవడం కుదరదు. తెలంగాణలో ఓటు వేసి ఇప్పుడు అక్కడ తొలగించుకొని ఇక్కడ నమోదు చేసుకుంటున్నారంటూ వస్తున్న ఆరోపణలపై చాలా జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నాం. తప్పుడు స్టేట్‌మెంట్స్ సమర్పించి ఓటు నమోదు చేసుకున్నట్లు తేలితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.